ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 19.11.2026 | సంపుటి:13 సంచిక:119 | పేజీలు:12 వెల:రూ.4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ఆంధ్రా జలదోపిడీ

సాగర్ డెడ్‌స్టోరేజీ నుంచి నీళ్లను ఎత్తుకెళ్తున్నారు

ఏపీలో లేని క్రాప్ holiday తెలంగాణకు ఎందుకు?: కేటీఆర్



హైదరాబాద్(జనంసాక్షి): ఉమ్మడి పాలమూరు జిల్లాలో కరవుకు కాంగ్రెస్ పార్టీయే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కృష్ణా జలాల విషయంలో తొలిసారి అన్యాయం చేశారన్నారు. గతంలో తుమ్మిళ్ల లిఫ్ట్‌ను కేసీఆర్ ఏర్పాటు చేసి ఆర్డీఎస్‌ను కాపాడారని చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.' 'గతంలో నదీ జలాల విషయంలో అన్యాయం జరిగిందని కేసీఆర్ చాలా సార్లు చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెలంగాణ ఏర్పడింది. నీళ్ల విషయంలో మిగతా 2లో..

కోటి కుటుంబాలకు ఇందిరమ్మ బీమా

నేడు సిద్ధిపేట వేదికగా ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలోని కోటి కుటుంబాలకు ఇందిరమ్మ బీమా పథకం ప్రారంభం కానుంది. సిద్దిపేటలో గురువారం ఇందిరమ్మ కుటుంబ బీమా నమోదు ప్రక్రియ, చీరల పంపిణీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు ఇందిరమ్మ బీమా అందాలని ఆదేశించారు. ప్రస్తుతం వివిధ శాఖల్లో అమలవుతున్న బీమా పథకాలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా అందించాలని సీఎం స్పష్టం మిగతా 2లో..

దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని

ధైర్యశాలి ఇందిరా గాంధీ

సమగ్రత, సమైక్యత, ఐక్యత కోసం తన జీవితాంతం కృషి చేసిన గొప్ప నాయకురాలు

జయంతి సందర్భంగా ఆమె సేవలను గుర్తుచేసుకున్న సీఎం రేవంత్ 2లో

ఎస్సీ, ఎస్టీల సంక్షేమంలో ముందున్నాం

- **ఎస్సీ వర్గీకరణను అమలు చేసి చూపించాం**
- **రాజకీయంగా అత్యధిక అవకాశాలు కల్పించాం**
- **పార్లమెంటరీ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

హైదరాబాద్(జనంసాక్షి): ఎస్సీ, ఎస్టీలకు తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై పార్లమెంటరీ కమిటీ చైర్మన్ డాక్టర్ ఫగ్గన్ సింగ్ కులస్తే, కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తున్నామని సీఎం కమిటీకి వివరించారు. మిగతా 2లో..

కృష్ణా జలాల్లో బీఆర్ఎస్ మరణశాసనం రాసింది

- **సోనియాను విమర్శించే ముందు తెలంగాణ చరిత్ర గుర్తుచేసుకోండి**
- **నాగార్జునసాగర్‌కు శంకుస్థాపన చేసిన నెహ్రూ కృషిని తక్కువ చేస్తారా?**
- **పదేళ్లలో కృష్ణా బేసిన్‌కు బీఆర్ఎస్ ఏం చేసింది?:మంత్రి ఉత్తమ్**



హైదరాబాద్ (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సోనియా గాంధీ తీసుకున్న నిర్ణయాన్ని విస్మరించి ఆమెపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యలు చేయడం కృతఘ్నత అని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. సోనియా గాంధీ సంకల్పం లేకుంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదే కాదని, ఈ విషయాన్ని కేసీఆర్ కూడా శాసనసభలో చెప్పారని గుర్తుచేశారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ నాయకత్వం తీరుపై తీవ్ర విమర్శలు చేశారు."సోనియా గాంధీ పుస్తకంలో తెలంగాణ ప్రస్తావన ఉందా, లేదా అన్నది అసలు విషయం కాదు. తెలంగాణ ఏర్పాటు కోసం ఆమె తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని గుర్తుంచుకోవాలి. రాష్ట్రం ఏర్పడిన తరువాతే కేటీఆర్ కుటుంబానికి తెలంగాణలో పదవులు వచ్చాయి. ఆ విషయాన్ని మరిచి, తెలంగాణ ఇచ్చిన నాయకురాలిపై విమర్శలు మిగతా 2లో..



పతనం అంచున భారత ఆర్థిక వ్యవస్థ

మేక్ ఇన్ ఇండియా విఫలమైంది


ఎన్నికల వ్యవస్థను పునరుద్ధరించడమే మా లక్ష్యం : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ(జనంసాక్షి): భారత్ ఆర్థిక వ్యవస్థ పెను ప్రమాదంలో ఉందని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు.భారత్ ఆర్థిక వ్యవస్థ పెను ప్రమాదంలో ఉందని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. దేశంలో భారీగా నిరుద్యోగం మిగతా 2లో..

వాహ్ వా.. వాయెజర్-1

49 ఏళ్ల ప్రయాణం అనంతరం 'లైట్ డే' దూరంలోకి చేరుకున్న వ్యోమనౌక

2లో



లొంగిపోయేందుకు నిరాకరించిన లతీఫ్..

ఎన్‌కౌంటర్‌లో కాల్చివేత

2లో



వెండి ధరలు పతనం

కిలో వెండి ధర రూ.1.70 లక్షల దిగువకు..





జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
19.11.2026

ఆంధ్రా జలదోపీడీ

రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు జిల్లాలో 8 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు అందించాం. కేసీఆర్ పాలనలో ఇతర జిల్లాల నుంచి అక్కడికి వలసలు వచ్చారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును ఆపేందుకు కాంగ్రెస్ నేతలు కేసులు వేశారు. మేం అధికారంలో ఉన్నప్పుడు పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చాం. తెలంగాణకు ఉమ్మడి ఏపీ పాలకుల కంటే సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కువగా నష్టం చేశారు. సాగర్ నుంచి నీళ్లు తీసుకుంటుంటే నల్గొండ జిల్లా మంత్రులు ఏం చేస్తున్నారు? ఏపీలో లేని క్రాప్ holiday తెలంగాణకు ఎందుకు?ఏపీ ప్రభుత్వం నీళ్లు తీసుకుపోతుంటే రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ ఏం చేస్తున్నారు?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

వెండి ధరలు పతనం

న్యూఢిల్లీ(జనంసాక్షి):గత కొన్ని రోజులుగా బంగారం, వెండి ధరలు దిద్దుబాటుకు గురవుతున్నాయి. యూఎస్ ట్రెజరీ బాండ్ ఈల్డ్స్ పెరగడం, అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లు పెంచుతుందన్న అంచనాలతో వీటి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. అయితే, ఈ రెండు లోహాల్లో వెండి ధర పతనం కాస్త భిన్నం. ఈ ఏడాది ప్రారంభంలో ఔన్సు వెండి 120 డాలర్లు దాటింది. దేశీయంగా కిలో వెండి ధర రూ.4 లక్షలు మించింది. బంగారంతో పోలిస్తే శరవేగంగా దూసుకెళ్లి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఎప్పుడూ రూ.లక్షలోపే ఉండే వెండి ఈ స్థాయికి వెళ్లడం చూసి అప్పట్లో ముక్కున వేలేసుకున్నారు. ఇప్పుడు అదే స్థాయిలో పతనమవుతోంది.

1980 గరిష్ఠాల దిగువకు

అంతర్జాతీయ మార్కెట్‌లో గత కొంతకాలంగా ఔన్సు వెండి 50 డాలర్ల దిగువనే ట్రేడవుతోంది. బుధవారం మరింత క్షీణించి 45.87 డాలర్ల స్థాయికి చేరింది. దీంతో దేశీయంగా ప్రస్తుతం కిలో వెండి ధర రూ.1.70 లక్షల దిగువన పలుకుతోంది. అంతర్జాతీయంగా దీని ధర చూసినప్పుడు 1980, 2011లో గరిష్ఠ స్థాయిల కంటే దిగువన వెండి ట్రేడవుతోంది. చరిత్రలో 1980 జనవరి 18న వెండి 49.45 డాలర్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. ఆ తర్వాత మళ్లీ 2011 ఏప్రిల్ 20న 48.44 డాలర్ల వద్ద గరిష్ఠాలను నమోదు చేసింది. ఆ తర్వాత ఈ ఏడాది ప్రారంభంలో 120 డాలర్ల స్థాయికి చేరిన వెండి.. ఏడాది చివరికి వచ్చేసరికి 60 శాతానికి పైగా తన విలువను కోల్పోయింది.

భారీగా తగ్గిన బంగారం

అమెరికాలో ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉండటంతో ఫెడరల్ రిజర్వ్ మళ్లీ వడ్డీ రేట్లను పెంచుతుందనే అంచనాలు బలపడ్డాయి. వడ్డీ రేట్లు పెరిగితే వడ్డీ రాని వెండి వంటి లోహాలపై పెట్టుబడిదారులకు ఆసక్తి తగ్గుతుంది.అంతర్జాతీయ మార్కెట్లో అమెరికన్ డాలర్ విలువ, ట్రెజరీ బాండ్ ఈల్డ్స్ భారీగా పెరిగాయి. దీనివల్ల ఇన్వెస్టర్లు వెండి నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకుని సురక్షితమైన ప్రభుత్వ బాండ్ల వైపు మళ్లుతున్నారు. ఇతర ఆర్థిక సాధనాల్లో పెట్టుబడులు ఒత్తిడి ఎదుర్కొంటుండటంతో ఇన్వెస్టర్లు తమ నగదు అవసరాల కోసం బంగారం, వెండి వంటి లోహాలను విక్రయిస్తుండడం మరో కారణం. వెండికి పెట్టుబడి డిమాండ్‌తో పాటు పారిశ్రామిక వినియోగం ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం పారిశ్రామిక డిమాండ్ తగ్గవచ్చనే అంచనాలు కూడా వెండిపై అదనపు ఒత్తిడిని పెంచుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

వాహ్ వా.. వాయేజర్-1

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రయోగించిన వాయేజర్-1 అద్భుత రికార్డును సృష్టించింది. 1977లో ప్రయోగించిన ఈ ఖగోళ పరిశోధక వ్యోమనౌక.. భూమి నుంచి సరిగ్గా ఒక 'లైట్ డే' దూరం (కాంతి ఒక రోజులో ప్రయాణించే దూరం) చేరుకుంది. అంటే దాదాపు 2,600 కోట్ల కిలోమీటర్లు అన్నమాట. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి మానవ నిర్మిత వస్తువుగా గుర్తింపు పొందింది. అంతరిక్షంలో ఈ వ్యోమనౌక గంటకు సుమారు 61 వేల కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తోందని నాసా వెల్లడించింది.బాహ్య సౌర వ్యవస్థను, సూర్యుడి హెలియోస్పియర్‌కు ఆవలి.. నక్షత్ర మండలాల మధ్య ఉండే విస్తారమైన అంతరిక్ష ప్రాంతాన్ని అధ్యయనం చేసేందుకు వాయేజర్ కార్యక్రమాన్ని నాసా చేపట్టింది. ఇందులో భాగంగా 1977 సెప్టెంబర్ 5న వాయేజర్-1ను ప్రయోగించగా.. అప్పటి నుంచి అది అంతరిక్షంలోనే ప్రయాణిస్తోంది. 1979లో గురుడు, 1980లో శని గ్రహాలను దాటేసిన ఈ పరిశోధక నౌక 2012లో సౌరమండలాన్ని దాటి ఇంటర్‌స్టెల్లార్ స్పేస్‌లోకి ప్రవేశించింది. ఒక కాంతి సంవత్సరం దూరం వెళ్లడానికి ఈ వ్యోమనౌకకు మరో 18వేల ఏళ్లు పడుతుందని నాసా అంచనా వేస్తోంది.

కోటి కుటుంబాలకు ఇందిరమ్మ బీమా

చేశారు. బీమా వల్ల ఉపాధి హామీ కూలీలతోపాటు లక్షలాది మంది పేదలు లబ్ధి పొందుతారని అన్నారు. వివిధ శాఖల పరిధిలో రూ.2 లక్షల జీవిత బీమా, రూ.10 లక్షల ప్రమాద బీమా వంటివి అమల్లో ఉన్నాయని అధికారులు వివరించారు. ఆయా శాఖల్లో ప్రమాద బీమాను యథాతథంగా కొనసాగిస్తూ రూ.2 లక్షల బీమా పథకాలను ఇందిరమ్మ కుటుంబ బీమాకు అనుసంధానం చేయాలని సూచించారు. ఇప్పటికే బీమా ఉన్న వారితోపాటు రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని చేర్చాలని తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ బీమా పథకంపై విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. బీమా దరఖాస్తులను గ్రామస్థాయిలో అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు ఈ పథకంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సీఎం చెప్పారు.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపై మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో పాటు హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్లకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. ఇందిరమ్మ జీవిత బీమా కింద ప్రతి కుటుంబంలో సంపాదించే ఒక వ్యక్తి పేరిట బీమా నమోదు చేస్తారు. కుటుంబంలో ఒకరికి మించి సంపాదిస్తున్నా ఒకరికే నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. ఎవరిని నమోదు చేయించాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవాలి. ఆ వ్యక్తి మరణిస్తే రూ.5 లక్షల సాయాన్ని కుటుంబానికి అందిస్తారు.

ఇందిరమ్మ బీమా పథకం నమోదుకు ప్రత్యేక కేంద్రాలు

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కోసం ప్రత్యేక యాప్, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను కూడా అందుబాటులోకి తీసుకొస్తామని తెలంగాణ సీఎస్ సంజయ్ జాజు తెలిపారు. అర్హత కలిగిన ప్రతీ కుటుంబాన్ని నమోదు చేసేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో.. జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ వార్డుల్లో ఇందిరమ్మ కుటుంబ బీమా వివరాల నమోదు కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివిధ శాఖల్లో అమల్లో ఉన్న బీమా పథకాలన్నీ ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం గొడుగు కిందకు రానున్నట్లు తెలిపారు. నేత, గౌడ, కార్మిక, మత్స్యకారులకు అమలు చేస్తున్న రూ.2 లక్షల జీవిత బీమాను.. ఇందిరమ్మ బీమా పరిధిలోకి తీసుకొచ్చి రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు చెప్పారు.ఇందిరమ్మ కుటుంబ బీమా పథకంపై విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు.. మార్గదర్శకాలకు అనుగుణంగా నమోదు ప్రక్రియను పారదర్శకంగా, సమర్థంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సుమారు నెలరోజుల పాటు కొనసాగే ఇందిరమ్మ కుటుంబ బీమా నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలన్నారు.



ఎస్సీ, ఎస్టీల సంక్షేమంలో ముందున్నాం

శాసన సభ స్పీకర్ గా, మంత్రులుగా దళితులకు రాజకీయంగా సముచిత అవకాశం కల్పించామన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ తో పాటు వివిధ కార్పొరేషన్లలో అనేక అవకాశాలు కల్పించామని తెలిపారు. వందేళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉస్మానియా యూనివర్సిటీ వీసీగా దళితుడికి అవకాశం కల్పించామన్నారు. ఉస్మానియాతో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రాజీవ్ గాంధీ ఐఐటీ లలో ఎస్సీ, ఎస్టీలకు వీసీలుగా అవకాశాలు ఇచ్చామని వివరించారు. అర్హత, అవకాశం ఉన్న ప్రతీచోట ఎస్సీ, ఎస్టీలకు స్థానం కల్పించామని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలోనూ వారినే ప్రాధాన్యతగా తీసుకున్నామని వివరించారు. సీఎంఆర్ఎఫ్, ఆరోగ్యశ్రీ నిధులకు సంబంధించి 50 శాతం పైగా ఎస్సీ, ఎస్టీల కోసం ఖర్చు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని గుర్తు చేశారు. వర్గీకరణ అమలు చేయడం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుపై ముఖ్యమంత్రిని కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సమావేశంలో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీగణేశ్, కమిటీ సభ్యులు తాహీర్ గావ్, హరీశ్చంద్ర మీనా, అనిల్ ఫిరోజియా, అరుణ్ కుమార్, ప్రసాద రావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని ధైర్యశాలి ఇందిరాగాంధీ

హైదరాబాద్(జనంసాక్షి):భారతదేశ సమగ్రత, సమైక్యత, ఐక్యత కోసం తన జీవితాంతం కృషి చేసిన గొప్ప నాయకురాలు, పేదల ఆత్మ బంధువు, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. దేశం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసిన ధైర్యశాలి ఇందిరాగాంధీ అని స్మరించుకున్నారు. ఆమె చూపిన మార్గం, అమలు చేసిన సంక్షేమ విధానాలు నేటికీ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా దేశానికి ఆమె చేసిన సేవలను ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. దేశం ఎన్నో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్న సమయంలోనూ ధైర్యంగా నిర్ణయాలు తీసుకున్న నాయకురాలు ఇందిరాగాంధీ అని చెప్పుకొచ్చారు. బ్యాంకుల జాతీయీకరణ, రాజభరణాల రద్దు, 20 సూత్రాల కార్యక్రమం వంటి కీలక నిర్ణయాలతో దేశ ఆర్థిక, సామాజిక రంగాల్లో ఇందిరాగాంధీ అనేక మార్పులకు శ్రీకారం చుట్టారని సీఎం తెలిపారు. పేదలు, బడుగు బలహీన వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందించాలన్న లక్ష్యంతో ఆమె అమలు చేసిన పథకాలు దేశ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయని చెప్పారు. సామాన్యులకు ఆర్థిక భద్రత కల్పించడం, పేదలను అభివృద్ధిలో భాగస్వాములను చేయడం ఆమె పాలనలో ముఖ్యమైన అంశాలని గుర్తు చేశారు.

కృష్ణా జలాల్లో బీఆర్ఎస్ మరణశాసనం రాసింది

చేయడం బీఆర్ఎస్ నాయకుల నైజాన్ని బయటపెడుతోంది" అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు.మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలనూ మంత్రి తప్పుబట్టారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన నెహ్రూ కృషిని కేటీఆర్ తక్కువ చేసి మాట్లాడటం విడ్డూరమన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి సుమారు 21 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న నాగార్జునసాగర్ ఒక అద్భుతమైన ప్రాజెక్టు అని పేర్కొన్నారు. "లక్షలాది ఎకరాల ఆయకట్టుకు ఆధారమైన ప్రాజెక్టు గురించి మాట్లాడే ముందు, పదేళ్ల పాలనలో తాము పూర్తి చేసిన సాగునీటి ప్రాజెక్టులేమిటో బీఆర్ఎస్ చెప్పాలి" అని సవాల్ విసిరారు.సాగునీటి రంగంలో రూ.1.83 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెప్పుకుంటున్న బీఆర్ఎస్, ఆ వ్యయానికి తగిన ఫలితాలను రైతులకు అందించలేకపోయిందని ఉత్తమ్ ఆరోపించారు. పాలమూరు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, ఆర్డీఎస్ ఆధునికీకరణ, ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టుల పురోగతిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ సాగునీటి వ్యయంలో దాదాపు 75 శాతం గోదావరి బేసిన్‌కే కేటాయించి, కృష్ణా బేసిన్‌కు సుమారు 25 శాతమే వెచ్చించారని పేర్కొన్నారు. దీనివల్ల మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల రైతులకు అన్యాయం జరిగిందన్నారు.కృష్ణా జలాల విషయంలోనూ బీఆర్ఎస్ వైఖరి తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని మంత్రి విమర్శించారు. 811 టీఎంసీల నీటిలో ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించే నిష్పత్తికి గత ప్రభుత్వం అంగీకరించిందని చెప్పారు. తమ ప్రభుత్వం మాత్రం పరీవాహక ప్రాంతం, సాగునీటి అవసరాలు, జనాభా తదితర అంశాల ఆధారంగా తెలంగాణకు 555 టీఎంసీలు రావాలని కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ ముందు వాదిస్తోందని వివరించారు.బీఆర్ఎస్ పాలనలో ఆంధ్రప్రదేశ్ 4,464 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకోగా, తెలంగాణ వినియోగం 1,993 టీఎంసీలకే పరిమితమైందని ఉత్తమ్ పేర్కొన్నారు. ప్రస్తుత జల సంవత్సరంలో అక్టోబరు 30 నాటికి ఆంధ్రప్రదేశ్ 98.16 టీఎంసీలు వినియోగించుకోగా, తెలంగాణ 122.74 టీఎంసీలు వినియోగించుకుందని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి పథకాన్ని 2014లో ప్రకటించినప్పటికీ, దాని సమగ్ర ప్రాజెక్టు నివేదికను 2022లోనే సమర్పించారని, అనుమతుల సాధనలో జరిగిన జాప్యంతో ప్రాజెక్టు వ్యయం పెరిగిందని ఆరోపించారు.నాగార్జునసాగర్ జలాశయం నుంచి సుమారు 1.8 టీఎంసీల నీటిని తీసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన తాగునీటి పథకంపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే తీవ్ర అభ్యంతరాలు తెలిపిందని మంత్రి వెల్లడించారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తమ అభ్యంతరాలను పంపినట్లు చెప్పారు. తెలంగాణ నీటి హక్కులను ప్రభావితం చేసే ఏ పథకాన్నైనా వ్యతిరేకిస్తామని, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఉత్తమ్ స్పష్టం చేశారు.

ప్రపంచవ్యాప్తంగా కంప్యూటర్ రంగంలో వినియోగించే జావా ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ లోని తీవ్రమైన లోపాన్ని ఓ స్టార్టప్ సంస్థ గుర్తించింది. ఇందుకోసం వారు ఓపెన్ ఏఐకు చెందిన జీపీటీ-6 ఏఐ మోడల్‌ను వినియోగించడం గమనార్హం. కాలిఫ్ అనే సైబర్ సెక్యూరిటీ స్టార్టప్.. జావా మెమొరీ సిస్టమ్‌లోని లోపాన్ని గుర్తించింది. దీనికి 'జావా4షెల్' అని పేరుపెట్టింది. దీనిని హ్యాకర్లు వాడి అవాంఛిత ప్రోగ్రామ్‌లను రన్ చేసే ప్రమాదం ఉందని పేర్కొంది. ఇదే సంస్థ కొన్నాళ్ల క్రితం మరో ప్రోగామింగ్ లాంగ్వేజ్ పీహెచ్‌పీలో కూడా భారీ లోపాన్ని గుర్తించి.. ప్రపంచాన్ని అప్రమత్తం చేసింది. 1995లో విడుదలైన జావా లాంగ్వేజ్ ప్రపంచ ఆధునిక ఆర్థిక వ్యవస్థకు గుండె చప్పుడు వంటిదని అభివర్ణించింది.ఇక ఫార్చ్యూన్ 500 సంస్థల్లో 90% తమ వెబ్‌సైట్లకు జావా లాంగ్వేజ్‌నే వినియోగిస్తున్నాయి. వీటిల్లో యాపిల్, అమెజాన్ వంటి టెక్ దిగ్గజాలతోపాటు.. బ్యాంకులు, ఆసుపత్రులు, ప్రభుత్వాలు ఉన్నాయి.

అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

కల్లూరు పట్టణంలో నూతన పెన్షన్ లబ్ధిదారులకు ప్రొసిడింగ్స్ పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే మట్టారాగమయి



కల్లూరు, నవంబర్ 18(జనంసాక్షి):అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.బుధవారం కల్లూరు పట్టణంలోని వికేఆర్ ఫంక్షన్ హాల్‌లో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి కల్లూరు మండలం, మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గత పాలకులు రాష్ట్రంపై రూ.8 లక్షల 21 వేల కోట్ల అప్పుల భారం మోపినప్పటికీ పేదలకు అందించే సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి కోతలు విధించకుండా అమలు చేస్తున్నామని తెలిపారు..రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, గత పాలకులు వరి వేస్తే ఉరి అనే తప్పుడు ప్రచారం చేయగా, ప్రజా ప్రభుత్వం సన్న వడ్లు పండించిన రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 72 వేల మందికి నియామక పత్రాలు అందించడంతో పాటు మరో 14 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేశామని, భవిష్యత్తులో నిరుద్యోగ యువత కోసం మరిన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని తెలిపారు.పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, పేదలకు సన్న బియ్యం పంపిణీ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గత పదేళ్లలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా మంజూరు చేయని పరిస్థితి ఉండగా, ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేసిందన్నారు.రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మహిళా సంఘాలకు 33 నెలల్లో రూ.73 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించామని తెలిపారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు బస్సులు, క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు, సోలార్ విద్యుత్ ప్లాంట్ల నిర్వహణ వంటి అనేక రంగాల్లో అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు.పేదల చిరకాల స్వప్నమైన సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, రెండవ విడతలో 2.5 లక్షల ఇళ్లు, హైదరాబాద్ ప్రాంతంలో మరో లక్ష ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. పేదింటి మహిళలు సొంతంగా ఇళ్లు నిర్మించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. కులం, మతం, రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, మూడవ, నాలుగవ విడతల్లోనూ ఇళ్లను అందిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అంచనా వేస్తూ ఒక్కో సంక్షేమ పథకాన్ని అమలు చేస్తున్నామని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని మంత్రి తెలిపారు. గతంలో బతుకమ్మ చీరలను మహిళలు ధరించని పరిస్థితి ఉండగా, నేడు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ చీరలను రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు సంతోషంగా ధరిస్తున్నారని చెప్పారు. సిద్దిపేట నియోజక వర్గంలో ఈసారి చిలకపచ్చ రంగు చీరలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు పేద ప్రజలకు అవసరమైన అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆలోచించి అమలు చేస్తోందన్నారు. మహిళా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందని, నేడు మహిళలు ఆధార్ కార్డుతో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణిస్తున్నారని తెలిపారు.ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజల వైద్య అవసరాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, గత పాలకులు ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని, ప్రజా పాలనలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డులు అందించి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పేద కుటుంబాలపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం రేషన్ ద్వారా ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు.

పతనం అంచున భారత ఆర్థిక వ్యవస్థ



పెరిగిపోతుందని, విద్యా వ్యవస్థను నాశనమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర పథకాలైన మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియాలు దారుణంగా విఫలమయ్యాయని విమర్శించారు. దేశంలో ప్రైవేటు పెట్టుబడులు రావడం లేదన్న రాహుల్, కేవలం అదానీ, అంబానీ లాంటి బడా వ్యాపారవేత్తలు మాత్రమే ఎందుకు ఎదుగుతున్నారని ప్రశ్నించారు. అమెరికాలో పర్యటిస్తున్న ఆయన న్యూయార్క్‌లోని ప్రతిష్టాత్మక కొలంబియా యూనివర్సిటీలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు." చిన్న, మధ్యతరహా వ్యాపారాలు, వ్యవసాయ రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటివి. కానీ, దురదృష్టవశాత్తూ ఆ వెన్నెముక ఇప్పుడు విరిగిపోయింది. గౌతమ్ అదానీ, ముకేశ్ అంబానీలతో సహా కేవలం కొన్ని పెద్ద వ్యాపార సమూహాలు మాత్రమే విస్తరిస్తున్నాయి. కానీ, చిన్న వ్యాపారాలు మాత్రం ఇబ్బందులు పడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎంతో శ్రమతో నిర్మించిన ఆర్థిక వ్యవస్థ బలహీనపడింది. బలమైన ఉత్పాదక రంగం లేకుండా దేశం అభివృద్ధి చెందడం కష్టం. దాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఉంది."
అని అన్నారు.

ఎన్నికల వ్యవస్థను పునరుద్ధరించడమే మా లక్ష్యం'

గడిచిన రోజుల్లో దిల్లీతో సహా దేశంలోని కొన్ని ప్రాంతాల్లో చెలరేగిన విద్యార్థి నిరసనల గురించి రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ఆ నిరసనలు ఆకస్మికమైనవి కావని, దాదాపు దశాబ్ద కాలంగా రాజకీయ, ఆర్థిక అధికార కేంద్రీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రతిఘటనల్లో భాగమని వ్యాఖ్యానించారు. సమాజంలో జరుగుతోన్న అన్యాయాన్ని ప్రశ్నించడానికి భారత యువత ఏకమయ్యారని, విద్యార్థి ఉద్యమాన్ని లేవనెత్తారని చెప్పారు. అలాగే, ఎన్నికల అవకతవకలు భారతదేశంలో ప్రజాస్వామ్య ప్రక్రియను దెబ్బతీశాయని రాహుల్ ఆరోపించారు. దానిని పునరుద్ధరించడానికి అవసరమైన చర్యల్లో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించడం కూడా ఒకటని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సంఘం సాయంతోనే అధికార బీజేపీ దేశంలో ఓటుచోరీకి పాల్పడుతోందని రాహుల్ ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా 2024లో ఓటు వేసిన సుమారు 14 కోట్ల మంది ప్రజలను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని ధ్వజమెత్తారు. అయితే, ఎన్నికల వ్యవస్థను పునరుద్ధరించడమే తమ లక్ష్యమని, ఆ లక్ష్యం దిశగా తమ పార్టీ పనిచేస్తోందని రాహుల్? గాంధీ స్పష్టం చేశారు. ఎన్నికల అవకతవకలకు సంబంధించిన సాక్ష్యాలను ఇప్పటికే సేకరించామని తెలిపారు. అంతేకాదు, గతంలో బయటకు వచ్చి మాట్లాడటానికి భయపడిన చాలామంది ఇప్పుడు ముందుకు వచ్చి కాంగ్రెస్‌తో సమాచారాన్ని పంచుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తు గురించి విద్యార్థుల్లో ఆందోళన మరోవైపు, సరైన ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో దేశ యువత తమ భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. నిరుద్యోగం, పరిమితమైన ఉద్యోగ అవకాశాలు, విద్యా వ్యవస్థలో లోపాలు, నేటి కాలంలో తీవ్రమైన సవాళ్లుగా మారాయని ఆరోపించారు. అంతే కాకుండా కెరీర్ అవకాశాల విషయంలో యువతకు, వారి తల్లిదండ్రులకు మధ్య అగాధాలు పెరుగుతున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో మునుపటి తరం ఇచ్చే సలహాలను, వారి అనుభవాలను నేటి యువత ప్రశ్నిస్తోందని అన్నారు. ఉద్యోగాలు లేని తల్లిదండ్రుల మాదిరిగా తామూ ఉండటానికి కొందరు ఇష్టపడటం లేదని పేర్కొ



10 కోట్ల ధాన్యం మాయం!

అలంపూరు, నవంబర్ 18 (జనం సాక్షి) : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ పరిధిలోని 'ఎం,ఎస్ జోగులాంబ రైస్ మిల్లు'లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు నిర్వహించిన ఆకస్మిక భౌతిక తనిఖీల్లో భారీ కుంభకోణం వెలుగుచూసింది. ప్రభుత్వ కస్టమ్ మిల్లింగ్ రైస్ కింద కేటాయించిన సుమారు రూ. 10.22 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం మిల్లులో లేకపోవడం అధికారులను విస్మయానికి గురిచేసింది.ఇటీవలి రబీ 2024-25, ఖరీఫ్ 2025-26 సీజన్లకు సంబంధించిన వేల క్వింటాళ్ల ధాన్యం నిల్వల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నట్లు తనిఖీ బృందం గుర్తించింది. అంతేకాకుండా, 2013 నుండి 2026 మధ్య వివిధ సీజన్లకు చెందిన పాత బకాయిలు, రికార్డులను పరిశీలించగా ఏళ్ల తరబడి సాగుతున్న అక్రమాలు బట్టబయలయ్యాయి. రైతుల పేరుతో సేకరించిన ప్రభుత్వ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో అక్రమంగా విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. పదేళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా, సంబంధిత యంత్రాంగం పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ స్థాయిలో అవినీతి జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొట్టిన మిల్లు యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, రికవరీ చర్యలు చేపట్టేందుకు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలి

రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

చెన్నూర్, నవంబర్ 18 (జనంసాక్షి) : ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి విద్యా ప్రమాణాలు, హాజరు శాతం, ఏకాగ్రతను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని కోటపల్లి మండలంలో గల మోడల్ స్కూల్‌లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, కోటపల్లి మండల తహసీల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వరరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ తివారి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యారంగంలో భారీగా పెట్టుబడులు పెట్టడం జరుగుతుందని తెలిపారు. ఉదయం పూట అల్పాహారం తీసుకోకుండా పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు సి.ఎం. బ్రేక్‌ఫాస్ట్ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రోజంతా ఉత్సాహంగా చదువుకోవడంతో పాటు క్రీడలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుండగా, మంచిర్యాల



జిల్లాలో సుమారు 35 వేల మంది విద్యార్థులకు, చెన్నూర్ నియోజకవర్గంలో సుమారు 12 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు 100 శాతం డిస్టింక్షన్ ఫలితాలు సాధిస్తే పాఠశాలకు ప్రత్యేక బహుమతి అందజేస్తానని తెలిపారు. మోడల్ స్కూల్‌లో సుమారు 500 మంది విద్యార్థులకు ఉపయోగపడేలా భోజనశాల నిర్మాణానికి 40 లక్షల రూపాయలు అవసరమని, ఇందులో 20 లక్షల రూపాయలు జిల్లా కలెక్టర్ ద్వారా, మరో 20 లక్షల రూపాయలు డిఎంఎఫ్‌టి నిధుల నుండి కేటాయించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేస్తున్నామని, ఇప్పటికే డిగ్రీ కళాశాలకు 2 కోట్ల రూపాయలు, ఇంటర్మీడియట్ కళాశాలకు 1.50 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని, కోటపల్లిలో సుమారు 90 లక్షల రూపాయలతో ఎస్.సి. వసతి గృహ నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలోని సోమనపల్లిలో 2 వేల 500 మంది విద్యార్థులకు వసతి సౌకర్యాలతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థుల వసతి అవసరాలను దృష్టిలో ఉంచుకొని అదనపు వసతి గృహ సీట్ల మంజూరు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. విద్యార్థులు సంప్రదాయ విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వివిధ నైపుణ్యాలను అభ్యసించాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం ఇప్పటికే సగటున 75 శాతానికి పైగా ఉండగా, కొన్ని సందర్భాలలో 80 శాతానికి చేరుతుందని తెలిపారు. ఈ పథకాలతో రానున్న రోజులలో హాజరు శాతం, విద్యా ఫలితాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. విద్యార్థులు మంచి ప్రవర్తన, సానుకూల దృక్పథం, క్రమశిక్షణ, కష్టపడే తత్వాన్ని అలవర్చుకొని తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థుల అభ్యున్నతికి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అనంతరం మంత్రి, జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించి, ఆహార నాణ్యత, మెనూ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ల్యాబ్ గదిని ప్రారంభించారు. చెన్నూర్ మండలం కన్నేపల్లి నుండి సంకారం వరకు 90 లక్షల రూపాయల ఎం.ఆర్.ఆర్. 2024-25 నిధులతో పునరుద్ధరించిన బి.టి. రహదారిని ప్రారంభించారు. సంకారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు బెంచీలను అందజేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన వసతులను సమకూర్చాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ కార్యాలయం టేకు చెట్ల నరికివేత..

- రక్షణ శాఖ ప్రాంగణంలో తొలగింపు కలకలం..
- రెండు టేకు చెట్లు తొలగించినట్లు రేంజ్ అధికారి వెల్లడి..
- పుచ్చు పట్టిన చెట్లంటూ అధికారుల వివరణ..
- ఉన్నతాధికారుల అనుమతులు తీసుకున్నారా?
- తమకు ముందస్తు సమాచారం లేదంటున్న రేంజ్ అధికారి..
- కలప కార్యాలయంలోనే ఉందని స్పష్టీకరణ..
- తొలగింపు ప్రక్రియపై విచారణతోనే అసలు విషయం తేలేనా?



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): అటవీ సంపదకు రక్షణగా నిలవాల్సిన ఫారెస్ట్ శాఖ కార్యాలయ ప్రాంగణంలోనే టేకు చెట్ల తొలగింపు వ్యవహారం భూపాలపల్లిలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అక్రమ చెట్ల నరికివేత, కలప రవాణాపై నిఘా పెట్టాల్సిన ఫ్లై స్క్వాడ్ కార్యాలయం ఎదుటే టేకు చెట్లు తొలగించడంపై పలు ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. కార్యాలయ ఆవరణలో మూడు ట్రాక్టర్లు నిలిపే ప్రాంతం మధ్యలో, చింతచెట్టు సమీపంలో ఉన్న టేకు చెట్లను తొలగించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చంద్రమౌళి స్పందిస్తూ.. రెండు టేకు చెట్లను తొలగించినట్లు గుర్తించామని, అవి పుచ్చు పట్టిన చెట్లని వెల్లడించారు. తొలగించిన కలప ఎక్కడికీ తరలిపోలేదని, కార్యాలయ ప్రాంగణంలోనే ఉందని స్పష్టం చేశారు. అయితే ఈ తొలగింపుపై తమకు ముందస్తు సమాచారం లేదని, డీఎఫ్‌వో పైతం వచ్చి పరిశీలించారని, బాధ్యులెవరన్నది విచారణ చేస్తున్నామని తెలిపారు. దీంతో అటవీ శాఖ కార్యాలయ ప్రాంగణంలోనే చెట్ల తొలగింపు జరగడం, సంబంధిత అధికారులకు ముందస్తు సమాచారం లేకపోవడం చర్చకు దారితీస్తోంది.

అనుమతులు లేకుండానే తొలగించారా?

చెట్లు పుచ్చు పట్టినవని అధికారులు చెబుతున్నప్పటికీ వాటిని తొలగించేందుకు అనుసరించిన విధివిధానాలపై స్పష్టత రావాల్సి ఉంది. చెట్ల తొలగింపునకు ఉన్నతాధికారుల అనుమతి తీసుకున్నారా? అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయా? తొలగింపు బాధ్యత ఎవరు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాలు లభించాల్సి ఉంది. సాధారణంగా చెట్ల తొలగింపునకు సంబంధించి కారణాలు, అనుమతులు, కలప వివరాలను రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. మరి ఈ రెండు టేకు చెట్ల విషయంలో అటువంటి ప్రక్రియను పాటించారా? అన్నది తేలాల్సి ఉంది.

ఫ్లై స్క్వాడ్ కార్యాలయం ఎదుటే..!

అటవీ ప్రాంతాల్లో అక్రమంగా చెట్లను నరికివేయడం, కలపను తరలించడం వంటి ఘటనలను అడ్డుకోవాల్సిన బాధ్యత ఫ్లై స్క్వాడ్‌పై ఉంటుంది. అలాంటి విభాగం కార్యాలయం ఎదుటే చెట్ల తొలగింపు జరగడం విస్మయం కలిగిస్తోంది. కార్యాలయ ప్రాంగణంలోని చెట్ల తొలగింపు విషయం సిబ్బందికి తెలియదా? ఎవరి పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరిగింది? రేంజ్ అధికారి తమకు ముందస్తు సమాచారం లేదని చెప్పడం మరిన్ని సందేహాలకు తావిస్తోంది.

విచారణలో వెలుగుచూడనున్న వాస్తవాలేవి?

నరికిన కలప కార్యాలయ ప్రాంగణంలోనే ఉందని అధికారులు చెబుతున్న నేపథ్యంలో దాని పరిమాణం, నాణ్యత, ప్రస్తుత నిల్వ వివరాలను పరిశీలించి అధికారికంగా నమోదు చేయాలి. చెట్లు పుచ్చు పట్టినవేనని నిర్ధారించే ఆధారాలు, తొలగింపునకు సంబంధించిన అనుమతులు, రికార్డులు, అందుబాటులో ఉన్న సీసీ కెమెరాల దృశ్యాలను ఉన్నతాధికారులు పరిశీలించాలి. నిబంధనల ప్రకారమే చెట్లను తొలగించారా? ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించారా? అన్నది సమగ్ర విచారణతో తేల్చాల్సి ఉంది. అటవీ సంపదను కాపాడాల్సిన శాఖ కార్యాలయంలో చోటుచేసుకున్న ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి మరి..

పుస్తకాల పక్కనే పేకముక్కలు

షాద్‌నగర్ గిరిజన వసతి గృహంలో పేకాట కలకలం

- పుస్తకాల మాటున జూదం.. రీల్స్‌గా చిత్రీకరణ
- పరీక్షల వేళ అధికారుల పర్యవేక్షణ ఏది?

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : చదువుకోవాల్సిన వసతి గృహ గదిలో విద్యార్థులు పేకాట ఆడుతూ, ఆ దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో రీల్స్‌గా పోస్టు చేయడం కలకలం రేపుతోంది. షాద్‌నగర్ పట్టణంలోని గిరిజన బాలుర వసతి గృహంలో చోటుచేసుకున్న ఈ ఘటన విద్యార్థుల క్రమశిక్షణ, అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. వసతి గృహంలోని ఓ గదికి తలుపులు వేసుకుని కొందరు విద్యార్థులు పేకాట ఆడుతున్న దృశ్యాలను వీడియోలుగా చిత్రీకరించారు. బయట నుంచి మరో విద్యార్థి తలుపు తీయగానే 'నువ్వేనా.. సార్ వచ్చాడనుకున్నాం' అంటూ మాట్లాడటం, పక్కనే పుస్తకాలు పెట్టుకుని పేకాట ఆడటం వీడియోల్లో కనిపిస్తోంది. ఈ దృశ్యాలను రీల్స్‌గా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం చర్చనీయాంశమైంది.

పరీక్షల వేళ ఇదేం నిర్వాకం?

ప్రస్తుతం డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న సమయంలో విద్యార్థులు చదువును పక్కనపెట్టి పేకాట, రీల్స్‌తో కాలక్షేపం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పిల్లల భవిష్యత్తుపై ఆశలు పెట్టుకుని కష్టపడి చదివిస్తున్న పేద, గిరిజన



తల్లిదండ్రుల ఆశలను కొందరు విద్యార్థులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది. వసతి గృహాల్లో విద్యార్థుల ప్రవర్తనను పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, బాధ్యులైన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు వసతి గృహాల పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని పలువురు కోరుతున్నారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ రెడ్డి మృతి



గూడూరు, నవంబర్18 (జనంసాక్షి): మహబూబాబాద్ జిల్లా గూడూరు పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ గోపతి శ్రీనివాస్ రెడ్డి (58)గుండె పోటుతో బుధవారం మృతి చెందారు. ఎస్సై రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ రెడ్డి గత మూడు నెల క్రితం ఖమ్మం జిల్లా నుంచి హెడ్ కానిస్టేబుల్ పదోన్నతిపై గూడూరు పోలీస్ స్టేషన్ కు వచ్చారు. ఆయన స్వగ్రామం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం దమ్మపేట గ్రామం.బుధవారం గుండెనొప్పి వస్తుందని మానుకోటలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందారని తెలిపారు.భార్య వరలక్ష్మి కొద్ది రోజుల క్రితం మృతి చెందింది.కానిస్టేబుల్ మృతితో పోలీస్ స్టేషన్ లో విషాద ఛాయలు అమలు కున్నాయి.

240 కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటుకు ఓకే

హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో 240 కొత్త ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. రాష్ట్రంలో సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసు కుంది. రాష్ట్రవ్యాప్తంగా 240 కొత్త ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఏర్పాటు, ఇప్పటికే ఉన్న సంఘాల పునర్వ్యవ స్థీకర ణకు తదుపరి చర్యలు చేపట్టేందుకు వ్యవసా య, సహకార శాఖ అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు 11 నవంబర్ 2026న ప్రభుత్వ మెమో జారీ అయింది. నిబంధనల ప్రకారం అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసి తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ప్రభుత్వం

ఐదంతస్తుల భవనం పైనుంచి దూకిన మహిళ

కుటుంబ కలహాలే కారణమని అనుమానం.. పరిస్థితి విషమం



నిర్మల్ బ్యూరో, నవంబర్ 18,(జనంసాక్షి): కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ మహిళ ఐదంతస్తుల భవనం పైనుంచి దూకి ఆత్మహత్యాయ త్నానికి పాల్పడిన ఘటన బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో కలకలం రేపింది. శివాజీ చౌక్ సమీపంలోని ఓ వస్త్ర దుకాణం పక్కన ఉన్న భవ నంపై నుంచి సంగీత అనే మహిళ దూకడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను జిల్లా ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తు న్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. సారంగా పూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన వ్యక్తితో సంగీతకు వివాహమైంది. గత కొన్ని నెలలుగా భర్త, అత్త, ఆడపడుచుల వేధింపులతో ఆమె మానసికంగా కుంగిపోయినట్లు తెలుస్తోంది. ఈ విషయమై గతంలో పోలీసులకు ఫిర్యాదు చేయగా, దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహించినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదని సమాచారం. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన సంగీత భవనంపైకి వెళ్లగా, కుటుంబ సభ్యులు, బంధువులు, పోలీసులు కిందకు రావాలని పలుమార్లు కోరినా ఆమె స్పందించలేదు. చివరకు భవనంపై నుంచి దూకడంతో తీవ్ర గాయాల పాలైంది. సంగీతకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అడవి జంతువుల కోసం అమరిస్తే ఆగమైన కుటుంబం

కరెంటు తీగ తగిలి రైతు మృతి

- శోకసముద్రంలో కుటుంబం



గోవిందరావుపేట, నవంబర్18 (జనం సాక్షి): అడవి జంతువుల కోసం విద్యుత్ తీగ ఆమరిస్తే అదే కరెంటు తీగ మృత్యు రూపం లో ఒక ప్రాణాన్ని కబళించడంతో ఓ రైతు ప్రాణాలు కోల్పోయాడు. వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందిన విషాద ఘటన మండలంలో చోటుచేసుకుంది.మండల పరిధిలోని దుంపెల్లిగూడెం గ్రామానికి చెందిన పన్నాల శ్రీనివాస్ రెడ్డి (48) మంగళవారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కర్లపల్లి శివారు ప్రాంతంలోని తన వ్యవసాయ పొలంలో కుమారుడు అభిలాష్‌తో కలిసి ట్రాక్టర్‌పై వెళ్లిన శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ పనులు ముగించుకుని తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యలో ట్రాక్టర్ రాకపోకలకు అడ్డుగా ఉన్న పైపులను తొలగించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో సమీపంలో ఉన్న విద్యుత్ తీగ తగలడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచాడు.కళ్ల ముందే తండ్రి ప్రాణాలు కోల్పోవడంతో కుమారుడు అభిలాష్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాడు.ఘటనపై సమాచారం అందుకున్న ఎస్సై సీ.ఐ దయాకర్, ఎస్సై తాజుద్దీన్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.మృతుడు శ్రీనివాస్ రెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న రైతు ఆకస్మిక మృతితో దుంపెల్లిగూడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

యువతలోని ప్రతిభకు యువజన ఉత్సవాలు చక్కని వేదిక

- రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి ఆదిలాబాద్‌కు గుర్తింపు తీసుకురావాలి
- జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ప్రారంభించిన ఎంపీ గోడం నగేష్, కలెక్టర్ రాజర్షి షా



మావల నవంబర్ 19 (జనం సాక్షి): ఆదిలాబాద్ యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, కళా నైపుణ్యాలను వెలికితీసేందుకు యువజన ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎంపీ గోడం నగేష్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ఎంపీ గోడం నగేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, జిల్లా కలెక్టర్ రాజర్షి షా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ.. యువత పోటీతత్వాన్ని అలవర్చుకుని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, నృత్యాలకు ఎంతో ప్రాచీన చరిత్ర ఉందని, పురాతన దేవాలయాల్లోని శిల్పకళలోనూ మన పూర్వీకుల కళా వైభవం, నృత్యరీతులు ప్రతిబింబిస్తాయని వివరించారు. గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుతూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. పోటీల్లో పాల్గొనేటప్పుడు అందుబాటులో ఉన్న సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని తమలోని ప్రతిభను సంపూర్ణంగా ప్రదర్శించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. యువతలోని ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడంతోపాటు వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు యువజన ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఓ స్టెప్ సతీష్, పోటీల న్యాయ నిర్ణేతలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, యువతీయువకులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్‌కు సంబంధించిన దస్తావేజులు కనిపించడం లేదు

రంగారెడ్డి గూడ గ్రామం.రాజాపూర్ మండలం, మహబూబ్ నగర్ జిల్లా కు చెందిన యం.చంద్రశేఖర్ s/o రాంరెడ్డి. తన స్వగ్రామం రంగారెడ్డి గూడ లోని స్వగృహంలో తేదీ 11.11.2026.బుధవారం రోజున ఇంటి మరమ్మతుల నిమిత్తం వస్తువులు సర్దే సమయంలో కొన్ని దస్తావేజులు కనిపించడం లేదని పత్రికా ప్రకటన ద్వారా చంద్రశేఖర్ తెలిపారు. దస్తావేజుల వివరాలు షాద్ నగర్ శివారులో గల సర్వే నంబర్ 197/AA ప్లాట్ నంబర్ 7, 202 గజాల స్థలాన్ని దస్తావేజు నెంబర్ 4385/2025 ద్వారా చంద్రశేఖర్ కొనుగోలు చేశారు. ఈ ప్లాటు కు సంబంధించిన లింకు దస్తావేజులు 14347/2025, 2982/2010, 2597/2010, 188/2011 దస్తావేజులు కనిపించడం లేదని, ఇట్టి దస్తావేజులు ఎవరికైనా దొరికితే 9885884899 నెంబర్ కు సమాచారం ఇవ్వగలరని లేదంటే రాజాపూర్ పోలీసు స్టేషన్ కు సమాచారం ఇవ్వగలరని పత్రికా ప్రకటన ద్వారా యం.చంద్రశేఖర్ s/o రాంరెడ్డి తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
19 నవంబర్ 2026

కనికరం ఎవరి కోసం..?

సంపాదకీయం

తొంభై శాతం అంగవైకల్యంతో చక్రాల కుర్చీకే పరిమితమైన ఒక విశ్వవిద్యాలయ ప్రొఫెసర్‌కు ఈ దేశ న్యాయస్థానాలు కనికరం చూపలేదు. అనారోగ్యంతో కుంగిపోతున్నా బెయిలు ఇవ్వలేదు. తల్లి మరణించినప్పుడు కడసారి చూపుకైనా అవకాశం దక్కలేదు. ఆయన నిర్దోషి అని హైకోర్టు తేల్చేనాటికి జైలు గోడల మధ్య ఆయన జీవితంలో పదేళ్లు కరిగిపోయాయి. ఆ తర్వాత కొద్ది కాలానికే ఆయన కన్నుమూశారు. అదే వ్యవస్థ ఇప్పుడు మరో తీర్పులో అసాధారణమైన ఉదారత చూపుతోంది. ఈ రెండింటికీ పొంతన ఏమిటని దేశం అడగడం తప్పా?

బిల్కిస్ బానో కేసులో దోషులుగా తేలిన బిపిన్ చంద్ర జోషి, ప్రదీప్ మోర్ధియాల శిక్షను సుప్రీంకోర్టు ధర్మాసనం నిలిపివేసి, బెయిలు మంజూరు చేసింది. కారణంగా చూపింది వారు పదిహేడేళ్లుగా జైలు జీవితం గడుపుతున్నారనే వాస్తవాన్ని. నిందితుల అంగవైకల్యాన్ని కూడా సానుభూతిగా తీసుకుంది. పదిహేడేళ్ల జైలు గురించి ఇంత కరుణ చూపే వ్యవస్థ, ఇరవై నాలుగేళ్లుగా న్యాయం కోసం తలుపులు తడుతున్న బాధితురాలి నిరీక్షణను ఏ తూకంలో కొలిచింది?

ఇది ఏదో సాధారణ నేరం కాదు. గర్భిణిని సామూహికంగా చెరబట్టిన కేసు. పసిపాపలను నేలకేసి కొట్టి చంపిన కేసు. కుటుంబ సభ్యులను కళ్లెదుటే నరికి చంపిన కేసు. అలాంటి నేరస్థులకు ఊరట దక్కుతుంటే, ఆ బాధితురాలు "నా ప్రపంచాన్ని, నా బిడ్డను, నా కుటుంబాన్ని, నా ఇంటిని, మానవత్వంపై నాకున్న నమ్మకాన్ని అతి క్రూరంగా చిదిమేశారు" అని చెబుతున్నారు. ఆ మాటలు ప్రతి భారతీయుడి మనస్సాక్షిని కుదిపేయాలి. "లక్షలాది గళాలు నాకు సంఘీభావం తెలపడం ఇందుకు దోహదపడింది" అన్న ఆమె మాటల్లో ఒక ఆవేదన ఉంది. ఈ దేశంలో న్యాయం పొందడానికి కోర్టు గది బయట జనం గళం కూడా తోడు కావాలా అనే ప్రశ్న అందులో ఇమిడి ఉంది.

జైలు జీవితం గడిపిన కాలాన్ని లెక్కగట్టడం చట్టపరంగా తప్పు కాకపోవచ్చు. కానీ న్యాయం అంటే లెక్కల పట్టిక కాదు. నేర తీవ్రతను, బాధితుల గాయాన్ని, సమాజంపై పడే సందేశాన్ని కూడా తూచాల్సిన బాధ్యత న్యాయస్థానాలపై ఉంది. ఊరట పొందాల్సింది నిస్సహాయుడైన విచారణ ఖైదీనా, లేక క్రూరమైన హంతకులా? ఈ ఎంపికలో వ్యవస్థ ప్రాధాన్యాలే బయటపడుతున్నాయి.

కనికరం తప్పు కాదు. కానీ అది అందరికీ సమానంగా అందాలి. ఒకరికి కనికరం నిరాకరించి, మరొకరికి ఉదారంగా పంచే వ్యవస్థను పౌరులు ఎలా నమ్మాలి? మహిళలకు, బాధితులకు, న్యాయం కోసం పోరాడేవారికి ఇది ఎలాంటి సంకేతం ఇస్తోంది? ఇరవై నాలుగేళ్ల పోరాటం తర్వాత కూడా బాధితులు మళ్లీ మళ్లీ పోరాడాల్సి వస్తుంటే, ఆ న్యాయం ఆలస్యమవడమే కాదు, అవమానానికి గురవుతున్నట్టే. న్యాయస్థానాలు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన సమయం ఇది.

ఏఐ సాంకేతికతతో విస్తరిస్తున్న సైబర్ దాడులు!?

సాంకేతిక విప్లవం మానవాళికి వరమైతే,దాని దుర్వినియోగం ప్రపంచానికే శాపం!.ఒకప్పుడు యుద్ధాలు సరిహద్దుల్లో జరిగేవి. ఇప్పుడు కనిపించని శత్రువులు కంప్యూటర్ల తెరల వెనుక నుంచి దేశాల భద్రతకు, ఆర్థిక వ్యవస్థలకు సవాళ్లు విసురుతున్నారు. క్షిపణులు, తుపాకులు లేకుండానే కీలక వ్యవస్థలను స్తంభింపజేసే సైబర్ దాడులు ఆధునిక ప్రపంచాన్ని భయపెడుతున్నాయి. అరచేతిలో ప్రపంచాన్ని చూపిస్తున్న ఇంటర్నెట్.. అదే ప్రపంచాన్ని అంధకారంలోకి నెట్టగల ప్రమాదకర పరిస్థితులనూ సృష్టిస్తోంది. కృత్రిమ మేధ (ఏఐ) రాకతో ఈ ముప్పు మరింత విస్తరిస్తోంది. ప్రభుత్వాలు, బ్యాంకులు, ఆసుపత్రులు, విమానయాన సంస్థలు, బహుళజాతి కంపెనీల నుంచి సామాన్యుల వరకు ఎవరికీ మినహాయింపు లేదు. సాంకేతికతపై పెరుగుతున్న ఆధారపడటం మనిషి జీవితాన్ని సులభతరం చేస్తున్నా, దాని వైఫల్యం సమాజాన్ని ఎంతగా కుదిపేస్తుందో ఇటీవలి పరిణామాలు హెచ్చరిస్తున్నాయి. ఇది కేవలం సాంకేతిక సమస్య కాదు.. ప్రపంచ భద్రతకు పెను సవాలు!

సైబర్ ముప్పతో స్తంభిస్తున్న వ్యవస్థలు!

ప్రపంచవ్యాప్తంగా సైబర్ దాడులు, సాంకేతిక వైఫల్యాలు, ఆన్‌లైన్ సేవల్లో అంతరాయాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సూపర్ మార్కెట్లు, బ్యాంకింగ్ సేవలు, విమానయానం, ప్రభుత్వ సమాచార వ్యవస్థలు, సంస్థల వెబ్‌సైట్లు సాంకేతిక సమస్యలతో నిలిచిపోతున్న సందర్భాలు పెరుగుతున్నాయి. కొన్నిసార్లు హ్యాకింగ్, మరికొన్నిసార్లు సాఫ్ట్‌వేర్ లోపాలు, నిర్వహణ వైఫల్యాలు, సర్వర్ సమస్యలు ఇందుకు కారణమవుతున్నాయి. ప్రతి అంతరాయాన్ని సైబర్ దాడిగా భావించడం సరికాదు. అయితే అసలు కారణాన్ని గుర్తించేలోపే ప్రజాజీవనంపై దాని ప్రభావం పడటం ఆందోళనకరం.

ఇటీవల అమెరికా జాతీయ భద్రతా సంస్థ (ఎన్ఎస్ఏ) అంతర్గత సమాచార నెట్‌వర్క్ ఎన్ఎస్ఏ నెట్‌లో సాంకేతిక అంతరాయం ఏర్పడింది. అయితే అది సైబర్ దాడి వల్ల జరిగినట్లు ఆధారాలు లేవని, సాధారణ నిర్వహణ సమయంలో సమస్య తలెత్తినట్లు సంస్థ వెల్లడించింది. అత్యంత భద్రత కలిగిన వ్యవస్థల్లోనూ సాంకేతిక అంతరాయాలు సంభవించవచ్చని ఈ ఘటన గుర్తుచేస్తోంది.

ఇలాంటి పరిస్థితుల్లో కీలక మౌలిక సదుపాయాలు దెబ్బతిని విద్యుత్, ఇంటర్నెట్, మొబైల్, తాగునీరు, ఆసుపత్రులు, ప్రజారవాణా వంటి అత్యవసర సేవలు నిలిచిపోతే ఏర్పడే తీవ్ర సంక్షోభాన్ని 'బ్లాక్ స్కై' పరిస్థితిగా వ్యవహరిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, భారీ వరదలు, కార్చిచ్చులు, విద్యుత్ వ్యవస్థల వైఫల్యాలు కూడా ఇలాంటి సంక్షోభాలకు దారితీయవచ్చు. ఒక్క వ్యవస్థలో ఏర్పడిన అంతరాయం మరో వ్యవస్థకూ వ్యాపించి సమాజ జీవనాన్ని అస్తవ్యస్తం చేయవచ్చు.

ఈ నేపథ్యంలో బ్రిటన్ ప్రభుత్వం 2026 అక్టోబర్ 22న 'బీ రెడీ' పేరుతో ప్రజల్లో అత్యవసర పరిస్థితులపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించింది. మూడు రోజులపాటు సేవలకు అంతరాయం ఏర్పడినా తట్టుకునేలా నిత్యావసర ఆహారం, తాగునీరు వంటి వాటిని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించడం భవిష్యత్ విపత్తుల పట్ల ముందస్తు సంసిద్ధతకు నిదర్శనం.



ఏఐతో పెరుగుతున్న అదృశ్య దాడుల ముప్పు!

సైబర్ నేరగాళ్లకు కృత్రిమ మేధ కొత్త అస్త్రంగా మారుతోంది. గతంలో సైబర్ దాడులకు అధిక సాంకేతిక పరిజ్ఞానం, సమయం, మానవ శ్రమ అవసరమయ్యేవి. ఇప్పుడు ఏఐ ఆధారిత సాధనాలతో సాఫ్ట్‌వేర్ లోపాలను గుర్తించడం, నకిలీ సందేశాలను రూపొందించడం, వ్యక్తిగత సమాచారాన్ని విశ్లేషించడం, మోసపూరిత కార్యకలాపాలను విస్తరించడం సులభమవుతోంది. ముఖ్యంగా లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎంలు), ఆటోమేటెడ్ ఏజెంట్లను దుర్వినియోగం చేస్తూ హ్యాకర్లు వేగంగా దాడులకు పాల్పడుతున్నారని గూగుల్ థ్రెట్ ఇంటెలిజెన్స్ గ్రూప్ తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి.

2026 నవంబర్ 17న వెలువడిన గూగుల్ నివేదిక ప్రకారం, సైబర్ నేరగాళ్లు ఏఐ ఆధారిత స్వయంచాలక వ్యవస్థలను ఉపయోగించి బహుళ దశల్లో దాడులు నిర్వహించే స్థాయికి చేరుకుంటున్నారు. సాఫ్ట్‌వేర్ లోపాలను గుర్తించడం నుంచి వాటిని దుర్వినియోగం చేసే ప్రయత్నాల వరకు యంత్రాల వేగంతో కార్యకలాపాలు సాగుతున్నాయి. దీనివల్ల సైబర్ భద్రతా నిపుణులకు స్పందించేందుకు లభించే సమయం తగ్గిపోతోంది.

మరోవైపు, ఏఐ సాయంతో రూపొందించే నకిలీ స్వరాలు, వీడియోలు, సందేశాలు ప్రజలను నమ్మించి ఆర్థిక మోసాలకు పాల్పడే ప్రమాదాన్ని పెంచుతున్నాయి. ఉన్నతాధికారుల పేరుతో నకిలీ ఆదేశాలు, పరిచయస్తుల గొంతును అనుకరించి డబ్బులు అడగడం, బ్యాంకు వివరాలు దొంగిలించడం వంటి మోసాలు వ్యక్తిగత భద్రతకే కాకుండా సామాజిక విశ్వాసానికీ విఘాతం కలిగిస్తున్నాయి. డీప్‌ఫేక్‌లు, తప్పుడు సమాచార ప్రచారాలు ప్రజాస్వామ్య వ్యవస్థల విశ్వసనీయతను సైతం దెబ్బతీయగలవు.

ఏఐ స్వతహాగా శత్రువు కాదు. దానిని ఎవరు, ఏ ప్రయోజనం కోసం ఉపయోగిస్తున్నారన్నదే కీలకం. వైద్యరంగం, విద్య, వ్యవసాయం, పరిశోధన, పరిపాలనలో అద్భుత అవకాశాలను అందించే సాంకేతికతనే నేరగాళ్లు దుర్వినియోగం చేస్తే మానవాళికి ముప్పుగా మారుతుంది. అందుకే సాంకేతిక అభివృద్ధితోపాటు నైతిక నియంత్రణ, బాధ్యతాయుత వినియోగం తప్పనిసరి.

సమష్టి అప్రమత్తతే సైబర్ ముప్పునకు విరుగుడు!

సైబర్ ముప్పును ఒక్క ప్రభుత్వం లేదా ఒక్క సంస్థ ఎదుర్కోవడం సాధ్యం కాదు. ప్రపంచ దేశాల మధ్య సమాచార మార్పిడి, పరస్పర సహకారం, నేరగాళ్లపై సమన్వయ చర్యలు అవసరం. ముఖ్యంగా విద్యుత్, బ్యాంకింగ్, ఆరోగ్యం, రక్షణ, టెలికమ్యూనికేషన్ వంటి కీలక రంగాలకు పటిష్టమైన సైబర్ రక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలి. నిరంతర భద్రతా తనిఖీలు, సాఫ్ట్‌వేర్ నవీకరణలు, సమాచార గోప్యత, అత్యవసర ప్రత్యామ్నాయ నెట్‌వర్క్‌లు, సమాచారాన్ని తిరిగి పొందే బ్యాకప్ వ్యవస్థలు తప్పనిసరి చేయాలి. సాంకేతిక వైఫల్యం సంభవించినా సేవలు పూర్తిగా నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉండాలి.

భారత్ వంటి డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న దేశంలో ఈ బాధ్యత మరింత కీలకం. డిజిటల్ చెల్లింపులు, ఆధార్ ఆధారిత సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆన్‌లైన్ విద్య, వైద్య సేవలు కోట్లాది మందికి చేరుతున్నాయి. ఈ వ్యవస్థల భద్రతకు ప్రభుత్వం, బ్యాంకులు, సాంకేతిక సంస్థలు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని కాపాడటంలో నిర్లక్ష్యం వహించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి. పాఠశాల స్థాయి నుంచే సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి.

ప్రజలు కూడా అపరిచిత లింకులు తెరవకూడదు. ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించకూడదు. బలమైన పాస్‌వర్డ్‌లు, రెండు దశల ధ్రువీకరణ (టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్) వినియోగించాలి. అనుమానాస్పద ఫోన్‌కాల్స్, నకిలీ వీడియోలు, సందేశాలను నమ్మి స్పందించకూడదు. మోసానికి గురైతే వెంటనే బ్యాంకును, సంబంధిత అధికారులను సంప్రదించి 1930 సైబర్ నేరాల హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలి.

సాంకేతికత మనిషికి సేవ చేయాలి తప్ప మనిషి సాంకేతికతకు బానిస కాకూడదు. ఏఐ ఎంత అభివృద్ధి చెందినా మానవ పర్యవేక్షణ, విచక్షణ, సామాజిక బాధ్యతలకు ప్రత్యామ్నాయం కాలేదు. డిజిటల్ వ్యవస్థలతోపాటు మానవ వనరులు, ప్రత్యామ్నాయ సమాచార మార్గాలు, అత్యవసర సేవలను కొనసాగించే ఏర్పాట్లను బలోపేతం చేయాలి. సాంకేతికతపై గుడ్డి నమ్మకం కాదు.. అప్రమత్తతతో కూడిన ఆధారపడటమే శ్రేయస్కరం.

చివరగా ఒక్క మాట.. సైబర్ ప్రపంచంలో నిర్లక్ష్యం నేరగాళ్లకు అవకాశం.. అప్రమత్తత సమాజానికి రక్షణ! ఏఐని అభివృద్ధికి ఇంధనంగా మార్చుకోవాలే తప్ప విధ్వంసానికి ఆయుధంగా మారనివ్వకూడదు. డిజిటల్ భద్రత ఒక్కరి బాధ్యత కాదు.. ప్రపంచ మానవాళి ఉమ్మడి బాధ్యత. ఇప్పటికైనా ప్రభుత్వాలు, సంస్థలు, ప్రజలు మేల్కొనకపోతే రేపటి సాంకేతిక విప్లవమే మానవాళికి పెను విపత్తుగా పరిణమించే ప్రమాదం ఉంది జాగ్రత్త!.

మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650



"హక్కు బిడ్డది, బాధ్యత పెద్దలది"

బాలల రక్షణకు మన దేశంలో చట్టాలకు కొరత లేదు. కొరత ఉన్నది, బిడ్డ చెప్పేది వినే సహనంలో...

2024లో దేశవ్యాప్తంగా పిల్లలపై జరిగిన నేరాలకు సంబంధించి 1,87,702 కేసులు నమోదయ్యాయి. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) లెక్కల ప్రకారం ఇది రోజుకు సగటున 514 కేసులు, అంటే దాదాపు ప్రతి మూడు నిమిషాలకు ఒకటి. వీటిలో 69,191 కేసులు లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం 2012 (పోక్సో) కింద నమోదైనవే.

ఈ అంకెలను చూసి సమాజం మరింత క్రూరంగా మారిందని తేల్చేయడం తొందరపాటు అవుతుంది. ఫిర్యాదు చేయడంలో పెరిగిన ధైర్యం కూడా నమోదు పెరుగుదలలో భాగమని కొందరు విశ్లేషకులు అంటున్నారు. కానీ ఈ లెక్కలకు ఒక చీకటి వైపు ఉంది: నమోదు కాని కేసులు. అవి ఎన్నో ఎవరికీ తెలియదు. ఎందుకంటే అవి ఇంటి గోడల మధ్యనే ఆగిపోతాయి.

బాలలపై నేరాల్లో నిందితుడు తరచూ అపరిచితుడు కాదు. బంధువు, ఇరుగుపొరుగువాడు, ట్యూషన్ మాస్టారు, కుటుంబానికి నమ్మకస్తుడిగా కనిపించేవాడు. అందుకే "పరువు" అనే మాట చట్టానికి అతి పెద్ద అడ్డంకి. పోక్సో చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం, బిడ్డపై లైంగిక నేరం జరిగిందని తెలిసినవారు, లేదా అనుమానించినవారు ఎవరైనా పోలీసులకు తెలియజేయాలి. తెలియజేయకపోవడం సెక్షన్ 21 కింద శిక్షార్హం. ఈ నిబంధన ఉపాధ్యాయులకూ వైద్యులకూ మాత్రమే అనుకోవడం పొరపాటు. దాని అసలు పరీక్ష తల్లిదండ్రుల ముందే ఎదురవుతుంది: బిడ్డ చెప్పింది నిజమని నమ్మి, బంధుత్వాన్నీ మర్యాదనూ పక్కన పెట్టి ఫిర్యాదు చేసే ధైర్యం మనకు ఉందా?

రాజ్యాంగం బిడ్డను పౌరుడిగా చూస్తుంది, ఇంటి సొత్తుగా కాదు. ఆర్టికల్ 21ఎ ఆరు నుంచి పద్నాలుగేళ్ల పిల్లలకు విద్యను ప్రాథమిక హక్కుగా చేసింది. ఆర్టికల్ 24 పద్నాలుగేళ్లలోపు వారిని ప్రమాదకర పనుల్లో పెట్టడాన్ని నిషేధించింది. ఆర్టికల్ 39(ఎఫ్) బిడ్డ స్వేచ్ఛతో, గౌరవంతో ఎదిగే అవకాశాలు కల్పించడాన్ని ప్రభుత్వ బాధ్యతగా చెప్పింది. ఇందులో ఒక అంశం తరచూ విస్మరణకు గురవుతుంది. ఆర్టికల్ 51ఎ(కె) తల్లిదండ్రులపైనా ఒక కర్తవ్యం పెట్టింది: ఆ వయసు పిల్లలకు చదువుకునే అవకాశం ఇవ్వాలి. హక్కు బిడ్డది, బాధ్యత పెద్దలది. ఈ సూత్రమే మన బాలల చట్టాలన్నిటి వెనుకా ఉంది.

ఆ సూత్రాన్ని చట్టాలు వివరంగా విస్తరించాయి. బాలల న్యాయ (సంరక్షణ, పరిరక్షణ) చట్టం, 2015 పద్దెనిమిదేళ్లలోపు ప్రతి ఒక్కరినీ బిడ్డగా గుర్తించి, ప్రతి జిల్లాలో బాలల సంక్షేమ కమిటీ, బాలల న్యాయ బోర్డు ఏర్పాటు చేసింది. విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 17 బడుల్లో శారీరక దండననూ మానసిక వేధింపునూ నిషేధించింది; "బెత్తం లేనిదే క్రమశిక్షణ లేదు" అనే నమ్మకానికి ఇది చట్టపరమైన జవాబు. బాల కార్మిక చట్టం (2016 సవరణ) పద్నాలుగేళ్లలోపు పిల్లలను ఏ వృత్తిలోనైనా నియమించడాన్ని నిషేధిస్తోంది. బాల్య వివాహ నిషేధ చట్టం, 2006 పెళ్లికి కనీస వయసు అమ్మాయికి 18, అబ్బాయికి 21గా నిర్ణయించింది; 2024లో సుప్రీంకోర్టు ఆ చట్టం అమలుకు మార్గదర్శకాలిస్తూ, శిక్షకన్నా నివారణకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. భారతీయ న్యాయ సంహిత, 2023 మైనర్లపై అత్యాచారానికి కఠిన శిక్షలు విధించగా, డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ చట్టం, 2023 పద్దెనిమిదేళ్లలోపు వారి సమాచారాన్ని వాడే ముందు తల్లిదండ్రుల ధ్రువీకృత అనుమతిని తప్పనిసరి చేసింది.

చట్టాలకు ప్రాణం పోసినవి న్యాయస్థానాల తీర్పులే. 2017లో "ఇండిపెండెంట్ థాట్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా" కేసులో, పదిహేను నుంచి పద్దెనిమిదేళ్ల భార్యతో భర్త లైంగిక సంబంధం కూడా అత్యాచారమేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పెళ్లి పేరుతో బాల్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నానికి ఇది గట్టి అడ్డుకట్ట. 2021లో "అటార్నీ జనరల్ వర్సెస్ సతీశ్" కేసులో, దుస్తుల పైనుంచి తాకితే లైంగిక దాడి కాదన్న బాంబే హైకోర్టు తీర్పును సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసి, లైంగిక ఉద్దేశంతో తాకడమే కీలకమని తేల్చింది. 2024లో "జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్" కేసులో, బాలలను చూపే అశ్లీల చిత్రాలను చూడటం, నిల్వ ఉంచుకోవడం కూడా నేరమేనని చెప్పి, "చైల్డ్ పోర్నోగ్రఫీ" బదులు "బాలలపై లైంగిక దోపిడీ, దుర్వినియోగ సామగ్రి" అనే పదాన్ని వాడాలని సూచించింది.

అయినా లోటు మిగిలే ఉంది. పోక్సో కేసుల విచారణ వీలైనంత వరకు ఏడాదిలో పూర్తి కావాలని చట్టం చెబుతుంది; ఆచరణలో ఇది తరచూ సాధ్యం కావడం లేదు. వాంగ్మూలం ఇచ్చిన సంవత్సరాల తరువాత కూడా కోర్టు వరండాల్లో నిలబడే కుటుంబాలు ఉన్నాయి. మరో చర్చ కౌమార సంబంధాలకు సంబంధించినది. పరస్పర అంగీకారంతో ఏర్పడిన యుక్తవయసు సంబంధాలు కూడా పోక్సో పరిధిలోకి వచ్చి, అబ్బాయిలను జైలుకూ అమ్మాయిలను సాక్షుపు బోనుకూ నెడుతున్నాయని న్యాయస్థానాలు పలుమార్లు ఆందోళన వ్యక్తం చేశాయి. చట్టాన్ని మార్చాలా, లేక న్యాయమూర్తులకు కొంత విచక్షణ ఇవ్వాలా అనే చర్చ సాగుతోంది. అది ఎటు తేలినా, పిల్లలను దోపిడీ చేసేవారికి ఎలాంటి మినహాయింపూ దక్కకూడదు. అదే సమయంలో బిడ్డను బాధితుడిగా మాత్రమే కాక, ఒక వ్యక్తిగా కూడా చూడాలి.

చట్టాలు ఎన్ని ఉన్నా, నేరం ఒక్క బిడ్డకు మాత్రమే తెలిసి ఆ బిడ్డ దగ్గరే ఆగిపోతే వాటికి పని ఉండదు. మనం ఆలోచించవలసిన ప్రశ్న చట్టంలో ఏముంది అన్నది మాత్రమే కాదు; బిడ్డ ఎవరికి చెప్పగలడు అన్నది కూడా. కోపం వస్తుందనే భయం, "నువ్వే ఏదో చేసి ఉంటావు" అనే నింద, "అయ్యవారిని అనకూడదు" అనే పాఠం వల్ల చాలా మంది పిల్లలు నోరు తెరవరు.కాబట్టి తల్లిదండ్రులు చేయగలిగిన పని సులభమైనదీ, కష్టమైనదీ ఒకేసారి: వినడం. బిడ్డ ప్రవర్తనలో హఠాత్తుగా మార్పు వచ్చినప్పుడు, అంటే మౌనం, నిద్రలో ఉలికిపాటు, ఒక వ్యక్తిని కలవడానికి భయం కనిపించినప్పుడు, దాన్ని చదువు ఒత్తిడిగా కొట్టిపారేయకుండా ప్రేమగా అడగాలి. బిడ్డ ఏదైనా చెబితే నిందించకుండా నమ్మాలి. ఆ తరువాత చైల్డ్‌లైన్ 1098కో, అత్యవసర సేవ 112కో, సమీప పోలీస్ స్టేషన్‌కో తెలియజేయాలి. బిడ్డను స్టేషన్‌కు తీసుకెళ్లనక్కరలేదు; చట్టం ప్రకారం బిడ్డ వాంగ్మూలాన్ని ఇంట్లోనే, లేదా బిడ్డకు సౌకర్యంగా ఉన్న చోట నమోదు చేయాలి. బాధిత బిడ్డ పేరు, ఫొటో, బడి వివరాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోకూడదు; సెక్షన్ 23 ప్రకారం మీడియా కూడా వెల్లడించరాదు. ఇంటర్నెట్‌లో పిల్లల ఫొటోలు పంచుకునేటప్పుడు, వారి ఫోన్లలో అపరిచితులతో సంభాషణల విషయంలోనూ జాగ్రత్త అవసరం. ఆన్‌లైన్ వేధింపుల ఫిర్యాదుకు 1930 హెల్ప్‌లైన్ ఉంది.

చట్టం బిడ్డకు కవచం ఇవ్వగలదు. కానీ ఆ కవచం ధరించడానికి బిడ్డ మన దగ్గరికి రావాలి. "ఏదైనా చెప్పొచ్చు" అనే నమ్మకం లేని ఇంట్లో ఎంత గొప్ప చట్టమైనా తలుపు బయటే ఆగిపోతుంది.

పి. ప్రభాకర్
ADVOCATE

ఊరొచ్చి ఇండ్లల్ల

సింతిడిసి బతికేటి
నసీబుందా లేదా...!?
సంకల్ల బిడ్డలు
గుడ్లల్ల పానాలు
ఎవ్వరమ్మ వీళ్ళు..
ఎండిన డొక్కలు
ఆకలి మంటలు
ఉన్న ఊర్లిడ్సి నోళ్లు..
"సంకల్ల "
ఏరంచు పల్లెలు
చెదిరిన బతుకోల్లు
రైతు కూలి లీళ్లు..
ర్యాగళ్ల సేద్యాల
రాత్నాల ధాన్యాల
రాసులు దీసి నోళ్లు..
"సంకల్ల "
జూదమైన సీడు
పత్తిపంట తోడు
పొలాలు బొయ్నోళ్లు..
అప్పు మిత్తి పెరిగి
పుర్గు మందు దాగి
పానాలు ఇడిసెటోళ్లు..
"సంకల్ల "
నడిగడ్డ తల్లులు
సుడిగాడే దిక్కైన
కన్న తండ్రు లీళ్ళు..
పట్నాల కెల్లేటి
ఏబస్సు జూడు
కండ్ల బడే టోళ్ళు..
"సంకల్ల "
సిల్లర దుడ్లు
ఏంచేంచి పంచెల
ముళ్ళు గట్టే టోళ్లు..
అదే నీళ్ళ రంది
ఎన్వయ్యేండ్ల సంది
ఏగేగి సచ్చే టోళ్లు..
"సంకల్ల "
బాయి సెర్వులెండి
కళ్ళ నీళ్లు లేక
పొగిలి ఏడ్సే టోళ్లు..
పాడి పంట మాడి
పచ్చని మడులెండి
అడ్డా కూలీలై నోళ్లు..
"సంకల్ల "
ప్రాజెక్టు మాయల్ల
సర్కారు ద్రోహాల్ల
సితికి పోయి నోళ్లు..
ఎత్తి పోతలతోని
పల్లెలు ముంచితే
అల్లాడి అగ్గయ్యినోళ్లు
"సంకల్ల "
అయ్యయ్యో సామీ
గోడాటల్లనే గల్లంతా
పాలమూరు పానాల్..
ఊరొచ్చి ఇండ్లల్ల
సింతిడిసి బతికేటి
నసీబుందా లేదా..
"సంకల్ల "
ఆలుపిల్లలు గూడి
వాకిట్ల ముచ్చట్ల
నవ్వే రోజులెప్పుడూ..
బతుకైనా సావైనా
గుప్పున ఎగిసేటి
ఐక్య పోరే దారా..
"సంకల్ల "
పిడికిళ్లు కమ్ముకు
దిక్కుల్లెల్ల లేసే
ఐక్య పోర్లే దారా..
ఇగ ఐక్య పోర్లే
దారా...

డా. ఇక్బాల్ పాషా
9440775732

ప్రజాస్వామిక ప్రతిఘటనలో విద్యార్థులదే కీలక పాత్ర!

ప్రశ్నించడం నేరమవుతున్నప్పుడు.. నిరసించడం దేశద్రోహమవుతున్నప్పుడు.. విశ్వవిద్యాలయాలు భావజాల నిర్బంధానికి కేంద్రాలవుతున్నప్పుడు విద్యార్థులు మౌనంగా ఉండలేరు. విద్యను మార్కెట్ సరుకుగా మార్చే ప్రైవేటీకరణ, యువత భవిష్యత్తును బలితీసుకుంటున్న నిరుద్యోగం, సమాజాన్ని చీల్చుతున్న కులతత్వం, మతతత్వం, ప్రజాస్వామిక హక్కులపై దాడులను ఎదిరించాల్సిన చారిత్రక బాధ్యత నేటి విద్యార్థులపై ఉంది. క్యాంపస్ గోడలు దాటి కార్మికులు, రైతులు, మహిళలు, దళితులు, ఆదివాసీల పోరాటాలతో మమేకమై ప్రజాస్వామ్యాన్ని సామాజిక న్యాయ పునాదులపై నిలబెట్టాలి. విద్యార్థులు గొంతెత్తితేనే ప్రజాస్వామ్యానికి బలం.. విద్యార్థులు ఉద్యమిస్తేనే సమాజ మార్పుకు చలనం!



ప్రశ్నించే గొంతులే ప్రజాస్వామ్యానికి ప్రాణం

ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఓటు వేయడం మాత్రమే కాదు. పాలకులను ప్రశ్నించే హక్కు, ప్రభుత్వ విధానాలను విమర్శించే స్వేచ్ఛ, అసమ్మతిని వ్యక్తం చేసే అవకాశం, సమానత్వం కోసం పోరాడే హక్కు కూడా ప్రజాస్వామ్యంలో అంతర్భాగాలే. ఈ హక్కులపై దాడి జరిగిన ప్రతిసారీ విద్యార్థులు ముందువరుసలో నిలబడ్డారు. ప్రశ్నించే తత్వం, అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం, సమాజాన్ని మార్చాలనే ఆకాంక్ష విద్యార్థి ఉద్యమానికి చోదకశక్తులు. అందుకే విద్యార్థి ఉద్యమం క్యాంపస్ సమస్యలకు పరిమితమైనది కాదు. దేశ ప్రజాస్వామిక ఆరోగ్యాన్ని కొలిచే ప్రమాణం.

చరిత్రలో విద్యార్థులది పోరాటాల వారసత్వం

భారత స్వాతంత్ర్యోద్యమం నుంచి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం వరకు, ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమం నుంచి నక్సల్బరీ విప్లవోద్యమం వరకు విద్యార్థులు చరిత్రలో కీలక పాత్ర పోషించారు. గుజరాత్‌లో ఫీజుల పెంపుపై మొదలైన విద్యార్థుల నిరసనలు విస్తృత రాజకీయ ఉద్యమానికి దారితీశాయి. ఎమర్జెన్సీ కాలంలో పౌరహక్కుల అణచివేతకు వ్యతిరేకంగా యువత సాగించిన పోరాటం ప్రజాస్వామ్య చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచింది. అలాంటి పోరాటాల వారసులైన విద్యార్థులు నేడు ప్రశ్నిస్తే దేశద్రోహులుగా చిత్రించడం పాలకుల ద్వంద్వ వైఖరికి నిదర్శనం.

విశ్వవిద్యాలయాలపై భావజాల దాడులు

విశ్వవిద్యాలయాలు కేవలం పట్టాలు ఇచ్చే కేంద్రాలు కావు. భిన్నాభిప్రాయాలు, శాస్త్రీయ ఆలోచనలు, సామాజిక చర్చలు, రాజకీయ చైతన్యం వికసించే ప్రజాస్వామిక వేదికలు. పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్‌లో గజేంద్ర చౌహాన్ నియామకానికి వ్యతిరేకంగా విద్యార్థులు 139 రోజులపాటు పోరాడారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో రోహిత్ వేముల ఘటన విద్యాసంస్థల్లో వేళ్లూనుకున్న కులవివక్షను దేశం ముందుంచింది. జేఎన్‌యూలో విద్యార్థులపై దేశద్రోహ ముద్రలు వేయడం, నజీబ్ అహ్మద్ అదృశ్యం వంటి ఘటనలు విద్యార్థుల హక్కులు, భద్రతపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తాయి. ప్రశ్నించే గొంతులను అణచివేసి విశ్వవిద్యాలయాలను అధికార భావజాల ప్రచార కేంద్రాలుగా మార్చే ప్రయత్నాలను



ఉపాధ్యాయ సంఘాలు ఎటువైపు?

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని సభలు, సమావేశాల్లో ఉపన్యాసాలు ఇచ్చే కొన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు.. క్షేత్రస్థాయిలో మాత్రం తమ స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయ పలుకుబడిని ఉపయోగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే, ఉన్న ఉపాధ్యాయులను సైతం పైరవీలతో ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పెద్ద స్థాయి సంఘాల నాయకులే ఇలా వ్యవహరిస్తుంటే కింది స్థాయి ఉపాధ్యాయులు, విద్యార్థుల పరిస్థితి ఏమిటనే చర్చ జరుగుతోంది.

టీచర్ రిలీవ్‌కు పైరవీ..!!

అక్రమ డిప్యూటేషన్లకు ఉపాధ్యాయ సంఘాల పైరవీలు

- హెడ్‌మాస్టర్‌కు సంఘం జిల్లా అధ్యక్షుడి హుకుం
- 600 మంది విద్యార్థుల చదువుతో చెలగాటం
- ఎఫ్‌ఆర్ఎస్‌పై ఎంఈఓ పొంతనలేని సమాధానాలు

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :

రంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్ల వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ఉపాధ్యాయ సంఘాల పైరవీలతో వర్క్ అడ్జస్ట్‌మెంట్లు, వాటి రద్దు వ్యవహారాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యానికి ఇటువంటి చర్యలు విఘాతం కలిగిస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో జనంసాక్షి వరుస కథనాలతో ఈ అక్రమ డిప్యూటేషన్ల వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకురాగా, అప్పటి డీఎస్ఈ నవీన్ నికోలస్ వాటిని కొంతమేర తగ్గించేందుకు ప్రయత్నించారు. అయితే ప్రస్తుతం మళ్లీ పాత పరిస్థితులు పునరావృతమవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రంగారెడ్డి జిల్లాలోని కొందుర్గు, చౌదరిగూడ మండలాలు జిల్లా చివరి ప్రాంతాల్లో ఉండటంతో అక్కడ పనిచేసేందుకు ఉపాధ్యాయులు ఆసక్తి చూపడం లేదనే అభిప్రాయం ఉంది.



కొందుర్గు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇదే మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయురాలు జి.ప్రశాంతిని బయోలాజికల్ సైన్స్ బోధించేందుకు గత జూన్‌లో ఈ ఉన్నత పాఠశాలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై కేటాయించారు. అయితే ప్రస్తుతం తిరిగి తన పాత పాఠశాలకు వెళ్లాలని ఆమె నిర్ణయించుకోవడంతో డిప్యూటేషన్ రద్దు చేసి రిలీవ్ చేయాలని కోరినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఓ ఉపాధ్యాయ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నేరుగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపీనాథ్‌కు ఫోన్ చేసి ఉపాధ్యాయురాలిని వెంటనే రిలీవ్ చేయాలని సూచించినట్లు సమాచారం. అంతేకాకుండా డీఈఓ పక్కనే ఉన్నారని, ఆయనతో మాట్లాడతారా? అంటూ ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో ఆశ్చర్యానికి గురైన ప్రధానోపాధ్యాయుడు గోపీనాథ్.. తాను నేరుగా డీఈఓతోనే మాట్లాడతానని, 600 మంది విద్యార్థులున్న పాఠశాల నుంచి బయోలాజికల్ సైన్స్ బోధించే ఉపాధ్యాయురాలిని రిలీవ్ చేస్తే విద్యార్థులకు ఎవరు పాఠాలు చెబుతారని ప్రశ్నించినట్లు సమాచారం. ఉపాధ్యాయుల నియామకాలు, బదిలీలు, డిప్యూటేషన్లపై నిర్ణయాలు తీసుకోవాల్సింది విద్యాశాఖ అధికారులేనని, సంఘాల నాయకులు కాదని స్పష్టం చేసినట్లు తెలిసింది.

ఫోన్ ఎత్తని డీఈఓ

ఈ వ్యవహారంపై రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లును వివరణ కోరేందుకు జనంసాక్షి పలుమార్లు ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ ఆయన స్పందించలేదు. అక్రమ డిప్యూటేషన్ల ఆరోపణలు, ఉపాధ్యాయ సంఘాల జోక్యం, విద్యార్థుల చదువుపై పడే ప్రభావంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.



ఎఫ్‌ఆర్ఎస్‌పై పొంతనలేని సమాధానాలు

ఉపాధ్యాయురాలు ప్రశాంతి వర్క్ అడ్జస్ట్‌మెంట్ రద్దు వ్యవహారంపై జనంసాక్షి మండల విద్యాధికారిని వివరణ కోరింది. 600 మంది విద్యార్థులున్న ఉన్నత పాఠశాల నుంచి బయోలాజికల్ సైన్స్ బోధించే ఉపాధ్యాయురాలిని రిలీవ్ చేస్తే విద్యార్థులకు బోధన ఎవరు చేస్తారని ప్రశ్నించగా, ఎంఈఓ పొంతనలేని సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. ఇదే సమయంలో ప్రశాంతి ఎఫ్‌ఆర్ఎస్ హాజరు ఏ పాఠశాలలో నమోదవుతుందని ప్రశ్నించగా, పాత పాఠశాలలోనే నమోదవుతోందని తొలుత సమాధానమిచ్చినట్లు సమాచారం. అయితే వెంటనే ఉపాధ్యాయురాలికి ఫోన్ చేసి పాఠశాల యూడైస్‌లో ఎఫ్‌ఆర్ఎస్ వివరాలను మార్చుకోవాలని సూచించినట్లు తెలిసింది. దీంతో ప్రశాంతి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపీనాథ్‌కు ఫోన్ చేసి ఎఫ్‌ఆర్ఎస్ వివరాలు మార్చాలని చెప్పినట్లు సమాచారం. ఈ పరిణామాలు విద్యాశాఖ అధికారుల వ్యవహారశైలిపై అనుమానాలకు తావిస్తున్నాయి.



గ్రంథాలయాలతోనే యువతకు బంగారు భవిష్యత్తు

- రూ.2 కోట్లతో కీసర, ఆలియాబాద్‌లో నూతన భవనాలు ప్రారంభం
- పోటీ పరీక్షలకు విజ్ఞాన కేంద్రాలుగా గ్రంథాలయాలు
- త్వరలో ఈ-గ్రంథాలయాల ఏర్పాటు..యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 18 (జనంసాక్షి): యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని శాసనమండలి ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కీసరలో రూ.1.50 కోట్లు, ఆలియాబాద్‌లో రూ.50 లక్షలతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాలను ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించాలంటే నిరంతర అధ్యయనం అవసరమని, గ్రంథాలయాలు విద్యార్థులు, నిరుద్యోగ యువతకు విజ్ఞాన కేంద్రాలుగా ఉపయోగపడతాయని అన్నారు. జిల్లాలోని గ్రంథాలయాలను ఆధునికీకరించి యువతకు మరింత చేరువ చేస్తామని చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచామని, భవిష్యత్తులో అన్ని గ్రంథాలయాల్లో ఇంటర్నెట్ సౌకర్యంతో ఈ-గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. గ్రంథాలయాలు ఉద్యోగ సాధనకు ఎంతగానో దోహదపడతాయని డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు. యువత ఈ అవకాశాలను వినియోగించుకొని లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తాండూరుకు కొత్త సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- రూ.1.40 కోట్లతో నూతన భవన నిర్మాణం
- నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, నవంబర్ 18 (జనంసాక్షి): తాండూరులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించేందుకు రూ.1.40 కోట్లతో చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని రాజీవ్ కాలనీలో నూతన భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొంత భవనం లేకపోవడంతో అధికారులు, సిబ్బందితో పాటు రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారంగా ఆధునిక సౌకర్యాలతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. భవనం అందుబాటులోకి వస్తే ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలు అందడంతో పాటు వ్యాపారులు, డాక్యుమెంట్ రైటర్లకు అవసరమైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ముప్పన్నెల జెండాకు అవమానం

- పేలాలుగా చిరిగి.. ముద్దగా మారి
- నిద్రమత్తు వీడని అధికారులు
- ఇబ్రహీంపట్నం చెరువుకట్టపై ఆవేదన కలిగిస్తున్న దృశ్యం
- కరువైన నిఘా వర్గాల దృశ్యం
- ఆకతాయిలు, ప్రేమ జంటలకు అడ్డాగా మారిన వైనం

రంగారెడ్డి, నవంబర్ 18 (జనంసాక్షి): సగటు భారతీయుడి గుండెల్లో దేశభక్తిని రగిలించే జాతీయ పతాకానికి ఇబ్రహీంపట్నం నడిబొడ్డున తీవ్ర అవమానం జరుగుతోంది. నిత్యం లక్షలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ఎగురవేసిన ముప్పన్నెల జెండా పూర్తిగా చిరిగిపోయి, పేలాలుగా మారి దర్శనమిస్తోంది. కోట్లాది రూపాయలతో సుందరీకరణ పనులు జరుగుతున్న ఈ కీలక ప్రాంతంలో, జాతీయ జెండా దయనీయ స్థితిని చూసి ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సెల్ఫీల మోజు.. విచ్చలవిడితనం..

సుందరీకరణ పనుల నేపథ్యంలో ప్రతిరోజూ వందలాది మంది యువకులు చెరువు కట్టపైకి వచ్చి కాలక్షేపం చేస్తూ ఫోటోలు, సెల్ఫీలు దిగుతుంటారు. కానీ, తమ కళ్లముందే జాతీయ గౌరవం మంటగలుస్తున్నా స్పందించే నాథుడే లేకపోవడం బాధాకరం. మరోవైపు, పర్యవేక్షణ కొరవడటంతో ఈ ప్రాంతం ప్రేమ జంటలకు సురక్షిత అడ్డాగా మారింది. బహిరంగంగానే యువతీయువకులు విచ్చలవిడిగా ప్రవర్తిస్తుండటంతో, ఉదయం, సాయంత్రం వేళల్లో కుటుంబాలతో కలిసి వాకింగ్‌కు వచ్చే స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాదాలకు నిలయం.. మొక్కుబడి చర్యలు..

రద్దీ ఎక్కువగా ఉండే చెరువు కట్ట సమీపంలో నిఘా వ్యవస్థ పూర్తిగా పడకేసింది. ఫలితంగా ఇక్కడ తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటూ ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఏదైనా పెను ప్రమాదం జరిగినప్పుడు మాత్రమే అధికారులు, పోలీసులు హడావిడి చేసి, ఆ తర్వాత ఎప్పటిలాగే చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధికారులు నిద్ర మత్తు వీడాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి బోడ సామెల్

ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై నిఘా ఏర్పాటు చేయాలి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మొద్దునిద్ర వీడి, చిరిగిపోయిన జెండా స్థానంలో తక్షణమే నూతన జాతీయ పతాకాన్ని గౌరవప్రదంగా ఏర్పాటు చేయాలి. అలాగే, చెరువు కట్టపై సీసీ కెమెరాలతో పాటు నిరంతర పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేసి, అసాంఘిక కార్యకలాపాలకు, ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలి.

జాతీయ పండుగలకే పరిమితమైన దేశభక్తి..

ప్రతి ఏటా ఆగస్టు 15, జనవరి 26, తెలంగాణ అవతరణ దినోత్సవం జూన్ 2 వంటి జాతీయ పండుగల వేళ అధికారులు ఇక్కడ హడావిడిగా జెండాను ఎగురవేసి, ఫోటోలకు ఫోజులిచ్చి వెళ్లిపోతుంటారు. కానీ, ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం జాతీయ జెండా ఎల్లప్పుడూ హుందాగా, చెక్కుచెదరకుండా ఉండేలా పర్యవేక్షించాల్సిన కనీస బాధ్యతను మాత్రం పూర్తిగా విస్మరించారు. ప్రస్తుతం ఆ జెండా గాలికి చిరిగిపోయి, పేలాలుగా వేలాడుతూ ఒక ముద్దలా మారిపోయింది. నిత్యం ఇదే రహదారిపై ప్రయాణించే ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల కళ్లకు ఈ ఘోరమైన దృశ్యం కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది.





సింగరేణి కార్మికుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- మారుపేర్లు.. డిపెండెంట్ లకు నియామక పత్రాలు ఇవ్వడం లేదు
- కంపెనీకి రావలసిన రూ. 60 వేల కోట్ల బకాయిలను చెల్లించాలి
- ఆర్జీ.వన్ జిఎం ఆఫీస్ వద్ద నిరాహార దీక్ష శిబిరం
- సందర్శించి సంఘీభావం తెలిపిన సీతారామయ్య



గోదావరిఖని, జనంసాక్షి : సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. బుధవారం ఆర్జీ-1 జీఎం కార్యాలయం ఎదుట చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెడికల్ బోర్డులో అవినీతి చోటుచేసుకుంటో ందని, ఏడాదిగా బోర్డు నిర్వహించకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. 1981 జనవరి 29 ఒప్పందం ప్రకారం ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించి, రెండేళ్ల సర్వీసు ఉన్నవారికి వందశాతం ఇన్వాలిడేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. మెడికల్ అన్‌ఫిట్, మృత కార్మికుల అర్హులైన డిపెండెంట్లు వైద్య పరీక్షలు పూర్తి చేసుకున్నప్పటికీ ఏడాదిగా నియామక పత్రాల కోసం ఎదురుచూస్తున్నారని, వెంటనే ఉద్యోగాలు కల్పించాలన్నారు. సమ్మె నోటీసులో అంగీకరించిన 23 డిమాండ్లపై సర్కులర్లు జారీ చేయాలని కోరారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉందని, వాటిని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయిలు రాకపోవడంతో పనిముట్లు, భద్రతా సామగ్రి, జీతాల కోసం యాజమాన్యం బ్యాంకుల నుంచి అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను తదితరులు దీక్షా శిబిరాన్ని ప్రారంభించగా, సుమారు 60 మంది కార్మికులు పాల్గొన్నారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు గౌతం గోవర్ధన్, కన్నం లక్ష్మీనారాయణ, ఎం.ఎ.గౌస్ తదితరులు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

పేదలకు చేయూత.. సంక్షేమానికి భరోసా

- బోయినపల్లి మండలంలో 567 మందికి నూతన పింఛన్లు
- నేటి నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ
- జిల్లావ్యాప్తంగా 8,209 పింఛన్లు మంజూరు
- కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వెల్లడి

బోయినపల్లి, నవంబర్ 18 (జనంసాక్షి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం కొత్తపేటలో నిర్వహించిన కార్యక్రమంలో బోయినపల్లి మండలానికి కొత్తగా మంజూరైన 567 చేయూత పింఛన్ల ప్రొసీడింగ్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 8,209 కొత్త పింఛన్లు మంజూరు చేశామని, ఈ నెల 19 నుంచి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుందని తెలిపారు. ఇంకా అర్హులైన వారు ఎంపీడీవో, పురపాలక కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బోయినపల్లి మండలం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని, త్వరలో రెండో విడత మంజూరు పత్రాలు అందిస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా కల్పించనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా దాదాపు ఐదు లక్షల చేయూత పింఛన్లు మంజూరు చేసిందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రైతు రుణమాఫీ వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. రూ.12 కోట్లతో స్టేడియం నిర్మాణంతో పాటు నియోజకవర్గంలో మౌలిక వసతులు కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



చేయూత పెన్షన్లలో అనర్హుల వివరాలు వెల్లడించాలి

- 608 మంది దరఖాస్తులపై స్పష్టత ఇవ్వాలి.
- మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి

సిరిసిల్ల టౌన్ నవంబర్ 18 (జనం సాక్షి): ఏ ప్రభుత్వమైనా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి అన్నారు. సిరిసిల్లలోని సినారె కళా మందిరంలో బుధవారం మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిరిసిల్లలో 2,276 మంది దరఖాస్తు చేసుకోగా, 1,668 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించారని, మిగిలిన 608 మందిని అనర్హులుగా ప్రకటించడానికి గల కారణాలను అధికారులు వెల్లడించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చూడాలని, అనర్హుల జాబితాపై పూర్తిస్థాయి వివరాలు పాలకవర్గ సభ్యులకు అందించాలని సూచించారు. వృద్ధాప్య పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన వృద్ధులకు కూడా వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.2,016, దివ్యాంగుల పెన్షన్ రూ.4,016 నుంచి ఎన్నికల హామీ మేరకు రూ.4,000, రూ.6,000కు పెంచాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, డీఆర్డీఏ జిల్లా అధికారి, మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాషా, వైస్ చైర్మన్ దార్ల సందీప్, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత దంత వైద్య సేవలు

ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ముందడుగు అభినందనీయం: డీఎంహెచ్ఓ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 18 (జనం సాక్షి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందించేందుకు ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కామారెడ్డి శాఖ ముందుకు రావడం అభినందనీయమని డీఎంహెచ్ఓ డాక్టర్ జె. వెంకటి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమైన ఆయన.. చిన్నతనం నుంచే విద్యార్థులకు నోటి పరిశుభ్రత, దంత ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్‌బీఎస్‌కే వైద్య బృందాల సమన్వయంతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, మారుమూల ప్రాంతాల విద్యార్థులకు సైతం ఉచిత దంత వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.

పొగమంచులో ప్రయాణం ప్రమాదకరం

- అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి
- తెల్లవారుజామున 8 గంటల వరకు అప్రమత్తత అవసరం
- వేగం తగ్గించి.. వాహనాల మధ్య దూరం పాటించాలి
- వాహనదారులకు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచనలు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 18 (జనంసాక్షి):

శీతాకాలంలో దట్టమైన పొగమంచు కారణంగా రహదారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సూచించారు. అత్యవసరమైతే తప్ప పొగమంచు సమయంలో ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఉష్ణోగ్రతలు తగ్గడంతో తెల్లవారుజామున రహదారులపై పొగమంచు కమ్ముకుంటోందని, ముఖ్యంగా ఉదయం 8 గంటల వరకు తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు, రహదారిపై అడ్డంకులు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. పొగమంచులో అధిక వేగం, ఆకస్మిక బ్రేకులు, ఓవర్‌టేకింగ్ ప్రమాదాలకు కారణమవుతాయని హెచ్చరించారు. వాహనదారులు వేగాన్ని తగ్గించి, ముందు వెళ్లే వాహనానికి తగినంత దూరం పాటించాలని సూచించారు. పొగమంచు సమయంలో హైబీమ్ కాకుండా లోబీమ్ హెడ్‌లైట్లు, అవసరమైనప్పుడు ఫాగ్‌లైట్లు వినియోగించాలని తెలిపారు. హెడ్‌లైట్లు, టెయిల్ లైట్లు, ఇండికేటర్లు సక్రమంగా పనిచేస్తున్నాయో తనిఖీ చేసుకోవాలని, వాహనాలకు రేడియం రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వాడకూడదని, అలసటగా ఉన్నప్పుడు ప్రయాణించవద్దని స్పష్టం చేశారు. పొగమంచు కారణంగా రహదారి కనిపించని పరిస్థితుల్లో సురక్షితమైన ప్రదేశంలో వాహనాన్ని నిలిపి, పరిస్థితులు అనుకూలించిన తర్వాతే ప్రయాణం కొనసాగించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఇతరుల ప్రాణాల భద్రతకు కూడా బాధ్యత వహించాలని కోరారు. ప్రయాణంలో తొందరపాటు వద్దని, గమ్యస్థానానికి క్షేమంగా చేరుకోవడమే ముఖ్యమని, వ్యక్తిగత భద్రతే కుటుంబానికి భరోసా అని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు.

ఎఫ్ఎల్ఎన్ అమలు తీరుపై డాక్యుమెంటరీ చిత్రీకరణ

పాఠశాలలో సిఎస్ఎఫ్ బృందం పరిశీలన

బొంరాస్ పేట, నవంబర్ 18 (జనం సాక్షి): మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ (జి) పాఠశాలను బుధవారం ఢిల్లీకి చెందిన సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ ప్రతినిధుల బృందం సభ్యులు పల్లవి, చైతన్య,ప్రశాంత్,తులసి,ప్రత్యూష సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమం, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు ఉపాధ్యాయుల బోధన పద్ధతులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి తరగతి నీ సందర్శించి ఉపాధ్యాయుల బోధన విధానాలు,విద్యార్థుల ప్రతిస్పందనలు వారు చేస్తున్న కృత్యాలను వీడియోలు,ఫోటోల ద్వారా చిత్రీకరించారు.ఈ సమగ్ర సమాచారాన్ని ఒక డాక్యుమెంట్ గా రూపొందించే ప్రక్రియను బృందం సభ్యులు చేపట్టారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి హరిలాల్ మాట్లాడుతూ ఫౌండేషనల్ స్థాయిలో విద్యార్థులకు బలమైన పునాది వేయడంలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని, దీనివల్ల ప్రాథమిక విద్యలో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, అనసూయ తదితరులు ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
19 నవంబర్ 2026

పట్టభద్రుల ఓటరు జాబితాపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

- ఈ నెల 25న ముసాయిదా జాబితా విడుదల
- నిర్ణీత గడువులోగా ఓటరు జాబితా రూపకల్పన పూర్తి చేయాలి
- 29,232 దరఖాస్తులకు గాను 27,961 పరిష్కారం..
- డిసెంబర్ 30న తుది జాబితా



వనపర్తి, నవంబర్ 18 (జనం సాక్షి) : పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటరు జాబితా రూపకల్పన ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. ఓటరు నమోదు, దరఖాస్తుల పరిశీలనలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఓటరు జాబితా పరిశీలకులతో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటరు జాబితాల రూపకల్పన పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ఓటరు నమోదుకు అందిన దరఖాస్తుల పరిశీలన, ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, సాధించిన పురోగతిని కలెక్టర్ వివరించారు. జిల్లాలో పట్టభద్రుల ఓటరు నమోదుకు మొత్తం 29,232 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 27,961 దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ ఓటరు జాబితా తయారీ ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఫారం-18 ద్వారా అందిన పట్టభద్రుల ఓటరు నమోదు దరఖాస్తులను సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సహా క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. దరఖాస్తుదారుల విద్యార్హతలు, సాధారణ నివాసం, ఉపాధ్యాయుల బోధనా అనుభవం, సంబంధిత విద్యాసంస్థల ధ్రువీకరణ పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హతలను నిర్ధారించాలని ఆదేశించారు.

అర్హులైన పట్టభద్రుల పేర్లు ఓటరు జాబితాలో చేరేలా చర్యలు తీసుకోవడంతో పాటు అనర్హుల పేర్లు నమోదు కాకుండా అప్రమత్తంగా ఉండాలని, డబుల్ ఓట్ల నమోదును పూర్తిగా నివారించాలని అధికారులకు సూచించారు. ఓటరు జాబితా రూపకల్పనలో పారదర్శకత, ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

ఈ నెల 25వ తేదీన ముసాయిదా పట్టభద్రుల ఓటరు జాబితా విడుదల కానున్న నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ఎన్నికల సంఘం నిర్దేశించిన విధివిధానాలను అనుసరిస్తూ తదుపరి ప్రక్రియను పూర్తి చేసి, డిసెంబర్ 30వ తేదీన తుది ఓటరు జాబితాను విడుదల చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

ఈ ప్రక్రియలో ప్రతి దశను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో రామ్ రెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

భూ రీ-సర్వే పనుల్లో కచ్చితత్వం, పారదర్శకత పాటించాలి

- రోజుకు కనీసం 40 ఎకరాల సర్వే పూర్తి చేయాలి
- అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ



జడ్చర్ల, నవంబర్ 18 (జనంసాక్షి) : భూ రీ-సర్వే పనులను ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ ఆదేశించారు. బుధవారం తహశీల్దార్ నర్సింగరావుతో కలిసి మండలంలోని కిష్టారం, అంబటాపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న రీ-సర్వే పనులను ఆమె పరిశీలించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్, మండల మరియు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సమక్షంలో జరుగుతున్న గ్రామ శివారు, భౌతిక కొలతలను అదనపు కలెక్టర్ సమీక్షించారు. సర్వేయర్లు ప్రతిరోజూ ఉదయం 9:30 గంటలకు విధులకు హాజరై, రోజుకు కనీసం 40 ఎకరాల సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కొలతలను రెవెన్యూ రికార్డులతో సరిపోల్చాలని, ఏవైనా వ్యత్యాసాలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సర్వే పూర్తయిన, మిగిలిన విస్తీర్ణం వివరాలతో ప్రతిరోజూ నివేదికలు సమర్పించాలన్నారు. అనంతరం కిష్టారం గ్రామంలో రైతులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నారు. సర్వే విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తూ సందేహాలను నివృత్తి చేయాలని సిబ్బందికి సూచించారు. రీ-సర్వేను గడువులోగా పూర్తి చేసేందుకు రైతులు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే

- 10 లక్షల వ్యయంతో మహిళా సమైక్య భవనానికి భూమి పూజ



మల్దకల్, నవంబర్ 18 (జనంసాక్షి) : మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు బుధవారంఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు భూమి పూజచేసిప్రారంభించారు.ఎమ్మెల్యేమాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు పెద్దపీటవేస్తూ మహిళలకు మహిళ సమైక్య ఏర్పాటు చేసుకొని మహిళలకు వడ్డీ లేని రుణాలను అందించడం జరుగుతుంది.ప్రతి ఒక్క మహిళ మహిళా సమైక్యాలు సభ్యురాలుగా ఉండాలి.మహిళాలు ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం వడ్డీ లేకుండా మహిళలకు రుణాలను అందించడంజరుగుతుందని తెలిపారు. మహిళా సమాఖ్య భవనంలో మహిళలు సమావేశాలు నిర్వహించుకోవాలి అని తెలపారు.గోదాంలు ఉంటే నిల్వ సౌకర్యాలు పెరగడం ద్వారా రైతులు తమ పంటను వెంటనే తక్కువ ధరకు అమ్మాల్సిన పరిస్థితి తగ్గుతుంది.ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకునే అవకాశం గ్రామంలోని ప్రజలకు తాగునీటి సమస్యలు తీసే విధంగా పైప్లైన్ ద్వారా నేరుగా ప్రతి ఇంటికి తాగునీటిని అందించడం జరుగుతుంది తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి,మాజీ ఎంపీపీ రాజారెడ్డి,మాజీ జెడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్,జిల్లా సీనియర్ నాయకులు విక్రమ్ సింహారెడ్డి,గోపాల్ రెడ్డి,ఆలయ చైర్మన్ ప్రహ్లాద రావు,మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు తూమ్ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ యాకోబ్,నాయకులు వెంకటన్న,రాముడు,కొంకతి నరేందర్,నరసింహులు, ఉప్పరి నారాయణ, మధు,నరసింహారెడ్డి ఆంజనేయులు,భాస్కర్ గౌడ్,పరశురాముడు,బద్రి, తిమ్మప్ప, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సదాశివపేట, నవంబర్ 18 (జనంసాక్షి) : సదాశివపేట మండలం నాగులపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన చేయూత ఆసరా పింఛన్ల మంజూరు పత్రాలను సర్పంచ్ విజయలక్ష్మి శివానంద్ గౌడ్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని తెలిపారు. నూతన పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పద్మారావు, వార్డు సభ్యులు బాలయ్య, ఎల్లకొండ నరసింహులు, సాయిలు, నాగమణి, నర్సింలు గౌడ్, మాజీ సర్పంచ్ గొల్ల అంజన్న, గ్రామ పెద్దలు విట్టల్, ఆనంద్ స్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తూ వినూత్న నిరసన తెలిపిన ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులు

- కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలి
- ప్రైవేట్ ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలి
- కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే పాలకులకు పుట్టగతులు ఉండవు: సీపీఐ నేత రమేష్



వనపర్తి రూరల్, నవంబర్ 18 (జనం సాక్షి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్వైజర్ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను రూ.26 వేలకు పెంచాలని సీపీఐ నాయకుడు జి.రమేష్ డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే పాలకులకు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన ఆందోళనలో భాగంగా బుధవారం వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ భిక్షాటన చేస్తూ తమ సమస్యలను పరిష్కరించాలని యాచించారు. గత ఏడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ బోధనాసుపత్రులు, మెడికల్ కళాశాలలు, జిల్లా ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోగుల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ కార్మికుల సేవలను ప్రభుత్వం ప్రశంసిస్తున్నప్పటికీ, వారి వేతనాల పెంపు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. రోగుల మలమూత్రాలను శుభ్రం చేస్తూ, ఆసుపత్రుల పరిశుభ్రతను కాపాడుతున్న కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ప్రైవేట్ ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి కార్పొరేషన్ ద్వారా నేరుగా వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను సక్రమంగా అమలు చేయాలని కోరారు. పండుగ సెలవులు, జాతీయ సెలవులు, ఆర్జిత సెలవులను కూడా కాంట్రాక్టు కార్మికులకు వర్తింపజేయాలని అన్నారు. ఇప్పటికే పలుమార్లు నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు, ముట్టడి కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం ఇకనైనా కాలయాపన చేయకుండా కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు సైతం సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీను, నాయకులు నరసింహ, కృష్ణ, దర్గస్వామి, కలవతమ్మ, లక్ష్మి, మధు, భాస్కర్, మోహన్, పవన్, ప్రశాంత్, ముజాయిద్దీన్, శాంత, ప్రియాంక, బాలకృష్ణ, శ్రీహరి, ఖదీర్, మహేష్, రూపావతి, పార్వతమ్మ, బాలమ్మ, శ్వేత, నవనీత తదితర కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

నస్కల్ పిఏసిఎస్ ఏర్పాటుతో రైతులకు లబ్ధి

నిజాంపేట, నవంబర్ 18 (జనం సాక్షి) : గత 40, 50 ఏళ్ళుగా రామాయంపేట పిఏసిఎస్ ద్వారా గ్రామీణ ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో నస్కల్ పిఏసిఎస్ ఏర్పాటు చేయడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. నిజాంపేటలో మండల కేంద్రంలో బుధవారం రోజున మీడియా సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి గ్రామాలైన నస్కల్, నందగోకుల్, రాంపూర్, నగరం తండా గ్రామాలను కలిపి నస్కల్ పిఏసిఎస్ కింద నూతనంగా మంజూరు చేయడం జరిగిందని, దీనివల్ల రైతులకు లాభం చేకూరుతుందని తెలిపారు. గతంలో రైతులకు లోన్ లు తీసుకోవాలనుకున్న, ఎరువులు, ధాన్యం కొనుగోలు లో రామాయంపేట పిఏసిఎస్ ద్వారా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని, అదనంగా 21 కిలోమీటర్ వెళ్లవలసి వచ్చేదని వారు తెలిపారు. ఇప్పుడు నస్కల్ పిఏసిఎస్ ఏర్పాటు కు సహకరించిన ఎమ్మెల్యే మైనపల్లి రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు భాను ప్రకాష్ రెడ్డి, సర్పంచ్ బాబు నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెల్దుర్తి వెంకట్ గౌడ్, పంజా మహేందర్, నసీరుద్దీన్, వార్డు సభ్యులు ఎండి రహీం, కృష్ణ యాదవ్,కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు మద్దికుంట శ్రీనివాస్, నాయకులు దేశెట్టి లింగం, దేశెట్టి సిద్దరాములు, లక్ష్మా గౌడ్, లింగం గౌడ్, మధుసూదన్ రెడ్డి, సురేష్, మెట్టు వెంకట్,సులేమాన్, లక్ష్మణ్ గౌడ్,తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



యాసంగిలో నీటి లభ్యత ఆధారంగానే పంటల సాగు చేపట్టాలి



మద్దూరు నవంబర్ 18 (జనం సాక్షి) : యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను బట్టి రైతులు పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని కోస్గి సహాయ వ్యవసాయ అధికారి నూతన్ కుమార్ సూచించారు. మద్దూరు మండలంలోని పెద్రిపహాడ్ గ్రామ రైతువేదిక వద్ద బుధవారం ఖేత్ బచావో అభియాన్ (సాగు భూమి సంరక్షణ కార్యక్రమం)లో భాగంగా సాగు భూముల పరిరక్షణ, నేల ఆరోగ్యం, పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ నూతన్ కుమార్ మాట్లాడుతూ.. రాబోయే యాసంగి సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి వనరుల లభ్యతను అంచనా వేసుకుని విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని పంటలు సాగు చేయాలని సూచించారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగును సాధ్యమైనంత వరకు తగ్గించి, తక్కువ నీటితో పండే శనగ, పెసర, మినుము, కూరగాయల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నేల ఆరోగ్య పరిరక్షణకు సేంద్రియ పదార్థాల వినియోగాన్ని పెంచాలని, పంట అవశేషాలను భూమిలో కలియదున్నాలని, భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువులు వినియోగించాలని సూచించారు. రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన ఆశప్ప వేరుశనగ పొలాన్ని సందర్శించి, పంటకు అవసరమైన సస్యరక్షణ చర్యలపై రైతుకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్, గ్రామ సర్పంచ్ అనసూయ తారాసింగ్, ఉపసర్పంచ్ నరసింహ, గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ఇందిరమ్మ భీమా పథకంతో ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైతుంది
- బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు మానుకోవాలి
- ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



ఖిల్లా ఘనపురం, నవంబర్ 18 (జనం సాక్షి) : మండల కేంద్రంలోని స్థానిక పద్మశాలి కళ్యాణ మండపంలో బుధవారం మండల అధికారుల ఆధ్వర్యంలో చేయూత పింఛన్ పథకం ద్వారా లబ్ధి పొందిన వారికి ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీసీసీ ఉపాధ్యక్షులు టి. సాయి చరణ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వికలాంగులు, వితంతువులు, గీత కార్మికులు, చేనేత కార్మికులకు దాదాపు 643 ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ల ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే, అధికారులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. దేశ అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని, సాగు, తాగునీటి రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఇప్పటికే సగం వరకు అమలు చేశామని, మిగిలిన హామీలను కూడా త్వరలోనే అమలు చేస్తామని పేర్కొన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 అందించే మహాలక్ష్మి పథకం, వృద్ధాప్య పింఛన్లను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచడం, తులం బంగారం వంటి హామీలను దశలవారీగా నెరవేరుస్తామని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను మానుకోవాలని సూచించారు. గత పాలకుల హయాంలో చేసిన అప్పుల భారం రాష్ట్రంపై పడిందని, అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాగు, తాగునీటికి ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు.గురువారం సిద్దిపేటలో ఇందిరమ్మ భీమా పథకం ప్రారంభం కానుందని ఎమ్మెల్యే వెల్లడించారు. రేషన్ కార్డు కలిగిన 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గలవారు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ప్రమాదవశాత్తు, లేదా సాధారణంగా మరణించిన సందర్భంలో సంబంధిత కుటుంబ నామినీకి రూ.5 లక్షల బీమా అందుతుందని వివరించారు. ఈ పథకం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఆర్డీఓ ఉమాదేవి, డీసీసీ ఉపాధ్యక్షులు సాయి చరణ్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి ముజాహిద్, తహసీల్దార్ బి. సుగుణ, ఎంపీడీఓ విజయ్ సింహా రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు క్యామ నవనీత, సింగిల్ విండో ఉపాధ్యక్షులు క్యామ రాజు, దిశ కమిటీ జిల్లా సభ్యులు మూడవత్ రవి నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొత్తగోళ్ల కృష్ణయ్య, సర్పంచులు ఆగారం పద్మమ్మ, ప్రకాష్, రామాంజనేయులు, దేవుజ నాయక్, నవీన్ కుమార్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు గౌస్ పాషా, కార్యదర్శి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అత్యుత్తమ వైద్యం అందించడమే లక్ష్యం



అయిజ, నవంబర్ 18 (జనంసాక్షి) : తాను పుట్టిన ఊరికి సేవ చేయడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. తన తండ్రి రాజకీయంగా ప్రజలకు సేవలు అందిస్తున్నారని, చిన్నప్పటి నుంచి సేవాభావంతో, సాధించాలని పట్టుదలతో డాక్టర్ వృత్తిని ఎంచుకున్నట్లు తెలిపారు. పట్టణానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ, తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తూ ,వకింత భావోద్వేగానికి గురయ్యారు. తన కూతురు తాను పుట్టిన ఊరిలోనే సేవలందించి గుర్తింపు తెచ్చుకోవాలని, కుటుంబ ఆశయంగా ఆయన తెలిపారు. డాక్టర్ శ్రావణి ప్రభుత్వ వైద్యురాలిగా ఐజా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మొదటి రోజు వైద్య సేవలు అందించి తన ప్రస్తానాన్ని, బాధ్యతలు మొదలుపెట్టి నందుకు జోగులాంబ గద్వాల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డి ఎం డి తాహెర్ శాలువాతో డాక్టర్ శ్రావణిని సన్మానించారు. భవిష్యత్తులో ఎంతోమందినిరుపేదలకు వైద్య సేవలు అందించి మంచి పేరు సంపాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నయ్య గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పేరు లేని వారికి మరో అవకాశం

- ఏఎస్డీడీ ఓటర్ల నమోదుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి
- డిసెంబర్ 22న తుది ఓటరు జాబితా ప్రచురణ
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



మావల నవంబర్ 19(జనం సాక్షి): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (꠰×=) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని ఏఎస్డీడీ ఓటర్లకు తిరిగి పేరు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎస్డీడీ ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియ నవంబర్ 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు, డిసెంబర్ 10లోగా ఫారాల పరిశీలన పూర్తి చేయనున్నట్లు తెలిపారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార గడువును డిసెంబర్ 15 వరకు పొడిగించగా, తుది ఓటరు జాబితాను డిసెంబర్ 22న ప్రచురించనున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని, పేరు లేని వారు అవసరమైన పత్రాలతో సంబంధిత బూత్ స్థాయి అధికారిని (బీఎల్ఓ) సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. సందేహాల నివృత్తికి ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నంబర్ 1950ను సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

శివాజీ బీడీ యాజమాన్యం చర్చలకు రావాలి

- లేకపోతే ఆందోళన జిల్లా వ్యాప్తంగా తీవ్రతరం చేస్తాం
- బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే రాజన్న



సారంగాపూర్, నవంబర్ 18 (జనంసాక్షి) : శివాజీ బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యాజమాన్యాన్ని హెచ్చరించారు. మంగళవారం రోజున సారంగాపూర్ మండల కౌటాల శివాజీ బీడీ హెడ్ ఆఫీస్ ను వందలాదిమంది కార్మికులతో ముట్టడి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కే రాజన్న మాట్లాడుతూ బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కై 9వ తేదీ నుండి కార్మికులు సమ్మె చేస్తున్న యాజమాన్యం చర్చలకు రాకపోవడం మొండి వైఖరి విడనాడి చర్చలకు రావాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రెక్కలు ముక్కలు చేసుకొని బీడీ పై బతుకుతున్న బీడీ కార్మికులను నాసిరకమైన తునికాకుసరఫరా చేస్తూ నాణ్యమైన బీడీలు తీసుకురావాలని బీడీ కార్మికులను ఒత్తిడి చేస్తున్నారు. బీడీ కమిషన్ దారులు గంపలు సెంటర్కు తీసుకుపోయి మేనేజర్కు అప్పజెప్పితే ఒక్కొక్క గంప నుండి రెండువేల నుంచి పదివేల వరకు బీడీ చాటు చేస్తూ దోపిడీకి గురి చేస్తున్నారు. చాటు చేసిన పదివేల బీడీకి యాజమాన్యం కూలీ తునికాకు కట్టించకుండా బీడీ కమిషన్ దారులను యాజమాన్యం దోచుకుంటా ఉన్నారు. నాణ్యమైన తునికాకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత వారం రోజుల నుండి బీడీ కార్మికులు పని నిలుపుదల చేసి సమ్మె చేస్తే ఉంటే యాజమాన్యం చర్చలకు రాకపోవడం, మొండిగా వ్యవహరిస్తూ సిగ్గుచేటు విషయమని, అన్నారు. వెంటనే చర్చలకు వచ్చి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్ నంబర్లు నెలకు 26 రోజుల పని దినములు పెంచుతూ రోజు వెయ్యి బీడీలకు తంబాకు కల్పించాలని ఈ సమస్యలను జఠలం చేయకుండా సానుకూలంగా చర్చలకు వచ్చి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం బక్కన్న, ఉపాధ్యక్షులు ఆర్ రామ లక్ష్మణ్, జిల్లా జాయింట్ సెక్రెటరీ ఎస్ గంగన్న, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి, సరోజన, గౌతమి, కళావతి, పోసవ్వ, శైలజ, స్రవంతి, కటకం గంగాధర్, కల్లూరు గంగాధర్, శివలింగం, సత్యం, నరేష్, రాజేందర్, బి.నర్సయ్య, గంగాధర్, గోపి, భూమన్న, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి

- ఆగివున్న లారీని ఢీకొని దుర్మరణం
- గ్రామంలో విషాదఛాయలు



నెరడిగొండ నవంబర్18 (జనంసాక్షి): మండలంలోని గుత్పల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గసకంటి రవి ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.స్థానిక ఎస్ఐ ఇమ్రాన్ ఖాన్ తెలిపిన వివరాల మేరకు బుధవారం రోజున గసకంటి రవి(45)తన స్వగ్రామమైన గుత్పల నుండి మధ్యాహ్నం నెరడిగొండ మండల కేంద్రానికి పని నిమిత్తం బయలుదేరారు.మండల సమీపంలోని రోల్ మామడ టోల్ ప్లాజా వద్ద ఆయన ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఆగివున్న ఓ కంటైనర్ ను వెనుక నుంచి ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ జిల్లా రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ పరీక్షించి చూడగా తుదిశ్వాస విడిచారని తెలిపారు,ఈ విషయం తెలుసుకున్న గుత్పల గ్రామ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. రవి మృతి వార్తతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆకస్మికంగా మృతి చెందడంతో గ్రామస్తులు, బంధుమిత్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఆయన మృతిపట్ల పలువురు గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి కొడుకు కూతురు భార్య ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదులో లారీ డ్రైవర్ తన లారీని నిర్లక్ష్యంగా ఎలాంటి సూచికలు లేకుండా రోడ్డు పై పార్కింగ్ చేసి మృతికి కారణం అయినదని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హనుమకొండ జిల్లాకు ఎయిడ్స్ నివారణ నియంత్రణలో 'సురక్షిత్ జిల్లా' గుర్తింపు

- డిప్యూటీ డైరెక్టర్ ఇందిరా చేతుల మీదుగా జిల్లా కలెక్టర్‌కు ఘన సన్మానం..



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (జనం సాక్షి) :ఎయిడ్స్ నివారణ, నియంత్రణ లో భాగంగా జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్దేశించిన 95-95-95 లక్ష్యాలను విజయవంతంగా సాధించి, హనుమకొండ జిల్లా ప్రతిష్టాత్మ కమైన 'సురక్షిత్ జిల్లా గా' గుర్తింపును సాధించింది.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ ఆదేశాల మేరకు, జిల్లా సాధించిన విజయానికి గుర్తింపుగా నేడు జిల్లా కలెక్టర్ కార్యలయంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ని తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఇందిర జ్ఞాపిక శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సురక్షిత్ జిల్లా గా గుర్తింపు రావడం అందరి సమిష్టి కృషి, అంకితభావం, సమన్వయంతోనే సాధ్యమైందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత పట్టుదలతో కృషి చేసి 'సురక్షిత్ ప్లస్' స్థాయిని సాధించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్వో డా. అప్పయ్య,డిప్యూటీ డిఎంఎస్ఓ డా. మదన్మోహన్ రావు, సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఆఫీసర్ డాక్టర్. సూర్యప్రకాష్, డెమో ప్రసాద్, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ స్వప్న మాధురి, సూపర్‌వైజర్ రామకృష్ణ, అకౌంటెంట్ కమలాకర్, ఐ సి టి సి కౌన్సిలర్ రాపర్తి సురేష్, సహయోగి శిరీష, ఎన్జీవో ప్రతినిధులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కోతుల బెడదకు చెక్!

- భూపాలపల్లిలో నెల రోజుల పాటు ప్రత్యేక ఆపరేషన్
- తొలుత 14వ వార్డులో 200 కోతుల పట్టివేత
- అన్ని వార్డుల్లో విడతల వారీగా చర్యలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): భూపాలపల్లి పట్టణ ప్రజలను కొంతకాలంగా తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్న కోతుల బెడదకు అడ్డుకట్ట వేసేందుకు మున్సిపాలిటీ నడుం బిగించింది. ఇళ్లపై దండెత్తుతున్న కోతులు.. వంటగదుల్లోకి చొరబడుతూ నిత్యావసర వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. మరోవైపు చిన్నారులు, వృద్ధులపై దాడులకు దిగుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపే దిశగా మున్సిపాలిటీ నెల రోజుల పాటు ప్రత్యేక కోతుల పట్టివేత కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య వెల్లడించిన వివరాల ప్రకారం.. పట్టణంలోని 14వ వార్డులో తొలుత సుమారు 200 కోతులను పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. అక్కడితో ఆగకుండా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో నెల రోజుల పాటు విడతల వారీగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, కోతుల సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ప్రాతిపదికగా తీసుకుని ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. పట్టణంలోని పలు కాలనీల్లో కోతుల స్వైరవిహారం నిత్యకృత్యంగా మారింది. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, ఇంటి సామగ్రిని ధ్వంసం చేయడం, చెట్లపై ఉన్న పండ్లు, పంటలను నాశనం చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్నారులు బయటకు వెళ్లాలన్నా, ఇంటి ఆవరణలో ఆడుకోవాలన్నా భయపడే పరిస్థితి నెలకొంది. కోతుల దాడుల భయంతో పలువురు అప్రమత్తంగా ఉండాల్సి వస్తోంది.

ప్రత్యేక సిబ్బందితో పట్టివేత

కోతులను పట్టుకునేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామని చైర్మన్ కొమురయ్య తెలిపారు. వాటికి ఎలాంటి హాని కలగకుండా సురక్షిత పద్ధతుల్లో పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెడతామని స్పష్టం చేశారు. నెల రోజుల పాటు జరిగే ఈ ప్రత్యేక కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని, తమ ప్రాంతాల్లో కోతుల బెడద అధికంగా ఉంటే మున్సిపాలిటీ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. కోతుల బెడదతో సతమతమవుతున్న పట్టణ ప్రజలకు ఈ ప్రత్యేక కార్యక్రమం ఎంతమేర ఉపశమనం కలిగిస్తుందో వేచి చూడాలి. ప్రజలు కోరుతున్నట్లుగా అన్ని వార్డుల్లో సమర్థవంతంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తేనే సమస్యకు పరిష్కారం లభించనుంది.

కలెక్టరేట్‌లో భూసేకరణ అంశంపై సమీక్ష

పాల్గొన్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (జనం సాక్షి) : హనుమకొండ జిల్లా పరిధిలో గౌరవెల్లి ప్రాజెక్టు, కొత్త రైల్వే లైన్లు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కు వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ కు సంబంధించి చేపట్టే భూసేకరణ అంశంపై స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజ్,జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ సమావేశమై భూ సేకరణకు సంబం ధించిన అంశాలపై చర్చిం చారు. ఈ సమావేశంలో హనుమ కొండ ఆర్డిఓ వెంకటేష్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, జిడబ్ల్యూఎంసి సిపిఓ రవీంద్ర రెడేకర్, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పరకాలలో రూ.40.95 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం


- ఇందిరా మహిళా డెయిరీ పాల సేకరణ కేంద్రం శంకుస్థాపన
- పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి సీతక్క



వరంగల్ ప్రతినిధి, నవంబర్ 18 (జనంసాక్షి): పరకాల నియోజకవర్గంలో రూ.40.95 కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దానసరి అనసూయ (సీతక్క) శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియ కావ్య, మాజీ ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, కుడా చైర్మన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్. ఎ. ఎం పథకం కింద చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, చేయూత పింఛన్ల పంపిణీ, పరకాలలో ఇందిరా మహిళా డెయిరీ పాల సేకరణ కేంద్రం, కేంద్ర భవనాల నిర్మాణాలకు శంకుస్థాపనలు, పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కర్రె గుట్టల్లో ఆదివాసీ భూములకు రీ-సర్వే చేసి భూభారతి పోర్టల్‌లో పొందుపరచాలి

- భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు కి వినతి పత్రం అందజేసిన ఏఎన్ఎస్ నాయకులు



నూగూర్ వెంకటాపురం నవంబర్ 18(జనం సాక్షి): ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని కరగుట్టలో ఆదివాసి భూలకు రీసర్వే చేసి, ధరణి పోర్టల్ లో లెక్కించాలని, భద్రాచలం శాసనసభ్యులు వెంకటరావుకి, ఏ ఎన్ ఎస్ మండల అధ్యక్షుడు వాసం నా రాయణ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ మండల అధ్యక్షుడు వాసం నారాయణ మాట్లాడుతూ... కర్రె గుట్టల ప్రాంతంలో ఉన్న పామూరు, జెల్ల డోలి చలమల తడపల కుకునూరు గ్రామాలలో ఆదివాసీలు వందల ఏళ్ళుగా జీవించి ఉన్నారని అన్నారు. ఈ గిరిజన గ్రామాలు ఏళ్లుగా రోడ్డు హాస్పిటల్ విద్య వైద్యం వంటి మౌలిక సౌకర్యాలు లేక అక్కడే జీవించి ఉన్నారని అన్నారు. ప్రభుత్వం అక్కడ నుంచి కిందకు వచ్చిన ఆదివాసులు వ్యవసాయ లేక శాశ్వత కూలీలుగా మారారని అన్నారు. కర్రే గుట్టల ప్రాంతంలో పైన ఉన్న ఆదివాసుల వారసత్వ భూములు ఉన్నాయని తెలిపారు. అలాంటి ప్రభుత్వాలు ఆ గ్రామాలకు వెళ్లి సర్వే చేసి అందరికీ పట్టాలు జారీ చేయకపోవడం ప్రభుత్వ యొక్క పొరపాటున అన్నారు. 2018 -19 కాలంలో టిఆర్ఎస్ ప్రభుత్వం భూప్రక్షాళన సమయంలో పైన తెలుపైన గ్రామాల్లో ఉన్న భూములను డిజాక్టేడ్ గ్రామాలుగా ప్రకటించారని అన్నారు. రెవిన్యూ అధికారులు ఆ గ్రామాలకు చెందినఆదివాసీ పట్టాదారులకు పేసా చట్టం ప్రకారం పేసా గ్రామ సభలు పెట్టిఆదివాసీల ఆమోదం ద్వారా ముందస్తు నోటీసులు ద్వారా రిజెక్టెడ్ గ్రామాలకు నిర్ధారించాలని అన్నారు న్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినరీ సర్వే ద్వారాఆ గ్రామాల్లో ఉన్న భూములకు రి సర్వే చేసి భూభారతి పోర్టల్ లో పొందుపరచి పట్టాలు మంజూరు చేసి ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నవనిర్మాణ సేన జిల్లా కన్వీనర్ కుంజ మహేష్, జిల్లా ఉపాధ్యక్షులు కంతి విజయ్,ఏ ఎన్ ఎస్ నాయకులు బొగ్గుల దేవేందర్, ఏ ఎన్ ఎస్ మండల ఉపాధ్యక్షులు కంతి శంకర్,తదితరులు పాల్గొన్నారు.

ములుగులో జిల్లా స్థాయి జాతీయ యువజనోత్సవం విజయవంతం

- వివిధ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు, 150 మందికి పైగా విద్యార్థుల ఉత్సాహభరిత భాగస్వామ్యం



ములుగు ప్రతినిధి, నవంబర్ 18(జనంసాక్షి) : యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, కళాత్మక నైపుణ్యాలు, ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహించిన జిల్లా స్థాయి జాతీయ యువజనోత్సవం-2026 విజయవంతంగా ముగిసిందని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎ ధర్మానాయక్ తెలిపారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ములుగు గిరిజన భవన్ లో నిర్వహించిన జిల్లా స్థాయి జాతీయ యువజనోత్సవంలో వివిధ ప్రాంతాలకు చెందిన 150 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారని తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలోని సృజనాత్మకత, కళాత్మక నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించడమే జాతీయ యువజనోత్సవాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని ఉన్నత స్థాయికి ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. జిల్లా స్థాయిలో జానపద నృత్యాలు (ఫోక్ డ్యాన్స్), జానపద గీతాలు (ఫోక్ సాంగ్స్), చిత్రలేఖనం (పెయింటింగ్), కవితా రచన, వీధి నాటకాలు తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు వివరించారు. ఈ పోటీల కోసం 18 మంది న్యాయనిర్ణేతలను ఆహ్వానించినట్లు తెలిపారు.

వివిధ పోటీల్లో విజేతల వివరాలు

జానపద నృత్యాల విభాగంలో ములుగు టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాల ప్రథమ స్థానం సాధించగా, జానపద గీతాల విభాగంలో బండారుపల్లి టీజీఎంఎస్ ప్రథమ స్థానంలో నిలిచింది. చిత్రలేఖనం విభాగంలో జాకారం టీజీఎస్ ప్రథమ స్థానం, బండారుపల్లి టీజీఆర్ఎస్ ద్వితీయ స్థానం సాధించాయి. కవితా రచన విభాగంలో వెంకటాపూర్ టీజీఎంఆర్‌జేసీ ప్రథమ స్థానం, బండారుపల్లి టీజీఆర్ఎస్‌జేసీ ద్వితీయ స్థానం సాధించాయి. వీధి నాటకాల విభాగంలో ములుగు టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు జ్ఞాపికలు అందజేసి అభినందించినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో విజయం సాధించిన విద్యార్థులను తదుపరి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు ధర్మానాయక్ వెల్లడించారు. యువత తమలోని ప్రతిభను నిరంతరం మెరుగుపరుచుకుంటూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.



అడెల్లి నందనవనాన్ని సందర్శించిన జిల్లా అటవీ అధికారి

సారంగాపూర్, నవంబర్ 18 (జనం సాక్షి) : సారంగాపూర్ మండలంలో అడెల్లి నందనవనాన్ని బుధవారం నిర్మల్ జిల్లా అటవీధికారి సుశాంత్ బోబడే సందర్శించారు. నందనవనం నందు ఇటీవల నిర్మించిన గదిని, బోర్వెల్ ను చూసి, పైన వినియోగంలో లేని మూడు షెడ్డులను చూసి వాటికి మరమ్మతులు చేసి వాడుకలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ తో పాటు ఎఫ్ఆర్ఓ రామకృష్ణారావు శ్రీనివాసరావు అటవీ క్షేత్ర అధికారులు,నజీర్ ఖాన్, సంతోష్ కుమార్ ఉప అటవీ క్షేత్ర అధికారులు, సంతోష్ ఎఫ్ బి ఓ లు ఉన్నారు.

గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులుగా తిరుపతి రావు బాధ్యతల స్వీకరణ



మావల నవంబర్ 19 (జనం సాక్షి): జిల్లా గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులుగా ఏం. తిరుపతి రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతన సహాయ సంచాలకులకు శు భాకాంక్షలు తెలిపారు. గనులు, భూగర్భ శాఖ కార్యకలాపాలను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహిస్తూ ప్రభుత్వ నిబంధనలను పక్కాగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ రమేష్ పవర్ తదితరులు పాల్గొన్నారు.

నడికూడ ఎంపీడీఓ నూతన కార్యాలయానికి శంకుస్థాపన

- శంకుస్థాపన చేసిన మంత్రి సీతక్క ఎంపీ కడియం కావ్య ఎమ్మెల్యే రేవూరి



నడికూడ నవంబర్ 18 (జనం సాక్షి) : రూ.2 కోట్ల రూపాయలతో నిర్మించనున్న నడికూడ ఎంపీడీఓ నూతన కార్యాలయానికి గీసుగొండ మండలం చింతలపల్లి స్టేజి వద్ద తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు గౌ. శ్రీమతి ధనసరి అనసూయ (సీతక్క) పరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య , పరకాల శాసనసభ్యులు, అభివృద్ధి ప్రదాత రేవూరి ప్రకాష్ రెడ్డి పాల్గొని శంకుస్థాపన చేసారు.. నడికుడ కు నూతన మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవన ఏర్పాటుకు రెండు కోట్ల నిధులు మంజూరు చేయించిన పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డికి కాంగ్రెస్ మండల పార్టీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
19 నవంబర్ 2026

విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 2 లక్షలతో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు
- ఆర్వో వాటర్ ప్లాంట్ యూనిట్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి



కల్లూరు, నవంబర్ 18 (జనం సాక్షి) : విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణతో పాటు నాణ్యమైన విద్య, మెరుగైన మౌళిక సదుపాయాల కల్పనకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.బుధవారం కల్లూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 2 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్ యూనిట్ ను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన త్రాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో పాఠశాలలో రూ.2 లక్షల వ్యయంతో ఆర్వో వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్ యూనిట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో ఇదే ట్రస్ట్ ద్వారా పాఠశాల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు నిధులు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తోందని అన్నారు. విద్యతో పాటు క్రీడా రంగాల్లోనూ విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీపడేలా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ, క్రీడలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



మోటకొండూరు, నవంబర్ 18 (జనం సాక్షి) : యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన 416 మంది అర్హులైన లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకే నూతన పెన్షన్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఆరు గ్యారంటీలతో పాటు మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రుణమాఫీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ, సన్నబియ్యం పంపిణీ, కళ్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పీడీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు యెల్లంల సంజీవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నెమ్మని సుబ్రమణ్యం, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మధర్ గౌడ్, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కొప్పుల వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు జెన్నే సిద్ధులు, స్థానిక సర్పంచ్ భూమండ్ల జయమ్మ శ్రీనివాస్, ఎంపీడీఓ ఇందిర, తహసీల్దార్ రాజేంద్ర ప్రసాద్, సీఐ శంకర్ గౌడ్, ఎస్ఐ కుమారస్వామి యాదవ్, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 లోగోను ఆవిష్కరించిన మంత్రి వాకిటి శ్రీహరి



మధిర, నవంబర్ 18 (జనంసాక్షి) : మధిర పట్టణంలోని రెడ్డి గార్డెన్స్ లో బుధవారం రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ తో కలిసి, తెలంగాణ రాష్ట్రంలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026కు సంబంధించిన లోగో, మస్కట్, బ్రోచర్ లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వడం రాష్ట్రానికి దక్కిన గొప్ప గౌరవమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో క్రీడా మౌళిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరిగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల అధికారి తుంబూరు సునీల్ కుమార్, ఇంచార్జ్ డీఆర్డీవో శిరీష, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. పురందర, జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం, మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సాధినేని సుజాత, మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, మత్కెపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, మధిర మున్సిపల్ కమిషనర్ సామ్యూల్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీహరి



మధిర, నవంబర్ 18 (జనంసాక్షి) : తెలంగాణలో పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గతంలో మధిర నియోజకవర్గంలో 37,477 పింఛన్లు ఉండగా, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కొత్తగా 5,317 పింఛన్లు మంజూరు చేయడంతో మొత్తం పింఛన్ల సంఖ్య 42,794కు చేరిందని తెలిపారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాలుగా ఉన్నప్పటికీ పేదలకు అందించే సంక్షేమ పథకాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాజీపడటం లేదన్నారు. అదేవిధంగాఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి శ్రీహరి ప్రశంసించారు.రాష్ట్రమంతా పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను తెలుసుకున్న భట్టి విక్రమార్కకు మధిర ప్రజలు అండగా నిలిచి భారీ మెజార్టీతో గెలిపించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, , మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత, మధిర మున్సిపల్ కమిషనర్ సామ్యూల్, నియోజకవర్గ ఎంపిడిఓ లు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దొంగల ముఠా అరెస్ట్

- ఐదు కేసుల్లో రూ.7.50 లక్షల సొత్తు స్వాధీనం

దేవరకొండ, నవంబర్ 18 (జనం సాక్షి) : పట్టణ ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను దేవరకొండ పోలీసులు అరెస్టు చేశారు. ఐదు దొంగతనం కేసుల్లో నిందితుల నుంచి రూ.7.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు బుధవారం దేవరకొండ డీఎస్పీ ఎం.వి. శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ నెల 18న దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలోని గుడిపల్లి, మునుగోడు, మర్రిగూడ, చిట్యాల, నాంపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన ఐదు దొంగతనం కేసులను పోలీసులు ఛేదించారు. నిందితులు తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసుల్లో నిందితులైన మహమ్మద్ హసన్ (37), సయ్యద్ రఫీక్ ఉద్దీన్ (34)లను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో మహమ్మద్ హసన్‌పై గతంలో పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనం కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

ఐదు కేసుల్లో చోరీ సొత్తు స్వాధీనం

గుడిపల్లిలో 3 ఆవుల దొంగతనం, నాంపల్లిలో 2 పందెం కోడెలు ఒక బర్రె,మర్రిగూడలో 2 ఏద్దులు , మునుగోడులో 2 ఏద్దులు , చిట్యాలలో 3 ఏద్దులు , ఒక ఆవు చోరీకి గురైనట్లు పోలీసుల వివరాలు వెల్లడించారు. మొత్తం రూ.7.50 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల బృందానికి అభినందనలు

ఈ కేసుల ఛేదనలో దేవరకొండ డీఎస్పీ ఎం.వి. శ్రీనివాసరావు పర్యవేక్షణలో సీఐ ఏ. నవీన్ కుమార్, ఎస్ఐలు డి. నర్సింహులు, బి. రాజు, కరుణాకర్, జయేందర్ రెడ్డి, మధు,శేఖర్ లను తదితర పోలీస్ సిబ్బంది కీలకంగా వ్యవహరించారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

నైపుణ్యాభివృద్ధితోనే మహిళా సాధికారత సాధ్యం

- మహిళలు, బాలికలకు ఉచిత కంప్యూటర్, టాలీ శిక్షణ
- జిల్లా సంక్షేమ అధికారిణి లలితా కుమారి



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 18 (జనం సాక్షి) : నైపుణ్యాభివృద్ధితోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని జిల్లా సంక్షేమ అధికారిని లలితా కుమారి పేర్కొన్నారు. బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని జిల్లా మహిళా సాధికారత కేంద్రం ద్వారా బేటీ బచావో – బేటీ పడావో పథకంలో భాగంగా మహిళలు, బాలికలకు ఉచిత కంప్యూటర్, టాలీ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. జిల్లా సంక్షేమ అధికారిణి కె. లలితా కుమారి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవడానికి కంప్యూటర్ నైపుణ్యాలు ఎంతో అవసరమని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత శిక్షణ అవకాశాన్ని మహిళలు, బాలికలు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.

సంగారెడ్డి తహసీల్దార్ జయరాం మాట్లాడుతూ మహిళా సాధికారతకు విద్య, ఆర్థిక స్వావలంబన, నైపుణ్యాభివృద్ధి కీలకమని పేర్కొన్నారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని అన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లోనూ నల్లగొండ విద్యార్థులు సత్తా చాటాలి



నల్లగొండ, నవంబర్ 18 (జనం సాక్షి) : ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల విధానం, ఓటు హక్కు, ఓటు ప్రాముఖ్యతపై విద్యార్థులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియపై నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలోనూ బహుమతులు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.బుధవారం నల్లగొండ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీలను కలెక్టర్ పరిశీలించారు. మండల, జిల్లా స్థాయిల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మరింత ఉత్సాహంతో పాల్గొని ప్రతిభ చాటాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశం ప్రజాస్వామ్య దేశమని, ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధుల ద్వారా పాలన కొనసాగుతుందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని ఎన్నికల్లో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు, నామినేషన్ల దాఖలు, ఎన్నికల ప్రచారం, పోలింగ్ వంటి ఎన్నికల ప్రక్రియలోని వివిధ దశలను వివరించారు. బ్యాలెట్ పేపర్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) ద్వారా ఎన్నికలు నిర్వహించే విధానం, ఈవీఎంల పనితీరు, రూపకల్పన, భద్రతా ప్రమాణాలు, ఓట్ల లెక్కింపు ప్రక్రియ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్యాలెట్ పేపర్‌తో పోలిస్తే ఈవీఎంల ద్వారా ఓట్ల లెక్కింపు వేగంగా పూర్తవుతుందని వివరించారు. భారత ఎన్నికల విధానాన్ని పరిశీలించేందుకు ఇటీవల 18 దేశాల ప్రతినిధులు వచ్చి ఎన్నికల ప్రక్రియను పరిశీలించిన విషయాన్ని ప్రస్తావించారు.విద్యార్థులు చదువుతోపాటు ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగం, ఎన్నికల వ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశేందర్ రావు, డైట్ ప్రిన్సిపల్ కె. నరసింహ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ కారణంగా ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలి



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 18 (జనం సాక్షి) : అర్ణబ్ తుఫాను పూర్తిగా ఖమ్మం జిల్లాలో కేంద్రీకృతమైందని సమాచారం ఉన్నప్పటికీ, ప్రస్తుత సమాచారం ప్రకారం (బుధవారం మ. 2.00 గంటల) అట్టి తుఫాన్ ఒరిస్సా, ఛత్తీస్ గడ్ వైపు దారిమళ్లిందని తెలిసిందని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అన్నారు. బుధవారం జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తుఫాను ముందస్తు చర్యలపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, అర్ణబ్ తుఫాన్ ఒరిస్సా , ఛత్తీస్ గడ్ లవైపు దారి మళ్లినందున జిల్లాపై తుఫాన్ ప్రభావం కొంత తక్కువగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ, ఈ నెల 20, 21 తేదీల్లో భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ హెచ్చరికలు ఉన్నాయన్నారు. పరిస్థితిని బట్టి అవసరమైన చోట సహాయక చర్యల కోసం ఈ నెల 21, 22 తేదీల్లో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్టీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ అన్నారు. పరిస్థితి తీవ్రతను బట్టి, స్థానిక పరిస్థితుల ఆధారంగా పాఠశాలలకు, విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించే పూర్తి అధికారం జిల్లా విద్యా శాఖ అధికారి, సంక్షేమ విద్యా సంస్థల అధికారులకు ఇస్తున్నట్లు కలెక్టర్ అన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా వుంటూ, అధికార యంత్రాంగానికి సహకరించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

అల్లివేర్ల అక్రమ రవాణా గుట్టురట్టు

- ఐదుగురు పట్టివేత
- కృష్ణసాగర్ అటవీ ప్రాంతంలో అటవీశాఖ అధికారుల మెరుపుదాడులు
- 50 కిలోల అల్లివేర్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



బూర్గంపహాడ్, నవంబర్ 18 (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలో అల్లివేర్ల అక్రమ రవాణా గుట్టురట్టయింది. కృష్ణసాగర్ అటవీ ప్రాంతం నుంచి అల్లివేర్లను అక్రమంగా సేకరించి తరలిస్తున్న ఐదుగురిని అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. అటవీ ప్రాంతంలో అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తించిన అధికారులు దాడులు నిర్వహించి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 50 కిలోల అల్లివేర్లతో పాటు అక్రమ రవాణాకు ఉపయోగిస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అటవీ సంపదను అక్రమంగా తరలిస్తున్న వారిపై అటవీశాఖ అధికారులు తదుపరి చర్యలు చేపట్టారు. అటవీ ప్రాంతాల్లో విలువైన వన సంపదను అక్రమంగా సేకరించి తరలించే ఘటనలపై అటవీశాఖ నిఘా మరింత పెంచాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అటవీ సంపద పరిరక్షణకు అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గిరిజన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధం చేయాలి

- డిసెంబర్‌లో భద్రాచలం ఐటీడీఏ పరిధిలో రాష్ట్రస్థాయి గిరిజన క్రీడలు
- ఐటీడీఏ పీవో బి.రాహుల్



బూర్గంపహాడ్, నవంబర్ 18 (జనంసాక్షి) : గిరిజన విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారికి నాణ్యమైన శిక్షణ అందించడం ద్వారా రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడమే ఈ ఎంపికల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. బుధవారం బూర్గంపాడు మండలం ఉప్పుసాక ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రెండో రోజు డివిజన్ స్థాయి గిరిజన క్రీడల ఎంపిక పోటీలను ఆయన పరిశీలించారు. కబడ్డీ, ఖో-ఖో, టెన్నికాయిట్, క్యారమ్స్, చెస్‌తో పాటు షాట్‌పుట్, డిస్కస్ త్రో, లాంగ్‌జంప్, హైజంప్ తదితర క్రీడాంశాల్లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభను స్వయంగా వీక్షించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పారదర్శకంగా ఎంపిక చేసి, జిల్లా స్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ చూపేలా ప్రోత్సహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో డిసెంబర్‌లో రాష్ట్రస్థాయి గిరిజన క్రీడా పోటీలను భద్రాచలం ఐటీడీఏ పరిధిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను ఐటీడీఏ భద్రాచలం కైవసం చేసుకునేలా క్రీడాకారులను సిద్ధం చేయాలని ఉపాధ్యాయులు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. అనంతరం అధికారులతో కలిసి విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేశారు. రెండో రోజు ఎంపిక పోటీలను సమన్వయంతో విజయవంతంగా నిర్వహించిన అధికారులు, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డీడీ గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి చందన, ఏటీడీవోలు రాధమ్మ, గోపాలరావు, క్రీడల అధికారి, ఏఎస్ఓ వెంకటనారాయణ, బండ్ల పిచ్చయ్య, ప్రధానోపాధ్యాయులు బాలరాజు, ముత్తయ్య, సంపత్, విజయ, మహాలక్ష్మి, శశికళ, కృష్ణవేణి, వెంకట్, రాజశేఖర్, శ్రీకాంత్, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
19.11.2026



‘ఆరుతడి’పై నీలినీడలు

పంటలు పండేందకు ఏమాత్రం అనుకూలంగా లేని పాలాలు.

ఎలిగేడు,నవంబర్ 18(జనంసాక్షి) :
ఎలిగేడు మండలంలోని దూళికట్ట గ్రామంలో ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపు, పెరిగిన సాగు ఖర్చులు మరోవైపు వెంటాడుతున్నా అన్నదాత మాత్రం తన పోరాటాన్ని ఆపడం లేదు. ఓవైపు వాతావరణంలో మార్పులు, ‘ఎల్ నినో’ ఎఫెక్ట్‌తో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు, నీటి ఎద్దడి ఏర్పడతాయన్న ఆందోళన వెంటాడుతుండగా.. మరోవైపు ఎలిగేడు మండలం దూళికట్ట ప్రాంతంలోని భూములు ఆరుతడి పంటలు పండేందుకు ఏమాత్రం అనుకూలంగా లేవు.ఈ గ్రామ పరిధిలోని పొలాల్లో వరి తప్ప ఇతర ఆరుతడి పంటలు వేసినా మొలకెత్తని, దిగుబడి రాని పరిస్థితి ఉంది. దీంతో దిక్కులేక రైతులు మళ్లీ తప్పనిసరి పరిస్థితుల్లో వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు.వానాకాలం వరి కోతలు ముగియగానే, ఏమాత్రం విరామం తీసుకోకుండా యాసంగి (రబీ) పంట కోసం పొలాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇలా బురద మడిలో దిగి, నాట్లు వేసేందుకు ఒక రైతు తన పొలాన్ని చదును చేస్తూ రేపటి ఆశల కోసం మరో సాగు యుద్ధానికి సిద్ధమవుతున్న దృశ్యం స్థానిక రైతుల పట్టుదలకు అద్దం పడుతోంది. నీటి లభ్యతపై పూర్తి స్పష్టత లేకపోయినా, ఉన్న కొద్దిపాటి నీటి వనరులనే నమ్ముకుని ధైర్యంగా ముందడుగు వేస్తున్నారు. సాగునీరు అందించే విషయాన్ని పక్కన పెడితే, కనీసం కష్టపడి పండించి చేతికి వచ్చిన పంటనైనా ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలని ధూళికట్ట రైతులు కోరుతున్నారు.

నకిలీ విత్తనాలతో నష్టపోయాను

- **దుకాణాదారుపై చర్యలు తీసుకోవాలి**
- **బాధిత రైతు వేడుకోలు**

కోనరావుపేట(జనంసాక్షి): నిమ్మపల్లి గ్రామానికి చెందిన మ్యాదరి మధుకర్ అనే రైతు తనకున్న భూమి సుమారు రెండు ఎకరాలలో కొనరావుపేట మండల కేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్ నుంచి రెండు వడ్ల బస్తాలు తీసుకువచ్చి పంట వేయగా రైతుకు నిరాశ మిగిలింది తనకు చావే శరణ్యమని తనకు వడ్ల బస్తాలు ఇచ్చినటువంటి దుకాణంపై అధికారులు చర్యలు తీసుకొని ప్రభుత్వం తనకు న్యాయం చేసి ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకుంటున్నాడు



ప్రహరీ గోడ కరువు.. కోతులు, కుక్కల స్వైరవిహారం!

గంభీరావుపేట జనంసాక్షి:మండలం కొత్తపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు భద్రత కరువైంది. పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో కోతులు, వీధి కుక్కలు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. దీంతో విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి, చిన్నారులకు భద్రత కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నాణ్యమైన విద్య.. పౌష్టికాహారం

- **ఏకలవ్య మోడల్ స్కూళ్లలో మరింత మెరుగైన వసతులు కల్పించాలి**
- **కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జనంసాక్షి:
ఇందల్వాయి మండల కేంద్రంలో కొనసాగుతున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్వహణను మరింతగా మెరుగుపర్చాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పాఠశాలలోని మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పాఠశాలలో నెలకొని ఉన్న సమస్యలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, వసతి గృహాల నిర్వహణ, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, భోజన సదుపాయాలు తదితర అంశాలపై కలెక్టర్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు ఉన్నా వాటిని కప్పిపుచ్చకుండా వాస్తవ పరిస్థితులను తన దృష్టికి తీసుకురావాలని నిర్వాహకులకు సూచించారు. సమస్యలను ముందుగానే గుర్తించి, వాటికి తక్షణ పరిష్కారం చూపే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలో చేపట్టాల్సిన మౌలిక వసతుల అభివృద్ధి, మరమ్మతు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, శారీరక అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ అన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, పౌష్టికాహారం అందేలా పాఠశాల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భోజన పదార్థాల నాణ్యతను ప్రతిరోజూ పరిశీలించాలని ఆదేశించారు.విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, అనారోగ్య సమస్యలు ఉన్న విద్యార్థులను వెంటనే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందేలా చూడాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాల నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశాన్ని అధికారులు బాధ్యతతో పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఇంచార్జి డీఈఓ సాయాగౌడ్, ప్రాంతీయ సమన్వయకర్త గంగారాం నాయక్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీల నిర్వహణ

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జనంసాక్షి: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతపై విస్తృత స్థాయిలో అవగాహన పెంపొందించేందుకు వీలుగా ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ కాంపిటీషన్స్?2026లో భాగంగా జిల్లా స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలను బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైన వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 120 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి కాన్ఫరెన్స్ హాల్ ను సందర్శించి పోటీల నిర్వహణ తీరును పరిశీలించారు.విద్యార్థుల్లో ఎన్నికల ప్రక్రియ, ప్రజాస్వామ్య వ్యవస్థ, ఓటు హక్కు, ఎన్నికల ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించడంతో పాటు, బాధ్యతాయుతమైన ఓటర్లుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ కాంపిటీషన్స్?2026ను నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. పోటీలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సంబంధిత అధికారులు ఉన్నారు.

హెచ్ఐవీ నియంత్రణలో తెలంగాణ భేష్..

- **జాతీయ స్థాయిలో రెండో స్థానం**
- **జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్య శాఖ సమిష్టి కృషికి జాతీయ గుర్తింపు**
- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి,నవంబర్ 18(జనంసాక్షి) :
హెచ్ఐవీ నియంత్రణలో తెలంగాణ రాష్ట్రం జాతీయ స్థాయిలో విశేష పురోగతి సాధించి దేశంలో రెండో స్థానాన్ని కైవసం చేసుకోవడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మన్ సమారోహ్ కార్యక్రమంలో భాగంగా వెల్లడించిన తాజా జాతీయ స్కోర్‌కార్డులో తెలంగాణ రాష్ట్రం రెండో స్థానాన్ని సాధించిందని పేర్కొన్నారు. డిసెంబర్ 2023లో జాతీయ స్థాయిలో 32వ స్థానంలో ఉన్న తెలంగాణ రాష్ట్రం,గత ఆర్థిక సంవత్సరంలో 13వ స్థానానికి చేరుకుని, ప్రస్తుతం రెండో స్థానాన్ని సాధించడం రాష్ట్రంలో హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాల అమలులో సాధించిన పురోగతికి నిదర్శనమని తెలిపారు.రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లో 20 జిల్లాలు హెచ్ఐవీ నియంత్రణకు సంబంధించి నిర్దేశించిన 95-95-95 లక్ష్యాలను సాధించి సురక్షిత్ హోదాను పొందాయని తెలిపారు.ఈ గుర్తింపు పొందిన జిల్లాల్లో పెద్దపల్లి జిల్లా కూడా ఉండటం సంతోషకరమని పేర్కొన్నారు.హెచ్ఐవీ బాధితులను గుర్తించడం,వారికి అవసరమైన వైద్య సేవలు అందించడం, నిరంతర చికిత్సను కొనసాగించడం, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి అంశాల్లో సమర్థవంతంగా పనిచేయడం ద్వారా ఈ లక్ష్యాలను సాధించడం సాధ్యమైందని తెలిపారు.సురక్షిత్ హోదా సాధించిన 20 జిల్లాల జిల్లా కలెక్టర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సన్మానించనుందని పేర్కొన్నారు. ఈ జిల్లాల్లో పెద్దపల్లి జిల్లా కూడా ఉండటం జిల్లా ప్రజలకు, యంత్రాంగానికి గర్వకారణమని తెలిపారు. ఈ విజయాన్ని సాధించడంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది,క్షేత్రస్థాయి సిబ్బంది, కార్యక్రమ భాగస్వాములు సమన్వయంతో కృషి చేశారని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ, ప్రజలకు మె రుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.అవగాహన, సకాలంలో పరీక్షలు, నిరంతర చికిత్స ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ పవిత్ర,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత భారత్‌కు కృషిచేయాలి

రామడుగు(జనంసాక్షి): మండలంలోని తెలంగాణ మాడల్ స్కూల్ నందు సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులకు బాల్య వివాహ రహిత భారత్ అవగాహన సదస్సులో భాగంగా నశా ముక్తభారత్ అభియాన్ మత్తు పదార్థాలు వాడకం దాని వల్ల జరిగే నష్టాల గురించి బాల్య వివాహాల గురించి అవగాహన సదస్సు నిర్వహిం చడం జరిగింది.ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మిరుపూరు వెంకటేష్ మాట్లాడుతూ 100 రోజుల యాక్షన్ ప్లాన్ బాల్య వివాహ రహిత భారత్ అవగాహన సదస్సులో భాగంగా బాల్య వివాహం అనగా అనగా 18 సంవత్సరాల లోపు అమ్మాయి 21 సంవత్సరాల లోపు అబ్బాయి పెళ్లి చేసుకోవడం నేరం ఒకవేళ ఎవరైనా చేసుకున్నట్లయితే 2 సంవత్సరాలు జైలు శిక్ష మరియు లక్ష రూపాయల జరిమానా విధించబడును దీనికి సహకరించిన వారికి పాల్గొన్న వారికి జరిపించిన వారు శిక్ష అర్హులు కావున బాలికలు 18 సంవత్సరాలు దాటిన తర్వాత బాలురు 21 సంవత్సరాలు దాటిన తర్వాత పెళ్లి చేసుకోవాలి ఎవరైనా మీ గ్రామంలో ఇటువంటి పెళ్లి చేస్తున్నారని తెలిస్తే 1098 కాల్ చేయగలరు మీ వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అని చెప్పారుఆరోగ్యకరమైన పౌష్టికారమైన ఆహారం తీసుకోవాలి బయట దొరికే మత్తు పదార్థాలు అనగా గంజాయి, కొకైన్, వైట్నర్ సేవించవద్దని అవి తాతకా లికంగా పొందవచ్చును కానీ శాశ్వతమైన అనారోగ్యాన్ని కొని తెచ్చుకోవచ్చు కాబట్టి మత్తు పదార్థాలు సేవించకూడదని మీకు ఎటువంటి మానసిక సమస్యలు ఉన్న 14416 టెలి మనస్ టోల్ ఫ్రీ నెంబర్ ఫోన్ చేయగలరని తెలిపారు ప్రిన్సిపాల్ మనోజ్ కు మార్, రమేష్, నాగరాజు ఉపాధ్యాయుఉ శ్రీనివాసరెడ్డి కానిస్టేబుల్ శ్రీ హర్ష ఫార్మసీ ఆఫీసర్ ఆయుష్ డిపార్ట్మెంట్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పేట్రేగిన ఇసుకాసురులు

అక్రమ ఇసుక రవాణా అడ్డుకున్న పోలీసులపై వాహనంతో దాడి.. కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు



గంభీరావుపేట, నవంబర్ 18 (జనంసాక్షి):
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట హైస్కూల్ సమీపంలో అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునే క్రమంలో పోలీసులపై పికప్ వాహనంతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కానిస్టేబుల్ ఆకుల రమేష్ తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం తెల్లవారుజామున 12:35 గంటలకు బ్లూకోట్ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ రమేష్, హోంగార్డు మహిపాల్ పికప్ వాహనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో డ్రైవర్ పోలీసులపైకి వాహనాన్ని దూసుకెళ్లడంతో రమేష్‌కు కుడి చేయి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఆయనను తొలుత అశ్విని ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనలో డ్రైవర్ సూర లక్ష్మణ్, వాహన యజమాని వేముల విజయ్, ఆలకుంట మధుల ప్రమేయం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గంభీరావుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై బాలరాజు తెలిపారు.

ఏసీబీ వలలో చిక్కిన పబ్లిక్ ప్రాసిక్యూటర్


రూ.1.50 లక్షలు స్వీకరిస్తుండగా పట్టుకున్న కరీంనగర్ ఏసీబీ అధికారులు



పెద్దపల్లి,నవంబర్ 18(జనంసాక్షి) ం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం (ఏసీబీ) అధికారులు చేపట్టిన దాడులు కలకలం రేపాయి.ఓ కేసులో నిందితుడికి అనుకూలంగా వ్యవహరించి లబ్ధి చేకూరుస్తానంటూ లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) డొంకెన రవీందర్ రూ.1.50 లక్షలు స్వీకరిస్తుండగా ఏసీబీ డి.ఎస్.పి మహేందర్ రెడ్డి నేతృత్వం లో అధికారులు పట్టుకున్నారు.వివరాల్లోకి వెళ్తే ధర్మారం మండలం రచ్చపల్లి గ్రామంలో భూవివాదం నేపథ్యంలో 2023లో ఒక వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసు పెద్దపల్లి కోర్టులో విచారణ జరుగుతుంది.ఈ నేపథ్యంలో కేసులోని ఓ నిందితుడికి అనుకూలంగా వ్యవహరించి లబ్ధి చేకూరుస్తానని(పీపీ) రవీందర్ రూ.2 లక్షలు డిమాండ్ చేయగా చివరికి రూ.1.50 లక్షలు తీసుకునేందుకు అంగీకరించగా పీపీ లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు కరీంనగర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో రంగంలోకి దిగిన కరీంనగర్ రేంజ్ ఏసీబీ డీఎస్ పి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దపల్లి పట్టణంలోని కూనారం రోడ్డులో ఉన్న రవీందర్ నివాసంపై దాడి చేసి అక్కడ లంచం సొమ్ము స్వీకరిస్తున్న సమయంలో ఆయనను అదుపులోకి తీసుకొని ఏసీబీ అధికారులు ఫినాఫ్తలీన్ పరీక్ష నిర్వహించి,పలువురి వాంగ్మూలాలను సేకరించారు. తదుపరి చట్టపరమైన చర్యల్లో భాగంగా రవీందర్‌ను కరీంనగర్‌లోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచేందుకు తరలించారు. న్యాయస్థానంలో కేసు విచారణ జరుగుతున్న సమయంలోనే పబ్లిక్ ప్రాసిక్యూటర్ లంచం ఆరోపణలతో ఏసీబీకి పట్టుబడటం జిల్లా కేంద్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

వరి ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలి

బిజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్



రామడుగు(జనంసాక్షి): బీజేపీ రామడుగు మండల శాఖ అధ్యక్షులు మోడీ రవీందర్ గారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో బారి నిరసన కార్యక్రమం నిర్వహించి,తహశీల్దార్ గారికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ గారు మాట్లాడుతూ రైతులు వరి ధాన్యం ఐకెపి సెంటర్లలో,ఫ్యాక్స్ లో, కల్లాల దగ్గర పోసి నెల రోజులు గడుస్తున్న ధాన్యాన్ని కొనుగులు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయక దళారుల చేతుల్లో రైతులు మోసపోతున్నారని ఆవేదన చెందుతున్నారని అన్నారు.దళారులు,అధికారులు,ఎమ్మెల్యే అందరూ కలసి రైతులను తక్కువ ధరకు మద్దతు ధర రాకుండా రైతులను ఆర్థికంగా నష్టపోయేలా చేస్తున్నారని ఆరోపించారు.సన్నలకు 500 బోనస్ లు ఇవ్వాలని వడ్లు కొనుగోలులను ప్రారంభించడం లేదని,ప్రభుత్వానికి రైతులకు బోనస్ ఇవ్వలేకనే తూకం మొదలుపెట్టడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ధాన్యాన్ని ప్రభుత్వంమే కొనుగోలు చేయాలని లేని పక్షంలో రైతులతో కల్సి కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పు శ్రీనివాస్, బండ తిరుపతి రెడ్డి,మహిళ మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు మామిడిపెల్లి చైతన్య,మండల ప్రధాన కార్యదర్శి పోచంపెల్లి నరేష్,బారి ఎత్తున కార్యకర్తలు తరలివచ్చారు.

పకడ్బందీ ఇందిరమ్మ బీమా

- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి,నవంబర్ 18(జనంసాక్షి) : ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం పెద్దపల్లి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా నిర్వహించనున్న ప్రత్యేక క్యాంపుల నిర్వహణ పై ఎంపీడీవోలు, ఎంపీఓలు, మున్సిపల్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం (ఐ కే జె బి పి) ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కుటుంబంలో సంపాదించే సభ్యునికి జీవిత బీమా రక్షణ కల్పించడం ద్వారా ఆ కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నదని పేర్కొన్నారు.నవంబర్ 19 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న ఈ పథకాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పథకం మార్గదర్శకాలు, అర్హతలు, నమోదు విధానం, అవసరమైన పత్రాలు, క్యాంపుల నిర్వహణపై సిబ్బంది పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.నవంబర్ 19న పథకం ప్రారంభమైన అనంతరం జిల్లాలోని ప్రతి గ్రామంలో, మున్సిపాలిటీల పరిధిలోని ప్రతి వార్డులో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి జనావాసం పరిధిలో క్యాంపు కొనసాగేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి జనావాసానికి క్యాంపు సౌకర్యం అందేలా అవసరమైన సంఖ్యలో బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జనావాసాల వారీగా క్యాంపుల షెడ్యూల్ రూపొందించాలని, క్యాంపుల నిర్వహణ తేదీలు, ప్రదేశాల వివరాలను ముందుగానే ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. డప్పు చాటింపు ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలను క్యాంపులకు వచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా డేటా అందుబాటులో లేదనే కారణంతో ఏ ఒక్క అర్హుడినీ క్యాంపు నుంచి వెనక్కి పంపించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆహార భద్రత కార్డు లేని కుటుంబాలకు కూడా కొత్తగా నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని, ప్రతి దరఖాస్తుదారునికి అవస రమైన సహాయం అందించాలని తెలిపారు శ్రీ మాల,ఈ.డి.యం. కవిత,ఎంపీడీవోలు,ఎంపీఓలు, మున్సిపల్ కమిషనర్ లు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు ఆన్లైన్ వాణిజ్య సేవలు

‘షాన్వీ కార్ట్’ మొబైల్ యాప్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



రామగిరి, నవంబర్ 18 (జనంసాక్షి) : పట్టణ ప్రాంతాలకే పరిమితమైన వేగవంతమైన పంపిణీ సేవలను గ్రామీణ ప్రజలకు కూడా చేరువ చేస్తూ రూపొందించిన ‘షాన్వీ కార్ట్’ మొబైల్ యాప్ ఘన ప్రారంభం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు షాన్వీ కార్ట్ మొబైల్ యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని పట్టణాల్లో నిత్యావసరాలు ఎలాగైతే త్వరితగతిన పంపిణీ అవుతున్నాయో, అదే తరహాలో గ్రామీణ ప్రజలకు కూడా దూరాన్ని బట్టి 10 నుంచి 30 నిమిషాల వ్యవధిలో వస్తువులను అందించే లక్ష్యంతో ‘షాన్వీ కార్ట్’ రావడం సంతోషకరమని అన్నారు. బేగంపేట గ్రామానికి చెందిన తన మిత్రుడు ప్రసాద్ చాలా ఏళ్లుగా పెద్ద విక్రయ కేంద్రం రంగంలో ఉంటూ, ఇప్పుడు సాంకేతికత సాయంతో గ్రామీణ ప్రాంతాలకు అత్యుత్తమ నాణ్యత గల వస్తువులను అందించే అంతర్జాల వాణిజ్య ప్రయత్నం చేయడం ఎంతో అభినందనీయమని ప్రశంసించారు. తాజా, వేగవంతమైన, నమ్మకమైన సేవలతో చిరుతిళ్లు, పానీయాలు, పాల ఉత్పత్తులు, శీతల పానీయాలు మరియు ఇతర రోజువారీ అవసరాలను ఈ మొబైల్ యాప్ ద్వారా క్రయాదేశం చేసుకోవచ్చు. ఈ షాన్వీ కార్ట్ మొబైల్ యాప్ ప్రస్తుతం గూగుల్ ప్లే, యాప్ స్టోర్ లలో అందుబాటులో ఉంది.మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

నగర అభివృద్ధియే ధ్యేయం

- **27వ డివిజన్‌లో పర్యటించిన మేయర్ కొలగాని శ్రీనివాస్**
- **16 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 18 (జనంసాక్షి) :
నగరపాలక సంస్థ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి లో భాగంగా బుధవారం 27 వ డివిజన్ లో మేయర్ పర్యటించారు. శివాజీనగర్ లో స్థానిక కార్పోరేటర్ బొట్ల శ్యామల కిరణ్ కుమార్ తో కలిసి నగరపాలక సంస్థ కు చెందిన రూ. 10 లక్షల నిధులతో ఎస్ డబ్ల్యూజీ డ్రైనేజీ, ప్యాచ్ వర్క్ నిర్మాణం కు భూమి పూజ చేశారు. అనంతర ఆదర్శనగర్ వాటర్ ట్యాంకు వద్ద 6 లక్షల నిధులతో డ్రైనేజీ నిర్మాణం పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సంధర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... కరీంనగర్ లో అభివృద్ధి పనులను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. 27వ డివిజన్ లో ఇటీవలే ప్రజల త్రాగు నీటి అవసరాల కోసం 6 లక్షల నిధులతో పైపులైన్ పనులు చేపట్టి పూర్తి చేశామని తెలిపారు. రూ. 50 లక్షల సాధరణ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పనులను పూర్తి చే

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
19 నవంబర్ 2026

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి పకడ్బందీ ఏర్పాట్లు

18 నుంచి 59 ఏళ్ల వారు అర్హులు : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల బ్యూరో, నవంబర్ 18(జనంసాక్షి); రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల పంచాయతీ అధికారులు, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు, పంచాయతీ సెక్రటరీలు ఇతర అధికారులకు సిబ్బందికి జిల్లా సమీకృత కార్యాలయం ఆడిటోరియంలో బుధవారం ప్రొజెక్టర్ ద్వారా శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 18 నుంచి 59 ఏళ్ల వయసున్న వారికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నదని వెల్లడించారు. జిల్లాలోని ఆయా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో విడతల వారీగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అర్జీదారుల నుంచి రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ వివరాలు తీసుకుంటారని స్పష్టం చేశారు. బీమా చేయించేవారు నామిని వారి వివరాలు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఒకరు లేదా అంతకంటే ఎక్కువ నామినీలు కూడా ఉండవచ్చని వెల్లడించారు. దరఖాస్తు ఫారంలో సంతకం చేయాలని సూచించారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో అధికారులు, సిబ్బంది ప్రత్యేక శిబిరాల వద్ద టెంట్లు, కుర్చీలు, బీమా వివరాల ప్లెక్సీలు, తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివరాల నమోదు కోసం కంప్యూటర్లు, ఇతర యంత్రాలు, సిబ్బంది హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. మొత్తం ప్రక్రియలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శిబిరాలను ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి వీర భద్రయ్య, జిల్లా ప్రణాళిక అధికారి సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, ఈడీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రుణం పేరుతో రూ.12.21 లక్షలకు టోకరా!

- **నకిలీ లోన్ మంజూరు పత్రాలతో మోసం**
- **రూ.1.50 కోట్ల రుణం ఇప్పిస్తానని నమ్మబలికి వసూళ్లు**
- **రెండు విడతల్లో బాధితురాలి నుంచి నగదు బదిలీ**
- **నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు**



కరీంనగర్, క్రైమ్, నవంబర్ 18 (జనంసాక్షి): ఆన్‌లైన్‌లో రుణం ఇప్పిస్తానని నమ్మించి రూ.12.21 లక్షలు వసూలు చేసి, నకిలీ రుణ మంజూరు పత్రాలతో మోసానికి పాల్పడిన వ్యక్తిని కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. కరీంనగర్ రూరల్ సీఐ ఏ.నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన వొడ్నాల జగన్ కుమార్తె వైష్ణవి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. ఆమెకు పరిచయమైన కరీంనగర్‌కు చెందిన వేల్పుల సాయికృష్ణ.. ఆరెపల్లిలోని సర్వే నంబర్ 232/ఆలో ఉన్న 383.02 గజాల ఇంటి స్థలంపై టాటా క్యాపిటల్ ఫైనాన్స్ సంస్థ నుంచి రూ.1.50 కోట్ల రుణం మంజూరు చేయిస్తానని నమ్మించాడు. ఇన్సూరెన్స్ పేరుతో మొదట రూ.8.99 లక్షలు, లోన్, డాక్యుమెంట్ల ప్రాసెసింగ్ ఫీజు కింద మరో రూ.3.22 లక్షలు వైష్ణవి ద్వారా తన బ్యాంకు ఖాతాలో జమ చేయించుకున్నాడు. అనంతరం రుణం మంజూరైనట్లు నకిలీ పత్రాలు సృష్టించి జగన్‌కు అందజేశాడు. వాటిని పరిశీలించిన ఫైనాన్స్ సంస్థ అధికారులు తమ సంస్థ నుంచి జారీ చేయలేదని స్పష్టం చేయడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు శ్రీరాంపూర్‌కు చెందిన, ప్రస్తుతం కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో నివసిస్తున్న సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి నకిలీ రుణ పత్రాలు, బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని, మరిన్ని వివరాల కోసం పోలీసు కస్టడీ కోరుతూ పిటిషన్ దాఖలు చేసినట్లు సీఐ తెలిపారు. రుణాల కోసం ఆన్‌లైన్ ప్రకటనలు, మధ్యవర్తుల మాటలు నమ్మి ముందస్తుగా డబ్బులు చెల్లించవద్దని, నేరుగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలను సంప్రదించాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

- **నూతన పింఛన్ల మంజూరు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ**
- **లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే సత్యం, కలెక్టర్**
- **అర్హత ఉండి పింఛన్ రానివారికి ప్రత్యేక కౌంటర్లు**
- **అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు**



మల్యాల, నవంబర్ 18 (జనంసాక్షి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం మల్యాల క్రాస్‌రోడ్‌లోని శ్లోక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే సత్యం, జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో కొత్త పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పింఛన్లు వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులకు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అర్హులందరికీ పథకాలు అందించాలని సూచించారు. కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించి పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హత ఉండి పింఛన్లు పొందని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులకు పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, డీఆర్డీఓ రఘువరన్, ఎంపీడీఓ స్వాతి, తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



షార్ట్ సర్క్యూట్‌తో ఫర్నిచర్ దుకాణం దగ్ధం

శంకర్‌పల్లి, నవంబర్ 18 (జనంసాక్షి): దొంతాన్‌పల్లి గేట్ వద్ద ఉన్న ఏ వన్ ఫర్నిచర్ దుకాణం బుధవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఫర్నిచర్, ఇతర సామగ్రి కాలిపోయి సుమారు రూ.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న చేవెళ్ల అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. దుకాణ యజమాని అబ్దుల్ మాలిక్‌కు భారీ నష్టం వాటిల్లింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

- **నాలుగు మండలాల్లో నూతన పింఛన్ల పంపిణీ**
- **పేదలు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం**
- **ఆరు గ్యారంటీల హామీలను అమలు చేస్తున్నాం**
- **లబ్ధిదారులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

కామారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 18 (జనంసాక్షి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. బుధవారం కామారెడ్డి నియోజకవర్గంలోని మాచారెడ్డి, పాల్వంచ, దోమకొండ, బీబీపేట మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని నూతన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఆరు గ్యారంటీల ద్వారా ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంతో నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని, రైతు భరోసా, రుణమాఫీతో రైతులకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన, యువతకు ఉపాధి, విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హులైన వారందరికీ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌర సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) : ఘట్‌కేసర్ సర్కిల్‌లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. డ్రైనేజీ, పారిశుద్ధ్యం, రహదారి భద్రత సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. లింగాలకుంటలో డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఘట్‌కేసర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులకు అడ్డంకిగా ఉన్న టిడిఆర్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సన్‌షైన్ పార్క్ సమీపంలోని చెత్త పేరుకుపోయే ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, బోగారం, కరీంగూడలో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. రాంపల్లి చౌరస్తాలో లేన్ మార్కింగ్, ఇస్మాయిల్ ఖాన్‌గూడలో బెల్‌మౌత్ పనులను పరిశీలించారు. రహదారులపై ప్రమాదకరంగా వేలాడుతున్న నిరుపయోగ కేబుళ్లను తొలగించాలని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం, సురక్షిత రహదారులు కల్పించడమే లక్ష్యమని కమిషనర్ పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు.ఈ కార్యక్రమం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి బాలిక మృతి

నవంబర్ 18 పరిగి జనం సాక్షి : పరిగి లోని ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెందిన పదహారేళ్ల యువతి గత రెండు రోజుల క్రితం కడుపునొప్పి భరించలేక పరిగి ప్రాంతంలోని చత్రాజ్ హాస్పిటల్ జాయిన్ కావడం జరిగింది. రెండు రోజుల నుంచి పరీక్షలు చేసి ఇలాంటి అభివృద్ధి లేక అత్యవసర సమయంలో బాలికను నగరాల్లోని మంచి ఆసుపత్రికి తీసుకెళ్లాలని డాక్టర్ వివరించారు డాక్టర్ యొక్క సలహా మేరకు బాలికను నగరానికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యలో మృతి చెందింది ఈ విషయంపై బంధువులు కాలనీవాసులు చెత్రాశి ఆసుపత్రి దగ్గర దిగారు

బూడిద లారీల పేరిట కలెక్టర్ దోపిడీ

- **రూ.6 కోట్ల అక్రమ వసూళ్లపై సీబీఐ, ఈడీలకు ఫిర్యాదు చేస్తాం**
- **ప్రశ్నించే లారీ యజమానులపై అక్రమ కేసులు, జరిమానాలు సరికాదు**
- **జిల్లాలో ప్రజాస్వామ్యం, చట్టం లేకుండా పోయాయి**
- **రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ధ్వజం**



గోదావరిఖని, జనంసాక్షి : ఎన్టీపీసీ ఉచితంగా ఇచ్చే బూడిదను తరలించే లారీల నుంచి ఎలాంటి జీవో, సర్యులర్ లేకుండానే జిల్లా కలెక్టర్ రూ.500 చొప్పున అక్రమంగా వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మూడేళ్లలో అధికారికంగానే 1.24 లక్షల ట్రిప్పుల ద్వారా సుమారు రూ.6 కోట్ల వరకు వసూలు చేశారని, దీనికి ఎలాంటి రసీదులు కూడా ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 265 ప్రకారం ప్రభుత్వం ఏ పన్ను లేదా రుసుము వసూలు చేసినా దానికి చట్టబద్ధమైన జీవో ఉండాలని, కానీ ఎవరి ఆదేశాల మేరకు కలెక్టర్ ఈ డబ్బులు వసూలు చేసి ఎవరి ఖజానాలోకి మళ్లించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదే తరహాలో మట్టి తరలింపునకు క్యూబిక్ మీటర్‌కు రూ.40–50 వసూలు చేయాల్సి ఉండగా, ఏకంగా రూ.3,500 వసూలు చేస్తూ పేద లారీ యజమానుల కడుపు కొడుతున్నారని మండిపడ్డారు. అధికార, అనధికారిక వసూళ్లు, పోలీసుల అక్రమ ఫైన్లు, నెలల తరబడి లారీలను సీజ్ చేయడంతో యజమానులు డీజిల్, డ్రైవర్ల జీతాలు, ఈఎంఐలు కట్టలేక రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ ఒక బందిపోటు లాగా వ్యవహరిస్తూ లారీ యజమానులను దోచుకుంటున్నారని, జిల్లాలో అసలు చట్టం, ప్రజాస్వామ్యం అనేవే లేకుండా పోయాయని విమర్శించారు. వసూలు చేసిన రూ.6 కోట్ల రూపాయలను తక్షణమే లారీ నంబర్ల ఆధారంగా ఆయా యజమానులకు తిరిగి చెల్లించాలని, లేనిపక్షంలో ఈ అక్రమ వసూళ్లపై డీపీటీఓ, సీబీఐ, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, ఈడీలకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా లారీలతో కలెక్టరేట్ ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో శ్రీరామ లారీ యాష్ టిప్పర్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె అశోక్, ముత్యం అనిల్ గౌడ్, రాము గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఉప్పు రాజ్ కుమార్, నారాయణదాసు మారుతి పాల్గొన్నారు.

జన సురక్ష బీమా పథకాలపై అవగాహన



సిరిసిల్ల టౌన్ నవంబర్ 18(జనం సాక్షి) : సిరిసిల్ల పట్టణంలోని 34వ వార్డులో బుధవారం బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జన సురక్ష బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాల ద్వారా తక్కువ ప్రీమియంతో ప్రమాద, జీవిత బీమా సౌకర్యాలు పొందవచ్చని వివరించారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎం ఎస్బి వై) ద్వారా 18 నుంచి 70 ఏళ్ల వయస్సు గల వారికి ఏడాదికి కేవలం రూ.20 ప్రీమియంతో రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపా రు. అలాగే ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎం జె జె బి వై) ద్వారా 18 నుంచి 50 ఏళ్ల వయస్సు గల వారికి ఏడాదికి రూ.43 6 ప్రీమియంతో రూ.2 లక్షల జీవిత బీమా అందిస్తున్నట్లు వివరించారు. నిబంధనల ప్రకా రం 50 ఏళ్ల వరకు బీమా కొనసాగించుకునే అవకాశం ఉందన్నారు.ప్రజలు ఈ పథకాలపై అవగాహన పెంచుకొని, అర్హులైన ప్రతి ఒక్కరూ బీమా పథకాల్లో చేరి తమ కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్, బ్యాంకు సిబ్బంది, వైస్ చైర్మన్ దార్ల సందీప్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుతోపాటు సీఎం సభను విజయవంతం చేయాలి

- **అర్హులందరికీ పింఛన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం**
- **నాలుగు మండలాల్లో నూతన పింఛన్ల పంపిణీ**
- **సిద్దిపేట సభకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలి**
- **గ్రామస్థాయి నుంచి జనసమీకరణ చేపట్టాలి**



కామారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 18 (జనంసాక్షి): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. బుధవారం కామారెడ్డి నియోజకవర్గంలోని మాచారెడ్డి, పాల్వంచ, దోమకొండ, బీబీపేట మండలాల్లో పర్యటించి నూతన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ఆరు గ్యారంటీల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అర్హులందరికీ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మరోవైపు సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు షబ్బీర్ అలీ పిలుపునిచ్చారు. బుధవారం కామారెడ్డిలో దేవరకద్ర ఎమ్మెల్యే, సభ అబ్జర్వర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం, మండలం, కామారెడ్డి పట్టణం నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో సభకు తరలివచ్చేలా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి జనసమీకరణ చేపట్టి సభ ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం సభ ప్రచార పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి, జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, పీఏసీఎస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్క్‌ఫ్రమ్ పార్క్' అభివృద్ధి పనులను పరిశీలించిన శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్



శేరిలింగంపల్లి, నవంబర్ 18 (జనంసాక్షి) : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజన ఆదేశాల మేరకు మసీద్ బండలోని మాధవ హిల్స్ పార్క్‌ను 'వర్క్ ఫ్రమ్ పార్క్' కాన్సెప్ట్‌గా తీర్చిదిద్దేందుకు జరుగుతున్న పనులను మరియు ప్రతిపాదిత అభివృద్ధి కార్యక్రమాలను శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ బుధవారం పరిశీలించారు. ఐటీ నిపుణులు, ఫ్రీలాన్సర్లు, విద్యార్థులు మరియు స్టార్టప్ బృందాలు ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా పనిచేసుకునేందుకు వీలుగా ఆధునిక, అందుబాటులో ఉండే మరియు పర్యావరణ అనుకూలమైన పని ప్రదేశాలను అవసరమైన సదుపాయాలతో ఏర్పాటు చేయడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యంగా అధికారులు వివరిస్తున్నారు. ఈ క్రమంలో జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ వర్క్ ఫ్రం పార్క్ లో మౌలిక సదుపాయాలు, కొనసాగుతున్న పనులను సమీక్షించారు. నాణ్యతా ప్రమాణాలు మరియు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తూ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు.

పట్టా పాస్ పుస్తకం పోయినవి

సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా పేరు **పాషికంటి రమేష్ తండ్రి పేరు భిక్షపతి** గ్రామం రాజేశ్వరపల్లి నా యొక్క పట్టాపాస్ పుస్తకం నెంబరు T22080 020378 గల పాస్‌పుస్తకం రాజేశ్వరిపల్లి నుండి 03/11/2026 మంగళవారం రోజున నర్సంపేటకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా పట్టా పాస్ పుస్తకం ఎక్కడో పడిపోయింది. దొరికిన వారు ఈ క్రింది నెంబర్ 9959284472ను సంప్రదించగలరు. 9959284472

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినవి

నేను అనగా **శ్రీపతి రాజేందర్ S/O నర్సయ్య**, H.NO: 5-58 బావుసింగ్‌పల్లి, గ్రా: పెద్దాపూర్, మం: భూపాలపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నా యొక్క ఇంటి స్థలం ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్.1553/ ఆఫ్ 2023 నెంబర్ గల ఇంటి స్థలం డాక్యుమెంట్ భూపాలపల్లి నుండి బావుసింగ్ పల్లి ఇంటికి మోటర్ సైకిల్ మీద ఇంటికి వెళ్తుండగా జారిపోయినవి. దొరికిన వాళ్ళు ఈ క్రింది నెంబర్ 9949185594ను సంప్రదించగలరు.

ఇందుర్తికి సొసైటీ మంజూరుపై మిన్నంటిన రైతుల సంబరాలు

- **సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి పొన్నం ప్రభాకర్, తుమ్మల చిత్రపటాలకు క్షీరాభిషేకం**
- **బ్యాండ్ బాజాలు,బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిన కాంగ్రెస్ నాయకులు**



చిగురుమామిడి నవంబర్ 18(జనంసాక్షి): తెలంగాణ ప్రజా ప్రభుత్వం,ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావుల ప్రత్యేక చొరవతో చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి గ్రామానికి నూతనంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మంజూరైంది.దశాబ్దాల కల నెరవేరడంతో ఇందుర్తి గ్రామ రైతులు, ప్రజలు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ ఘనంగా సంబరాలు జరుపుకున్నారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అందే సురేష్ ఆధ్వర్యంలో గ్రామంలో పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్,తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం (క్షీరాభిషేకం) నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం బ్యాండ్ బాజాల నడుమ బాణాసంచా కాల్చి, గ్రామస్తులకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇందుర్తికి పాక్స్ మంజూరు కావడం వల్ల చుట్టుపక్కల గ్రామాల రైతులకు ఎరువులు, విత్తనాలు, పంట రుణాలు సకాలంలో అందుతాయని, మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి మరువలేనిదని కొనియాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కు రుణపడి ఉంటామని రైతులు నాయకులు తెలిపారు.ఈ సంబరాల్లో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి,సర్పంచ్ చింతపూల నరేందర్ పటేల్,సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు మార్క రాజ్ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి,గుళ్ళ రాజు,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎండి.కుత్బుద్దీన్, పాక్స్ డైరెక్టర్లు చిట్యాల బాల్ రెడ్డి,చింతపూల సాయన్న, మాజీఎంపీటీసీ చీల లక్ష్మారెడ్డి,తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కునచ్చుల మహేందర్, ఉపసర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ జిల్లెల్ల రమేష్,పచ్చిమట్ల జగన్,కతా తిరుపతి,గ్రామ శాఖ అధ్యక్షులు వంటకాల సంపత్ రెడ్డి,కూన బాలయ్య,అందె పరశురాములు, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు రణప్రతాప్ సింగ్, బోయిని ప్రశాంత్,గొట్టే రఘు బాబు, బొడ్డు ప్రశాంత్,ఇందుర్తి వార్డు సభ్యులు షేక్ ఉమ్మర్, అందే బావికాడి బాబు,కూన మల్లయ్య,డాక్టర్ రాజేందర్, బుర్ర లక్ష్మణ్, కుట్ల శీను, పులి మణికంఠ,పెద్ద సంఖ్యలో రైతులు, గ్రామస్తులు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

AVENTO AGRO CHEMICALS

Sy.no 439/a1/2, 439/a1/1, Velimineedu (V), Chityala (M) Nalgonda Dist, Telangana, 508114

100% Water Soluble Mixture Fertilizers with Specifications Prescribed Under Fertilizer Control Order,1985

**It is brought to public notice that M/s AVENTO AGRO CHEMICALS has decided to manufacture and market 100% water soluble mix

మత్తు పదార్థాలకు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలి



నంగునూరు, నవంబరు 18 (జనం సాక్షి) : విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని న్యాయవాదులు ఎ. రాజేశ్, ఎం. రమేశ్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర, సిద్ధిపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో బుధవారం నంగునూరు మండలం మగ్దుంపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం అంధకారమవుతుందని, బాలల హక్కులు మరియు చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, అనుమానాస్పద లింకులు తెరవకూడదని, వ్యక్తిగత వివరాలు ఇతరులతో పంచుకోకూడదని హెచ్చరించారు. ఇంఛార్జి ప్రధానోపాధ్యాయుడు జీడిపల్లి సురేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కోర్టు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్.బి.నగర్‌ను తులసివనంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- లక్ష తులసి, ఔషధ మొక్కల కుండీల పంపిణీకి శ్రీకారం
- కార్తీక క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా జాగృతి
- అభ్యుదయ సంఘం బృహత్తర కార్యక్రమం



హయత్‌నగర్, నవంబర్ 18 (జనం సాక్షి) : ఎల్.బి.నగర్ నియోజకవర్గాన్ని లక్ష తులసి మొక్కలతో తులసివనంగా తీర్చిదిద్దాలనే మహత్తర సంకల్పంతో జాగృతి అభ్యుదయ సంఘం చేపట్టిన లక్ష తులసి, ఔషధ మొక్కల కుండీల పంపిణీ కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. కార్తీక క్షీరాబ్ధి ద్వాదశిని పురస్కరించుకుని సాహెబ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల, వనస్థలిపురం మొదటి ముద్ద, పద్మావతి కాలనీలోని వెంకటేశ్వర స్వామి దేవాలయం వేదికలుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చౌడూరి నరసింహారావు, బి.ఎన్.రెడ్డి డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై మొక్కల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎల్.బి.నగర్ నియోజకవర్గాన్ని పచ్చదనంతో నిండిన తులసివనంగా చూడాలనే లక్ష్యంతో లక్ష తులసి, ఔషధ మొక్కల కుండీల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రకృతిలో సహజంగా లభించే ఔషధ మొక్కలు పర్యావరణ పరిరక్షణకు, ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడతాయని పేర్కొన్నారు. మొక్కలను పూజించే మన సంస్కృతిలో గొప్ప శాస్త్రీయత దాగి ఉందని అన్నారు. కార్తీక మాసంలో ఉసిరి చెట్టు ప్రాముఖ్యతను వివరిస్తూ, ఉసిరిని ఆహారంలో భాగంగా తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని వక్తలు పేర్కొన్నారు. ప్రకృతితో మమేకమై జీవించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం రాజకీయ వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియలో చోటుచేసుకుంటున్న అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట పడాలని, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పారదర్శక ఎన్నికలు జరిగి ప్రజాస్వామ్యం పరిరక్షించబడాలని భావన శ్రీనివాస్ ఆకాంక్షించారు. విలువైన ఓటును అమ్ముకునే ఓటర్లు, కొనుగోలు చేసే నాయకుల ఆలోచనా విధానంలో మార్పు రావాలనే ఉద్దేశంతో తాము 'రైట్ ఓట్ ఛాలెంజ్' ఉద్యమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. తులసి మొక్కల పంపిణీని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా సమాజ ప్రక్షాళనకు చేపట్టిన మహా యజ్ఞంగా భావిస్తున్నామని వివరించారు. ఇప్పటివరకు సుమారు 5 వేల ఔషధ మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. దాతల సహకారంతో ఖర్చుతో కూడుకున్నప్పటికీ తిరిగి వినియోగించుకునే కుండీల్లోనే మొక్కలను అందిస్తున్నామని చెప్పారు. పలు రకాల ఔషధ మొక్కల పెంపకంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాహెబ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.వి. దినేష్, డాక్టర్ విజయ్, గోరక్షక్ ప్రముఖ్ యాదగిరిరావు, వి ఆర్ కె మూర్తి, లయన్స్ క్లబ్, ఆర్యవైశ్య సంఘం, వివిధ కాలనీ సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రవీందర్ రెడ్డి, సునీల్ గుప్తా, రేణికుంట కళ్యాణ్, నాగేంద్ర, కొలిశెట్టి సంజయ్ కుమార్, క్రిష్ణవేణి, వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ చంద్రశేఖర్, దాతలు యాదా రామలింగేశ్వరరావు, బండి లక్ష్మణరావు, రేచింతల పావని, చేబ్రోలు శ్రీనివాసులు, జాగృతి ప్రతినిధులు శ్రీరంగనాథ్, శరత్ కుమార్, ఆనబత్తుల సత్యనారాయణ, పద్మజ యద్దనపూడి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి

శామీర్‌పేట్, నవంబర్ 18 (జనం సాక్షి) : రాష్ట్రంలో ప్రతి నిరుపేద సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా విధానాలు సాగుతున్నాయని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. బుధ వారం అలియాబాద్ మున్సిపాలిటీలో 50లక్షలతో నిర్మించిన నూతన లైబ్రరీ భవనంను ముఖ్య అతిథిగా విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, అతిథులుగా జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ లు విచ్చేసి ప్రారంభించారు. అనంతరం అలియాబాద్ మున్సి పాలిటీలోని ఏకె రాయల్ ఫంక్షన్ హలులో మున్సిపల్ చైర్ పర్సన్ శీరిష కృష్ణారెడ్డి అధ్యక్షతన అలియా బాద్, మూడు చింతల పల్లి మున్సి పాలిటీ లోని నూతన ఫించన్ దారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా విప్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. దివ్యాంగులు, ఒంటరి మహిళ, వితంతు, గీత కార్మికులు, నేతకార్మికులకు అందించే ఆర్థిక చేయూతను ప్రతి నెల పింఛను రూపంలో ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇవే కాకుండా నిరు పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ళను పంపిణీ చేస్తుందన్నారు. ఉచిత బస్సులతో మహిళలందరికీ గౌరవంగా రాష్ట్రమంతా తిరిగేలా అవకాశం కల్పించిందని మహేందర్ రెడ్డి అన్నారు. కొత్త రేషన్ కార్డులు, 500 రూపాయలకే వంట గ్యాస్



అందించడం లాంటి సంక్షేమ పథకాలు ప్రతి నిరు పేదకు చేరిందని ఆయన వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవాడికి చేరేటట్లు కృషి చెయ్యాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మూడు చింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, జాయింట్ కలెక్టర్, గ్రంధాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,ఏఎంసి చైర్మన్ నర్సింలు యాదవ్, వేణు గోపాల్ రెడ్డి, అలియా బాద్, ఎంసి పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్, వెంకటేష్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చౌదర్‌పల్లిలో కోళ్ల ఫారాల కాలుష్యంపై ఆగ్రహం

- తక్షణమే చర్యలు తీసుకోవాలి
- బిజెపి మండల నాయకుడు నడికుడి కృష్ణ, గ్రామ రైతుల డిమాండ్

యాచారం, నవంబర్ 18 (జనం సాక్షి) : యాచారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో ఉన్న కోళ్ల ఫారాల నుంచి వెలువడుతున్న తీవ్రమైన దుర్వాసన, ఈగలు, దోమల బెడద నుంచి గ్రామ ప్రజలను, రైతులను తక్షణమే రక్షించాలని బిజెపి మండల నాయకుడు నడికుడి కృష్ణతో పాటు గ్రామ రైతులు గొరిగే మల్లేష్, గొరిగే శ్రీశైలం, కావలి యాదయ్య, కావలి నర్సింహా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పరిసరాల్లో ఉన్న కోళ్ల ఫారాల వల్ల సాయంత్రం కాగానే ఊరిలో ఉండలేని విధంగా విపరీతమైన దుర్వాసన వస్తోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈగలు, దోమల ఉధృతి విపరీతంగా పెరిగిపోవడంతో పొలాల్లో సాగు చేసిన కూరగాయల పంటలు పూర్తిగా నాశనమవుతున్నాయని, కనీసం పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోయారు.అంతేకాకుండా, కోళ్ల ఫారాల వల్ల ఏర్పడుతున్న ఈ అపరిశుభ్ర వాతావరణం కారణంగా గ్రామంలోని పాడి రైతుల పాలిచ్చే ఆవులు, గేదెలు తరచూ రోగాల బారిన పడుతున్నాయని తెలిపారు. ఈ సమస్యపై కోళ్ల ఫారాల నిర్వాహకులకు ఎన్నిసార్లు విన్నవించినా వారు కనీసం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా



వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.సంబంధిత ఉన్నతాధికారులు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తక్షణమే స్పందించి చౌదర్‌పల్లి గ్రామంలో పర్యటించాలని వారు కోరారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కోళ్ల ఫారాలపై కఠిన చర్యలు తీసుకుని గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని, పాడి మరియు కూరగాయల రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆలయ భూమిలో చెత్త తొలగింపు

- 'జనంసాక్షి' ఎఫెక్ట్..
- ఆలయ స్థలాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు
- దేవాదాయ శాఖ ఈఓ శ్రీనివాస్ శర్మ హెచ్చరిక

కొండుర్గు, నవంబర్ 18 (జనంసాక్షి) : కొండుర్గు మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ భూమిలో చెత్త దంపింగ్‌పై 'జనంసాక్షి' పత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు ఎట్టకేలకు దిగివచ్చారు. 'జనంసాక్షి' కథనంతో స్పందించిన గంగన్నగూడెం గ్రామపంచాయతీ సిబ్బంది ఆలయ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను పూర్తిస్థాయిలో తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఈఓ శ్రీనివాస్ శర్మ ఆలయ భూమిని ప్రత్యేకంగా సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన పంచాయతీ కార్యదర్శితో





మాట్లాడి, ఆలయ భూముల్లో చెత్త వేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కావలి లక్ష్మయ్య, ధర్మకర్తలు చిప్ప అమర్, సెరిగూడెం యాదగిరి తదితరులు పాల్గొన్నారు. సమస్యపై వార్త ప్రచురించి అధికారుల్లో కదలిక తెచ్చిన 'జనంసాక్షి'కి, స్పందించి చెత్తను తొలగించిన అధికారులకు భక్తులు, స్థానిక గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కష్టపడే కార్యకర్తకే ప్రత్యేక గుర్తింపు

- జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా బండారు శ్రీకాంత్‌కు ఘన సన్మానం
- పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం



తాండూరు, నవంబర్ 18 (జనంసాక్షి) : తాండూరు బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షులు నాగారం మల్లేశం ఆధ్వర్యంలో జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా నియామక పత్రం పొందిన బండారు శ్రీకాంత్‌కు పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం మాట్లాడుతూ పార్టీలో కష్టపడే ప్రతి ఒక్క కార్యకర్తకు పదవులు వస్తాయి. శ్రీకాంత్ పార్టీ కోసం చేసిన కృషికి గుర్తింపుగా ఈ పదవి లభించింది. మునుముందు ఇంకా మంచి పదవులు రావాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.అనంతరం బండారు శ్రీకాంత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు. ఎస్సీ మోర్చాను పట్టణం, జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు దోమ కృష్ణ, చిదిరి ప్రకాష్, ప్రహ్లాద్ జాదవ్, పట్టణ కమిటీ సభ్యులు చందు, బిచ్చప్ప, బబ్లు, సతీష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి..

- గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి
- వైద్యులు, సిబ్బందికి డీఎంహెచ్‌వో డా.పుట్ల శ్రీనివాస్ ఆదేశం



హైదరాబాద్, నవంబర్ 18 (జనంసాక్షి) : పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. పాణిపురం క్లస్టర్ పరిధిలోని పురాణాపూల్-1 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, మందుల నిల్వలు, ల్యాబ్, వైద్య సేవలు, రికార్డులు, పరిశుభ్రతను పరిశీలించారు. గర్భిణులకు అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు క్రమం తప్పకుండా చేయాలని, చిన్నారులకు 100 శాతం టీకాలు వేయాలని సూచించారు. వ్యాక్సిన్ల నిల్వ, శీతలీకరణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అర్హులైన బాలికలకు హెచ్‌పీవీ టీకాలు త్వరగా వేయాలని, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అసంక్రమిత వ్యాధుల గుర్తింపు, స్క్రీనింగ్, తదుపరి వైద్య పర్యవేక్షణ ప్రతిరోజూ చేపట్టి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని ఆదేశించారు. మలేరియా, డెంగీ, చికున్‌గునియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ఇంటింటి సర్వేలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డా.మురళీధర్, డా.శకుంతల, ప్రోగ్రాం అధికారులు, ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- మండలంలో 497 కొత్త చేయూత పింఛన్ల మంజూరు
- లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు, నవంబర్ 18 (జనంసాక్షి) : పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. కొందుర్గు మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగా మంజూరైన చేయూత పింఛన్ల లబ్ధిదారులకు ఆయన ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొందుర్గు మండలంలో కొత్తగా 497 మందికి చేయూత పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికుల కుటుంబాల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో దాదాపు 98 శాతం మంది అర్హులకు పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందించి, ఆయా కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'



పథకాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. కుటుంబ పెద్ద అకాల మరణం చెందితే ఆ కుటుంబానికి రూ.5 లక్షల బీమా అందజేస్తామని చెప్పారు. అదనంగా నియోజకవర్గంలోని పేద మహిళలకు 45 వేల నుంచి 50 వేల వరకు చీరలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీరామ్, తహసీల్దార్ అజం అలీ, కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి, కొందుర్గు సర్పంచ్ చౌడపురం ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుపై మళ్లీ ఆగ్రహజ్వాలలు..

- 14 ఏళ్ల బాలిక మృతిపై విచారణ జరపాలి
- విషవాయువుల ప్రభావంతోనే బాలిక మృతి చెందిందన్న పోరాట కమిటీ
- బాధిత కుటుంబానికి తక్షణ పరిహారం అందించాలని డిమాండ్

జవహర్‌నగర్, నవంబర్ 18 (జనంసాక్షి) : జవహర్‌నగర్ డంపింగ్ యార్డు పరిసరాల్లో మరో విషాదం చోటుచేసుకుంది. రాంకీ గేట్ సమీపంలోని శాంతినగర్‌కు చెందిన 14 ఏళ్ల బాలిక ఊపిరితిత్తుల సమస్యతో మృతి చెందడంపై డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న విషవాయువుల ప్రభావమే బాలిక అనారోగ్యానికి కారణమని కమిటీ ప్రతినిధులు ఆరోపించారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బాలిక మృతికి గల కారణాలపై వైద్యపరమైన విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, తగిన ఆర్థిక పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, అవసరమైన వైద్య పరీక్షలు చేపట్టాలని కోరారు. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు,




బంధువులు మీడియా, జేఏసీ ప్రతినిధులతో మాట్లాడేందుకు నిరాకరించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. డంపింగ్ యార్డు సమస్యపై మాట్లాడేందుకు కూడా ప్రజలు భయపడుతున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాంకీ డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అలగిరి చిత్ర సుబ్రహ్మణ్యం, బి.ఎన్.ఆర్.కె.ఎస్. సూర వెంకటయ్య, ప్రజానాట్యమండలి వెంకటాచారి, పి.ఓ.డబ్ల్యూ (విముక్తి) గడిపే సునీత, అవుల దుర్గేష్, మంజుల, సునీల్, నందిని తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
19 నవంబర్ 2026

మునుగోడు నిధులు ఆపితే మరో కురుక్షేత్రమే..

అదృష్టం కొద్దీ సీఎం అయ్యావు.. మరో రెండేళ్లే ఉంటావు

- సీఎం రేవంత్‌కు రాజగోపాల్ రెడ్డి వార్నింగ్
- సొంత ప్రభుత్వంపైనే ఎమ్మెల్యే తిరుగుబాటు స్వరం



మర్రిగూడ, నవంబర్ 18 (జనంసాక్షి): మునుగోడు అభివృద్ధికి నిధులు కేటాయించకపోతే మరో కురుక్షేత్రానికి సిద్ధం కావాల్సిందేనని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. అధికారం ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే సహించేది లేదంటూ 'రేవంత్ రెడ్డి.. ఖబడ్దార్ బిడ్డా.. నువ్వు తొక్కితే తొక్కించుకునేలా కనిపిస్తున్నానా? అదృష్టం కొద్దీ సీఎం అయ్యావు.. మరో రెండేళ్లే ఉంటావు' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సొంత పార్టీ ప్రభుత్వంపైనే ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపాయి. బుధవారం మునుగోడులో నిర్వహించిన నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ అంటే కొడంగల్, మధిర మాత్రమే కాదని, ఆయా నియోజకవర్గాలకు వేల కోట్ల నిధులు ఇచ్చినా అభ్యంతరం లేదని, మునుగోడుకు కూడా సమానంగా అభివృద్ధి నిధులు కేటాయించాలని సీఎం, డిప్యూటీ సీఎంలను డిమాండ్ చేశారు. నిధులు అడిగితే బెదిరింపులకు దిగడం సరికాదన్నారు.


మంత్రి పదవి కోసం కాదు.. ప్రజల కోసమే..

తాను మంత్రి పదవి కోసం మాట్లాడటం లేదని, నియోజకవర్గ ప్రజల ప్రయోజనాల కోసమే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నానని స్పష్టం చేశారు. మూడేళ్ల పాలన తర్వాత ప్రజలు సంతోషంగా లేరని విమర్శించారు. మునుగోడులో రోడ్ల పనులకు నిధులు విడుదల కాక కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులు వదిలి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు పనులను నిర్ణీత ధర కంటే 20 శాతం తక్కువకే చేపట్టి ప్రజాధనాన్ని ఆదా చేస్తానని ప్రకటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకొని ప్రజాధనాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన రూ.4 వేల పింఛన్ హామీని అమలు చేయాలని, రైతుబంధు నిజమైన రైతులకే అందించాలని కోరారు. అర్హులైన వారందరికీ పింఛన్లు అందించాలన్నారు. తాను కాంగ్రెస్ పార్టీ మనిషినేనని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్నానని పేర్కొంటూనే.. మునుగోడు అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదని తేల్చిచెప్పారు. సొంత ప్రభుత్వంపై రాజగోపాల్ రెడ్డి చేసిన ఘాటు వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు బహిరంగ పోరాటంగా మారుతున్నాయా? అనే చర్చకు దారితీశాయి.

నల్లగొండ వైద్యారోగ్య శాఖకు సుస్తీ

డిప్యూటేషన్ల నుంచి కారుణ్య నియామకాల వరకు వివాదాలు

- నిబంధనలు బేఖాతర్.. కీలక పోస్టులు ఎవరికి?
- డిసిహెచ్ఎస్ వ్యవహారాలపై సమగ్ర విచారణకు డిమాండ్







నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 18 (జనంసాక్షి): నల్లగొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో చోటు చేసుకుంటున్న పరిపాలనా వ్యవహారాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. వైద్యుల డిప్యూటేషన్లు, ఆసుపత్రుల మెడికల్ సూపరింటెండెంట్ బాధ్యతల కేటాయింపు, వైద్య సెలవులు, మెడికల్ ఇన్వాలిడేషన్ ధ్రువీకరణ పత్రాల జారీ, కారుణ్య నియామకాల వరకు పలు అంశాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) వ్యవహారాలపై అనుమానాలు వ్యక్తమ వుతుండటంతో సమగ్ర విచారణ జరిపించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

సెలవుల్లోనూ ప్రైవేట్ వైద్యసేవలా?

డీసీహెచ్ఎస్ గత మూడు నెలలుగా వరుసగా వైద్య సెలవులు తీసుకుంటున్నట్లు సమాచారం. అయితే సెలవు సమయంలో సొంత ప్రైవేట్ క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తున్నారనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి. సెలవుల పొడిగింపు, తిరిగి విధుల్లో చేరే ప్రక్రియపైనా ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. వైద్య సెలవుల మంజూరులో నిబంధనలు పాటించారా? సెలవు సమయంలో ప్రైవేట్ వైద్య సేవలు అందించారా? అనే అంశాలపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

సీనియర్లను కాదని డిప్యుటేషన్లా?

2026 సాధారణ బదిలీల అనంతరం ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సీనియర్ వైద్యులకే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ కార్యాలయం సర్క్యులర్ జారీ చేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఆ ఆదేశాలను పక్కనపెట్టి ఇతర ఆసుపత్రుల నుంచి వైద్యులను డిప్యుటేషన్‌పై తీసుకొచ్చి కీలక బాధ్యతలు అప్పగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని నాలుగు ఆసుపత్రులకు సంబంధించి డిప్యుటేషన్లు చర్చనీయాంశంగా మారాయి. దేవరకొండ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ బి. రంగయ్యను మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి, నాగార్జునసాగర్ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ రవి ప్రకాష్‌ను దేవరకొండ ఏరియా ఆసుపత్రికి పంపినట్లు సమాచారం. అలాగే మిర్యాలగూడలో పనిచేస్తున్న డాక్టర్ డి. శోభారాణిని నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి, నకిరేకల్‌లో పనిచేస్తున్న డాక్టర్ శంకర్ నాయక్‌ను మర్రిగూడ సామాజిక ఆరోగ్య కేంద్రానికి డిప్యుటేషన్‌పై నియమించినట్లు ఆరోపణలున్నాయి. స్థానికంగా సీనియర్ వైద్యులు అందుబాటులో ఉన్నప్పటికీ ఇతర ఆసుపత్రుల నుంచి వైద్యులను ఎందుకు తీసుకొచ్చారు? సీనియారిటీ, అర్హత, అనుభవానికి ప్రాధాన్యమిచ్చారా? కమిషనర్ కార్యాలయ సర్క్యులర్‌ను ఏ ప్రాతిపదికన అమలు చేస్తున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కారుణ్య నియామకాలపైనా అనుమానాలు

ఇటీవల జిల్లాలో వెలుగుచూసిన నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాల వ్యవహారం కలకలం రేపింది. ఈ కేసులో డీఎంహెచ్ఓ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ అరెస్టు కావడం మరిన్ని అనుమానాలకు తావిచ్చింది. సదరు ఉద్యోగికి ప్రభుత్వ ఉద్యోగం లభించేందుకు ఆధారమైన మెడికల్ ఇన్వాలిడేషన్ ధ్రువీకరణ పత్రం జారీ వ్యవహారంలోనూ డీసీహెచ్ఎస్ పాత్రపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పత్రం జారీ కోసం భారీగా నగదు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ జరగాల్సి ఉంది. ధ్రువీకరణ పత్రం జారీకి సంబంధించిన అధికార పరిధి, వైద్య బోర్డు నివేదికలు, ప్రభుత్వ ఉత్తర్వులు, సంబంధిత దస్త్రాలు, ఆర్థిక లావాదేవీలను పరిశీలిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఉన్నతాధికారులు స్పందించాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వివాదాస్పదంగా మారిన ఈ వ్యవహారాలపై తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శితో పాటు సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. వైద్య సెలవులు, డిప్యుటేషన్ ఉత్తర్వులు, కీలక బాధ్యతల కేటాయింపు, మెడికల్ ఇన్వాలిడేషన్ ధ్రువీకరణ పత్రాలు, నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాల కేసు, కారుణ్య నియామకాలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి నిష్పాక్షిక విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏసీబీ వలలో అవినీతి సర్పంచ్

రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత

- గ్రానైట్ క్వారీ యజమానిని రూ. 30 లక్షలు డిమాండ్
- రూ. 13 లక్షలకు బేరం కుదుర్చుకుని మొదటి విడత సొమ్ము తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు



ఖమ్మం బ్యూరో, (జనంసాక్షి) : అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల వలలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులు సైతం చిక్కుకుంటున్నారు. గ్రానైట్ వ్యాపారి నుంచి భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేసి, అందులో భాగంగా రూ. 2 లక్షలు నగదు తీసుకుంటుండగా ఓ గ్రామ సర్పంచ్ బుధవారం ఖమ్మం నగరంలో ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అధికారుల వివరాల ప్రకారం.. అధికార పార్టీకి చెందిన ఒక ప్రముఖ నాయకుడికి ఖమ్మం నగరంలో శారద స్టోన్ ఎక్స్, ప్రీమియర్ గ్రానైట్, రాశి గ్రానైట్ పేర్లతో పరిశ్రమలు ఉన్నాయి. వీటితో పాటు నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం, మహబూబాబాద్ జిల్లాలోని సీరోల్ మండలం మోదుగడ్డ తండా పరిధిలోనూ ఆయనకు గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. ఈ క్వారీలు ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా నడవాలంటే పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించాలని మోదుగడ్డ తండా గ్రామ సర్పంచ్ ధరావత్ వీరు కొంతకాలంగా యాజమాన్యాన్ని వేధిస్తున్నారు. ఈ క్రమంలో సదరు కంపెనీల యాజమాన్యం నుంచి ఆయన ఏకంగా రూ. 30 లక్షలు లంచం డిమాండ్ చేశారు.

రూ. 13 లక్షలకు ఒప్పందం

ఇరువర్గాల మధ్య జరిగిన బేరసారాల అనంతరం లంచం మొత్తాన్ని రూ. 13 లక్షలకు తగ్గించేందుకు సర్పంచ్ అంగీకరించారు. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ. 2 లక్షలు చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. దీంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పక్కా ప్రణాళికతో వల పన్నిన ఏసీబీ అధికారులు, బుధవారం ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న 'శారద స్టోనెక్స్' కార్యాలయంలో సర్పంచ్ ధరావత్ వీరు రూ. 2 లక్షలు లంచం తీసుకుంటుండగా దాడి చేసి పట్టుకున్నారు. ట్రాప్ సమయంలో నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు, నిందితుడిని అరెస్ట్ చేశారు.

రిమాండ్‌కు తరలింపు

అరెస్ట్ చేసిన సర్పంచ్ ధరావత్ వీరును వరంగల్‌లోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టులో జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం హాజరుపరచనున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోందని, భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచినట్లు వారు పేర్కొన్నారు. కాగా, ఈ మూడు గ్రానైట్ కంపెనీలు గతంలో ఒక కాంగ్రెస్ నాయకుడికి చెందినవని, వాటిని బోనకల్ మండలానికి చెందిన మరో కాంగ్రెస్ నాయకుడికి విక్రయించారని సమాచారం. ప్రస్తుతం ఆ నాయకుడు ఒక కార్పొరేషన్‌కు వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.



యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు అరోబిందో ఫార్మా ఫౌండేషన్ రూ.కోటి విరాళం

పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధికి ఆర్థిక సాయం

హైదరాబాద్, నవంబరు 18 (జనంసాక్షి) : మంచిరేవులలోని యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ మౌలిక వసతుల అభివృద్ధికి అరోబిందో ఫార్మా ఫౌండేషన్ రూ.కోటి విరాళాన్ని బుధవారం డీజీపీ సీవీ ఆనంద్‌కు చెక్కును అందజేశారు. అరోబిందో ఫార్మా లిమిటెడ్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, అరోబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్ కె. నిత్యానంద రెడ్డి తరఫున ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ ఎస్. సదానంద రెడ్డి, అరోబిందో ఫార్మా లిమిటెడ్ కార్పొరేట్ వ్యవహారాల ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఐ.ఎస్.ఆర్. రావు ఈ చెక్కును డీజీపీకి అందించారు. ఈ విరాళం అందించడంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్, సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రత్యేక చొరవ చూపారు. ఫౌండేషన్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, విరాళం అందేలా కృషి చేశారు. పాఠశాలలో మెరుగైన విద్యా సదుపాయాల కల్పన, మౌలిక వసతుల బలోపేతం, విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు సమగ్ర అభివృద్ధికి అవసరమైన అవకాశాలను కల్పించేందుకు ఈ ఆర్థిక సాయం దోహదపడనుంది. ఈ కార్యక్రమంలో డిజిపి సి. వి. ఆనంద్, మహిళా భద్రతా విభాగం డిజి సౌమ్య మిశ్రా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్, ఏడీజీ (శాంతిభద్రతలు) అకున్ సబర్వాల్ తోపాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్య విలీనంపై శ్వేతపత్రం విడుదల చేయాలి

విద్యా రంగ మార్పులపై విస్తృత చర్చ జరపాలి

- పీఏవీ కన్వీనర్ ఎం. రాఘవాచారి డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 18 (జనంసాక్షి): ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేసి, ఇంటర్ బోర్డును రద్దు చేయాలన్న ప్రభుత్వ ప్రతిపాదనలపై శ్వేతపత్రం విడుదల చేయాలని పాలమూరు అధ్యయన వేదిక (పీఏవీ) డిమాండ్ చేసింది. విద్యా రంగంలో మార్పులు తీసుకురావడానికి ముందు విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరించి విస్తృత చర్చ జరపాలని కోరింది. ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మార్పుల వల్ల కలిగే ప్రయోజనాలు, పర్యవసానాలను ప్రజలకు వివరించాలని పేర్కొంది. ఇప్పటికే ప్రైవేటు విద్యాసంస్థల వ్యాపార ధోరణితో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొత్త విధానం ప్రైవేటీకరణకు మరింత ఊతమిచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. విద్యా రంగాన్ని ప్రైవేటు వలయం నుంచి బయటకు తీసుకువచ్చేలా ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించింది. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టదలిచిన విధానం, దాని లక్ష్యాలు, అమలు తీరు, ప్రభావాలను శ్వేతపత్రం ద్వారా వెల్లడించాలని పీఏవీ కన్వీనర్ ఎం. రాఘవాచారి కోరారు. విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు విద్యా రంగ భవిష్యత్తుపై విస్తృత చర్చకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

హెచ్ఐవీ నియంత్రణలో వనపర్తికి రాష్ట్రస్థాయి గుర్తింపు

'సురక్షిత్' జిల్లాగా ఎంపిక..

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభికి టీజీఎస్ఏసీఎస్ డిప్యూటీ డైరెక్టర్ అభినందనలు



వనపర్తి, నవంబర్ 18 (జనంసాక్షి): హెచ్ఐవీ నివారణ, నియంత్రణ కార్యక్రమాల్లో మెరుగైన ప్రగతి సాధించిన వనపర్తి జిల్లాకు 'సురక్షిత్' జిల్లాగా రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో) నిర్దేశించిన 95-95-95 లక్ష్యాల సాధనలో జిల్లాలో నమోదైన పురోగతికి ఈ గుర్తింపు దక్కింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ పి. మేఖల బుధవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. నాకో ఆధ్వర్యంలో నిర్వహించిన 'సమ్మాన్ సమారోహ్' కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 'సురక్షిత్' కేటగిరీకి ఎంపికైన 20 జిల్లాల్లో వనపర్తి చోటు దక్కించుకుంది. హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో 95 శాతం మందికి తమ వ్యాధి స్థితిపై అవగాహన కల్పించడం, వ్యాధి నిర్ధారణ అయిన వారిలో 95 శాతం మందికి యాంటీ రెట్రోవైరల్ థెరపీ చికిత్స అందించడం, చికిత్స పొందుతున్న వారిలో 95 శాతం మందికి వైరల్ సప్రెషన్ సాధించడం ఈ లక్ష్యాల ప్రధాన ఉద్దేశమని అధికారులు వివరించారు.

మైత్రి ఫెర్టిలిటీ సెంటర్‌లో నిబంధనల ఉల్లంఘనలు

- అక్రమాలపై డీఎంహెచ్ఓ డాక్టర్ ఆనంద్ ఆకస్మిక తనిఖీలు
- అల్ట్రాసౌండ్ యంత్రం సీజ్





మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 18 (జనంసాక్షి) : మైత్రి ఫెర్టిలిటీ సెంటర్‌పై అందిన ఫిర్యాదు మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా పలు నిబంధనల ఉల్లంఘనలు వెలుగుచూశాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.ఆనంద్ తెలిపారు. ఫిర్యాదు నేపథ్యంలో తన ఆధ్వర్యంలో వైద్యశాఖ అధికారుల బృందం మైత్రి ఫెర్టిలిటీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కె.ఆనంద్ వెల్లడించారు. ఈ తనిఖీల్లో టారిఫ్ వివరాలు, వైద్యుల అర్హతలను సక్రమంగా ప్రదర్శించకపోవడం, సిబ్బంది వివరాల్లో వ్యత్యాసాలు, అర్హతలపై అనుమానాలు, ఏఆర్టీ చికిత్సలకు సంబంధించిన రికార్డుల నిర్వహణలో లోపాలను గుర్తించినట్లు తెలిపారు. అలాగే అల్ట్రాసౌండ్ స్కానింగ్ రికార్డుల్లోనూ వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించామని, ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించినట్లు పేర్కొన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టం ఉల్లంఘనలకు సంబంధించిన అనుమానాల నేపథ్యంలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని సీజ్ చేసి, సంస్థకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు సిఫార్సు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ గీత ప్రసాద్, జిల్లా సర్వైలెన్స్ అధికారి డాక్టర్ నాగరాజ్, గైనకాలజిస్ట్ డాక్టర్ స్వర్ణలత, వైద్యాధికారి డాక్టర్ ఇర్షాద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370